ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 21.12.2025 | సంపుటి : 12 సంచిక : 152 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ద్వేషించే వారిని సైతం ప్రేమించాలి

### మానవాళికి ఏసుక్రీస్తు సందేశం ఇదే : సీఎం రేవంత్ రెడ్డి

### డిసెంబరు నెల క్రైస్తవులకే కాదు.. కాంగ్రెస్‌కు కూడా మిరాకిల్ మంత్

- ఇతర మతాలను కించపరిచేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- మైనార్టీలకు అందించే సంక్షేమం దయ కాదని అదీ వారి హక్కు
- క్రిస్మస్ వేడుకల కోసం రూ.33 కోట్ల నిధులు
- పేదల ఆకలి తీర్చాలని ఆనాడు కాంగ్రెస్ ఆహార భద్రత చట్టం తెచ్చింది
- క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వంతో పోటీ పడి విద్య, వైద్యం అందించాయి
- వచ్చే అసెంబ్లీ సమావేశంలో హెట్ రేట్ చట్టం ప్రవేశపెడతాం
- ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):ద్వేషించే వారిని కూడా ప్రేమించేలా ఏసు ప్రభువు చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించడానికి ఏసు ప్రభువు జన్మించారన్న సీఎం కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ నెల కీలకమైందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ కూడా డిసెంబర్ నెలలోనే జన్మించినట్లు గుర్తుచేశారు. మిగతా 2లో..





అజ్మీర్ దర్గాకు సీఎం చాదర్ సమర్పణ 2లో..

## ఇంత ఉదాసీనత సహించేది లేదు

2లో

- 16 మంది ఎమ్మెల్యేలకు క్లాస్‌పీకిన రేవంత్
- నిబంధనలకు లోబడి పనిచేయండి
- మీ వైఖరి వల్ల కాంగ్రెస్ పట్టున్న ప్రాంతాల్లో సర్పంచులను కోల్పోయామని ఆగ్రహం



## ఫోన్ ట్యాపింగ్ కేసులో 'సిట్' దూకుడు

ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం

ఆధారాలు రాబట్టే యత్నాల్లో అధికారులు

## హైదరాబాద్‌కు ఉపరాష్ట్రపతి

సీపీ రాధాకృష్ణన్‌కు మంత్రి శ్రీధర్ బాబు స్వాగతం



## మాజీ అగ్నివీర్‌లకు పెద్దపీట

- బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో కోటా పెంపు
- 10 శాతం నుంచి 50 శాతానికి సవరణ
- నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్

వివరాలు 2వ పేజీలో..

## బడ్జెట్ రూపకల్పనకు తెలంగాణ ఆర్థికశాఖ కసరత్తు

ఈ మేరకు అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ఆర్థికశాఖ 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు కోరింది. జనవరి 3 లోపు ప్రతిపాదనలు మిగతా 2లో..

## గాంధీ పేరు మార్చడాన్ని సహించం



### ఉపాధి హామీ రద్దుకు కేంద్రం కుట్ర

### పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోంది : సోనియా

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాన్ని బలహీనపరిచేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్ది కాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందన్నారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 20ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారిన వారి జీవితాలకు ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ ఇచ్చిందన్నా రు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభు త్వం అణచివేసిందని ఆరోపించారు. గడిచిన 11 ఏళ్లుగా మిగతా 2లో..

### గాడ్సేని పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగించారు

- గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం మోదీ, అమిత్‌షాకు లేదు
- 'ఉపాధి హామీ' పేరు మార్పును వ్యతిరేకిస్తూ.. పీసీసీ ఆధ్వర్యంలో నిరసన

2లో..

## తెలంగాణలో డ్రగ్స్ సరఫరా.. ఆరుగురి అరెస్ట్

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో న్యూ ఇయర్ వేడుకల్లో ఏటా పెద్దఎత్తున డ్రగ్స్ పట్టుబడతాయి. ఏడాది పొడవునా జరిగే మత్తు పదార్థాల వ్యాపారంలో 80-90 శాతం డిసెంబరు-జనవరి మధ్య అవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు డ్రగ్ పెడ్లర్లను ఈగల్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 330 గ్రాముల గంజాయి, 3 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల స్వాధీనం మిగతా 2లో..





## నేడు కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం

### నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చ

- ఈ అంశాలే ఎజెండాగా ఉద్యమ కార్యాచరణకు పార్టీ సిద్ధం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించనున్న కేసీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ మిగతా 2లో..



## ఇక ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

- పంచాయితీ ఫలితాలతో కాంగ్రెస్‌కు భయపట్టుకుంది
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేది డౌటే
- రైతుల కష్టాలను ప్రపంచానికి కనిపించొద్దనే యూరియా యాప్ తెస్తున్నారు
- జీహెచ్ఎంసీల్లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా
- తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ మొదలవుతుందని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసిందని.. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని వెల్లడించారు. కేసీఆర్ బహిరంగ సభలపై ఆదివారం సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ మిగతా 2లో..

### పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు

## వెన్నెముక వంటివి

- ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు
- జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే
- లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను మిగతా 2లో..






## ఏనుగుల గుంపును ఢీకొని.. పట్టాలు తప్పిన రైలు

ఘటనలో ఎనిమిది ఏనుగుల మృతి

పట్టాలు తప్పిన 5 బోగీలు..

ప్రయాణికులు సురక్షితం


గౌహతి(జనంసాక్షి):అస్సాంలో శనివారం తెల్లవారు జామున రైలు ప్రమాదం చోటు చేసుకుంది. సెరాంగ్ నుంచి ఢిల్లీ నుంచి బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ ఏనుగుల గుంపును ఢీ కొట్టింది. ఈ ఘటనలో 8 ఏనుగులు మృతిచెందగా.. మరోకటి తీవ్రంగా గాయపడింది. ప్రమాదం ధాటికి రైలులోని 5 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే మిగతా 2లో..

## పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల పెంపు

ఆదేశాలు జారీ చేసిన మంత్రి దామోదర

రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపుకు వైద్యారోగ్యశాఖ కీలక నిర్ణయాలు

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ మిగతా 2లో..






## అమెరికాను వీడి వెళ్లొద్దు

- తమ ఉద్యోగులకు గూగుల్ అడ్వయిజరీ
- సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో సంకటం
- గందరగోళంలో అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ ఇప్పుడ కలకలం సృష్టిస్తోంది. ఈ కారణంగా చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ కొందరు ఉద్యోగులను హెచ్చరించింది. అమెరికాను వీడి బయటకువెళ్లొద్దని అడ్వైజరీ జారీ చేసినట్లు ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమయ్యే ఉద్యోగులు నెలల పాటు ఎదురుచూడాల్సి వస్తుందని గూగుల్ న్యాయనిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు మిగతా 2లో..

## సిరియాపై అమెరికా వైమానికదాడులు

ఇస్లామిక్ టెర్రరిస్టులలే లక్ష్యంగా ఆపరేషన్

అమెరికా సిబ్బందిపై దాడికి ప్రతీకారంగానే చర్యలు




2లో..

## జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలి

బీజేపీకి ఒక్క అవకాశమివ్వండి

డబులింజన్ సత్తా ఏమిటో చూపిస్తాం: ప్రధాని మోదీ



కోల్‌కతా(జనంసాక్షి): జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బెంగాల్‌లో ఆయన పర్యటించారు. పశ్చిమ బెంగాల్‌లోని తాహేర్‌పూర్‌కు వెళ్లారు. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ల్యాండింగ్ సాధ్యం కాలేదు. కొంతసేపు హెలిప్యాడ్‌పై చక్కర్లు కొట్టి కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ప్రధాని విమానాశ్రయం నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బంకిం చంద్ర ఛటర్జీకి నివాళులర్పించారు. వందేమాతరం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మంత్రమని, వందేమాతరాన్ని దేశ నిర్మాణానికి మంత్రంగా మార్చాలన్నారు.కేంద్ర ప్రభుత్వం దేశ పౌరులతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. జీఎస్టీ బెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉపశమనం ఇచ్చిందని, మిగతా 2లో..

## తండ్రికి బీమా చేయించి.. పాముకాటుతో అంతమొందించారు

- రూ. 3 కోట్ల బీమా సొమ్ము కోసం కన్నతండ్రినే కడతేర్చిన కుమారులు
- తమిళనాడులో అమానవీయ ఘటన

చెన్నై(జనంసాక్షి):బీమా సొమ్ము కోసం ఇద్దరు అన్నదమ్ములు తమ తండ్రినే పాము కాటుతో చంపించిన అమానవీయ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. దర్యాప్తు సమయంలో బీమా సంస్థ అధికారులకు అనుమానం రావడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాకు చెందిన గణేశన్ (56) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగశాల సహాయకుడిగా విధులు నిర్వర్తించేవాడు. అతడు పాముకాటుతో మరణించినట్లు అక్టోబర్‌లో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంత్యక్రియల అనంతరం మృతుడి పేరు మీద చేయించిన రూ.3 కోట్ల బీమా డబ్బుల కోసం అతడి ఇద్దరు కుమారులు బీమా సంస్థను ఆశ్రయించారు. మిగతా 9లో..

## గాడ్సేని పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగించారు

హైదరాబాద్(జనంసాక్షి): ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ నగరంలో కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ఎంజీ రోడ్‌లో పీసీసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసనలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, వివేక్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, వీహెచ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం పేరు చెబితే భాజపా నేతల గుండెల్లో రైళ్లు పరుగెడతాయన్నారు. గాడ్సేని పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగించారని మండిపడ్డారు. “ గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం మోదీ, అమిత్‌షాకు లేదు. గాంధీ పేరు చిరస్మరణీయం. ప్రజలకు 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన భాజపా ఈ పథకానికి నిధుల కోత పెడుతూ వస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం అప్రజాస్వామికం. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు భాజపా తెరలేపింది. సోనియా గాంధీ కుటుంబంపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నారు. లౌకికవాద దేశంలో మోదీ, అమిత్ షా పప్పులు ఉడకవు. కులాలు, మతాల పేరిట రాజకీయం చేసేవారికి గుణపాఠం తప్పదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం” అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## గాంధీ పేరు మార్చడాన్ని సహించం

గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరు తొలగించడమే కాకుండా పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియా గాంధీ దుయ్యబట్టారు. ఎటువంటి చర్చ లేకుండా, ఎవర్నీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు ఉపరాష్ట్రపతి

హైదరాబాద్(జనంసాక్షి):భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్ము ఇప్పటికే నగరానికి రాగా.. శనివారం సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సరోవర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు.వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు.

**సిరిసిల్ల మున్సిపాలిటీ కార్యాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా**

నెం. ఎఫ్1/2804/2025 తేదీ: 19-12-2025

**ఆసక్తి వ్యక్తీకరణ (EOI)**

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు (స్టెరిలైజేషన్) చేయుటకు, జంతు జనన నియంత్రణ (ABC) మరియు యాంటీ-రాబిస్ వ్యాక్సినేషన్ (ARV) కార్యక్రమాన్ని అమలు చేయడానికి, సిరిసిల్ల మున్సిపాలిటీ ప్రతిష్టాత్మక ఏజెన్సీల నుండి (2) సంవత్సరాల కాలానికి ఆసక్తి వ్యక్తీకరణలను (EOI) ఆహ్వానిస్తున్నది. ఆసక్తి గల ఏజెన్సీలు పూర్తి చేసిన పత్రాలతో పాటు 30-12-2025 న తేదీ సాయంత్రం 4:00 గంటలలోపు ఈ కార్యాలయంలో సమర్పించవలసిందిగా కోరడమైనది.

**షరతులు:**

ఆసక్తి గల ఏజెన్సీలు రూ. 20,000/- తిరిగి చెల్లించని డిమాండ్ డ్రాఫ్ట్ మరియు రూ. 50,000/- బిడ్ సెక్యూరిటీని EMD కింద, ‘ది కమిషనర్, సిరిసిల్ల మున్సిపాలిటీ’ వారి పేరు మీద తీసి, EOIపత్రంతో పాటు సమర్పించాలి.బిడ్డర్ ఆర్థిక కోట్‌ను విడిగా సమర్పించాలి, అందులో ARV,ABC శస్త్రచికిత్సలు, కుక్కలను పట్టుకోవడం మరియు వదిలివేయడం (రవాణాతో సహా), సిరిసిల్లలోని ప్రస్తుత ఃఅ కేంద్రాన్ని నిర్వహించడం మరియు విద్యుత్ ఛార్జీలు, నీటి ఛార్జీలు మొదలైన అనుబంధ ఖర్చులకు సంబంధించిన రేట్లను స్పష్టంగా పేర్కొనాలి. కోట్ చేసిన రేట్లు ఎఫ్. నెం. 24-02-2020-21/ABC, తేదీ 05-04-2022 ప్రకారం ఉండాలి.సంస్థాగత వివరాలు: రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు, పాన్/టాన్ కార్డులు మరియు వార్షిక పన్ను నివేదికల వంటి వివరాలు. జంతు సంక్షేమ సంస్థ (AWS) భారత జంతు సంక్షేమ బోర్డు యొక్క గుర్తింపు పత్రాన్ని సమర్పించాలి.మౌలిక సదుపాయాల వివరాలు: అందుబాటులో ఉన్న జంతు ఆశ్రయాలు, ఆపరేషన్ థియేటర్లు, వెటర్నరీ సర్జన్లు (పూర్తికాలం/పార్ట్‌టైమ్) మరియు శస్త్రచికిత్స అనంతర సంరక్షణ సౌకర్యాలు .పద్ధతి మరియు వనరులు: పట్టుకోవడానికి ప్రతిపాదించబడిన కుక్కల సంఖ్య, పట్టుకునే వాహనాలు, కుక్కలను పట్టుకునేవారు మరియు ఇతర అవసరమైన పరికరాలు/సామగ్రి వివరాలు.అనుభవం: ABC కార్యకలాపాల కోసం గతంలో పొందిన గ్రాంట్ల వివరాలు మరియు గత సంవత్సరాలలో స్టెరిలైజ్ చేయబడిన జంతువుల సంఖ్య రికార్డు. వర్తింపు: యాంటీ-రేబిస్ టీకా (ARV) మరియు C.N.V.R.. ప్రోటోకాల్ (క్యాచ్, న్యూటర్, టీకా, విడుదల)తో సహా వీధి కుక్కల స్టెరిలైజేషన్ కోసం అన్ని కార్యకలాపాలు ప్రామాణిక ఆపరేటింగ్ (SOP) వివరాలు.భద్రతా చర్యలు: ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని సిబ్బందికి భద్రతా పరికరాలు మరియు రేబిస్‌కు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని నిర్ధారించడం.పూర్తి వివరాల కోసం, కార్యాలయ సమయాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిరిసిల్ల మునిసిపాలిటీని సంప్రదించండి.ఎటువంటి కారణాలు చూపకుండా ఏవైనా లేదా అన్ని ఆఫర్‌లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కు కమిషనర్‌కు ఉంది.

**కమిషనర్**
**సిరిసిల్ల మున్సిపాలిటీ పాలిటీ**

DIPR No.12348-PP/CL/ADVT/1/2025-26

# ద్వేషించే వారిని సైతం ప్రేమించాలి

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రుల పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.తెలంగాణలో క్రిస్మస్ జరుపుకుంటున్నామంటే అందులో సోనియాగాంధీ పాత్ర, త్యాగం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇదే డిసెంబర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. శాంతిని కాపాడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.పేదవాడి ఆకలి తీర్చాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఆహార భద్రత చట్టం తెచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా పేదల ఇళ్లలో వెలుగులు నింపామన్నారు. రెండేళ్లలో వ్యవసాయంపై రూ.1.04 లక్షల కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలిపారు. క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వంతో పోటీ పడి విద్య, వైద్యం అందించాయని అన్నారు.మైనార్టీలకు అందించే సంక్షేమం దయ కాదని అదీ వారి హక్కు అని సీఎం రేవంత్ తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్‌లకు సంబంధించిన స్మశానాలకు స్థలం ఇవ్వాలంటే ప్రభుత్వం వద్ద లేదని ఊరికి దూరంగా స్మశానాలు నిర్మించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని మతాలపట్ల తాము సమానంగా ఉంటామన్న సీఎం ఇతర మతాలను కించపరిచేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో హేట్ రేట్ చట్టం ప్రవేశపెడతామని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని మంత్రి అజారుద్దీన్ అన్నారు. క్రిస్మస్ వేడుకలను సీఎం ఘనంగా జరిపిస్తున్నారని తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న మేలుకు ఎప్పుడూ అండగా ఉంటూ మద్దతూ ఇస్తామని అన్నారు. క్రిస్మస్ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్ల నిధులు కేటాయించినట్లు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ వెల్లడించారు. రూ.30 వేల చొప్పున రాష్ట్రంలోని 7 వేల చర్చిలకు నిధులు అందుతాయని తెలిపారు.



**ఆజ్మీర్ దర్గాకు సీఎం చాదర్ సమర్పణ**

అజ్మీర్ షరీఫ్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, టీఎంఆర్ఈఐఎస్ వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు. - జనంసాక్షి

# ఇంత ఉదాసీనత సహించేది లేదు



**హైదరాబాద్(జనంసాక్షి):** పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు.రెబల్స్‌ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు.తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. 3,502 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా 688 స్థానాలు పొందగా... ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు. అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలోనే దానికి బాధ్యులైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.

## నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్

**ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నమోదైన కేసులలో విచారణకు వ్యక్తిగతంగా హాజరైన ముఖ్యమంత్రి**

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాంపల్లి ప్రజాప్రతినిధుల స్పెషల్ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ, తిరుమలగిరి, మట్టంపల్లి పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన కేసుల విచారణకు ఆయన హాజరు కావడం విశేషం. మూడు కేసులు ప్రధానంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు లేదా రాజకీయ కార్యక్రమాల సందర్భంలో నమోదయినవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. కోర్టులో జడ్జి ముందు రేవంత్ రెడ్డి ఎగ్జామినేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మూడు కేసుల్లోనూ ఈ దశ పూర్తయిన నేపథ్యంలో తదుపరి విచారణ లేదా తీర్పు కోసం కోర్టు తేదీ నిర్ణయించనుంది. సీఎం హాజరుతో కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మీడియా, సామాన్యులను కోర్టు హాల్ సమీపంలోకి అనుమతించలేదు. కాంగ్రెస్ నేతలు ఈ కేసులను రాజకీయ కుట్రతో మోపినవని విమర్శిస్తున్నారు.

## బడ్జెట్ రూపకల్పనకు తెలంగాణ ఆర్థికశాఖ కసరత్తు

పంపాలని అన్ని శాఖలకు సూచించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సవరించిన ప్రతిపాదనలు కూడా పంపించాలని ఆర్థికశాఖ అధికారులు కోరారు.

## నేడు కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం

ప్రకటించనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా కేసీఆర్ అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు.కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

## పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల పెంపు

అందించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముక వంటివి

రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

## ఏనుగుల గుంపును ఢీకొని

తెలిపింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## తెలంగాణలో డ్రగ్స్ సరఫరా.. ఆరుగురి అరెస్ట్

చేసుకున్నారు. వరంగల్ జిల్లాలో ముగ్గురు గంజాయి సరఫరా దారులను అరెస్టు చేసి 80 గ్రాములు, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులు ఏపీ, తెలంగాణ మధ్య అంతర్రాష్ట్ర గంజాయి సరఫరాదారులుగా గుర్తించారు.

## జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలి

దుర్గాపూజ, ఇతర పండుగల సమయంలో దేశవ్యాప్తంగా ప్రజల చాలా ప్రయోజనం పొందారన్నారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ నుంచి రక్షణ లభిస్తోందని ఆరోపించారు. గంగానది బీహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుందని, బీహార్ బెంగాల్‌కు మార్గం చూపిందని పేర్కొన్నారు.

# అమెరికాను వీడి వెళ్లొద్దు

దూరంగా ఉండాలని సూచించారు. ఈమేరకు యాజమాన్యం సిబ్బందికి మెయిల్ పంపింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్,జే,ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా వెలుపల ఉన్నవారి విషయంలో మాత్రం ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా.. కొత్త వెట్టింగ్ విధానం వల్ల వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గూగుల్ అడ్వయిజరీ దీనిని సమర్థించేలా ఉంది. దీంతో వచ్చే ఏడాది వరకు ఉద్యోగులకు కష్టాలు తప్పేలా లేవు.

## సిరియాపై అమెరికా వైమానికదాడులు

**న్యూయార్క్(జనంసాక్షి):**సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ స్థావరాలను అమెరికా టార్గెట్ చేసింది. ఆ స్థావరాలపై అమెరికా సైన్యం వైమానిక దాడులు చేసింది. ఇటీవల అమెరికా సిబ్బందిపై సిరియా దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఓ అధికారి తెలిపారు. అనుమానిత ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియాలో ఉన్న అమెరికా సైనిక సిబ్బందిపై దాడి చేశారని, దానికి ప్రతీకారం తీర్చుకుంటామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల వెల్లడించారు. ఐఎస్ఐఎస్ ఫైటర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆయుధ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా డిఫెన్స్ మంత్రి పీట్ హెగ్‌సేత్ తెలిపారు. ఆపరేషన్ హాక్‌ఐలో భాగంగా ఆ దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. ఇదేమీ యుద్ధం కాదు అని, ఇది కేవలం ప్రతీకారం మాత్రమే అని ఆయన అన్నారు. మా శత్రువులను వేటాడామని, వాళ్లను చంపేశామని అన్నారు. ఈ దాడుల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెంట్రల్ సిరియాలో ఉన్న ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన అనేక టార్గెట్లను ధ్వంసం చేసినట్లు ఇద్దరు అమెరికా అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ సిరియాలోని పల్మైరాలోఉన్న దళాలపై జరిపిన దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ ఇంటర్‌ప్రిటర్ మరణించారు. అమెరికా దళాలకు చెందిన సుమారు వెయ్యి మంది సైనికులు ఇంకా సిరియాలోనే ఉన్నారు.

# ఇక ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

ఆడుకుంటాడో నాకు తెలియదు.. నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటానని అన్నారు. రేవంత్ ఇంట్లో ఉన్న మహిళలు, పిల్లలు, మనవడి గురించి మాట్లాడనని తెలిపారు. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబసభ్యుల విషయంలో చిల్లర రాజకీయాలు చేయనని స్పష్టం చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని విషయాలపై కేసీఆర్ రేపు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ మొదలవుతుందని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసిందని.. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని వెల్లడించారు. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మీడియా అడిగిన ప్రశ్నకు కూడా కేటీఆర్ సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోనే ప్రెస్‌మీట్ పెట్టి బీఆర్ఎస్‌లోనే ఉన్నామనడం పెద్ద కామెడీ అని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ 66 శాతం స్థానాల్లో గెలిచినట్లు రేవంత్ రెడ్డి చెబుతున్నది నిజమైతే.. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పది మందితో రాజీనామా చేయించి ఉప ఎన్నికకు రావాలని సవాలు విసిరారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేను ఫెయిల్ కాలేదని కేటీఆర్ తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాకనే 32 జిల్లా పరిషత్, 136 మున్సిపాలిటీలను గెలిచామని పేర్కొన్నారు. అదే రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేకపోయాడని విమర్శించారు. తాను ఐరెన్ లెగ్ కాదని.. రేవంత్ రెడ్డి, రాహుల్‌గాంధీలు ఐరన్ లెగ్‌లు అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే సూచిక అని అన్నారు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించదని అన్నారు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. జీహెచ్ఎంసీల్లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదని ఆరోపించారు. గ్రేటర్‌ను మూడు కార్పొరేషన్లు చేయాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచన అని తెలిపారు. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై ముఖ్యమంత్రికి స్పష్టత లేదని అన్నారు.2028లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ కిట్టీ పార్టీ ఆంటీ మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫార్ములా ఈ కార్ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి అర్థమైందని అన్నారు. రేవంత్ రెడ్డి దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రాకు వెళ్లిపోతున్నాయని తెలిపారు. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లిపోయిందని తెలిపారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. టైమ్ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీపరంగా ఇవ్వమని చెప్పడానికి రేవంత్ రెడ్డి ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతం సీట్లు బీసీలకే ఇచ్చామని గుర్తు చేశారు. రేవంత్ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమకేమీ లేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డులు బీసీలకు ఇచ్చింది మేమే అని తెలిపారు. రాజకీయం వేరే.. విద్య, ఉపాధిలో బీసీలకు ఎందుకు రిజర్వేషన్లు ఇవ్వరని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.అఖిలేశ్ యాదవ్ మా పాత దోస్త్ అని కేటీఆర్ తెలిపారు. అఖిలేశ్‌ను కలిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా స్వయంగా అన్నారని గుర్తుచేశారు. బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు పోయాడో రామచంద్రరావు చెప్పాలని డిమాండ్ చేశారు.

## మాజీ అగ్నివీర్‌లకు పెద్దపీట

**బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో కోటా పెంపు**

**10 శాతం నుంచి ఉన్న 50 శాతానికి సవరణ**

**నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సరిహద్దు భద్రతా దళం నియామకాల్లో నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో గతంలో 10 శాతంగా ఉన్న మాజీ అగ్నివీరుల కోటాను 50 శాతానికి పెంచినట్లు వెల్లడించింది. మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన ఖాళీలకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపడతామని నోటిఫికేషన్‌లో పేర్కొంది. రెండు దశల్లోనూ మాజీ సైనికులకు 10 శాతం కోటా కొనసాగుతుంది. తొలి బ్యాచ్ అగ్నివీరులకు 5 ఏళ్లు, మిగిలిన అగ్నివీరులకు 3 ఏళ్ల వరకు వయోపరిమితి విషయంలో సడలింపు ఉంటుంది.త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి జూన్ 2022లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలటరీ బలగాల్లో నియమించుకుంటున్నారు. ఇందులో భాగంగానే గతంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు దళాలలోని కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఖాళీలలో 10 శాతం కోటా మాజీ అగ్నివీరులకు కేటాయించారు. తాజా నోటిఫికేషన్‌లో ఇతర కేంద్ర పారామిలటరీ దళాల్లో కాకుండా కేవలం బీఎస్ఎఫ్ నియామకాల్లో మాత్రమే అగ్నివీరుల కోటాను 10నుంచి 50 శాతానికి పెంచారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వగా.. రాత పరీక్షలో వారు ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

# పది రోజుల్లో అక్రిడిటేషన్లు

- విధివిధానాలు ఖరారు చేస్తున్నాం
- ఈ సంవత్సరం అక్రిడిటేషన్ల ప్రక్రియ
- కొత్త సంవత్సరం ఇంటి జాగలపై తీపి కబురు
- టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఫోన్‌కాల్
- జర్నలిస్టులకు మాది అనుకూల ప్రభుత్వం : ఎమ్మెల్యే మట్టా రాగమయి




ఖమ్మం బ్యూరో ( జనం సాక్షి) : జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ మరో పదిరోజుల్లో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం చివరికి అక్రిడిటేషన్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు చెబుతామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్లో శనివారం నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా మహాసభలను ఉద్దేశించి ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మహాసభలకు హాజరయ్యేందుకు బయలుదేరిన మంత్రికి సీఎం కార్యాలయం నుంచి ఆకస్మిక పిలుపు రావడంతో హైదరాబాద్ వెళ్లారు. అనివార్య కారణాలవల్ల రాలేక పోతున్నందుకు మన్నించాలని జర్నలిస్టులను కోరిన మంత్రి..తన సందేశాన్ని ఫోన్ ద్వారా వినిపించారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, వచ్చే పదిరోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం ఆరంభంలో ఇండ్ల స్థలాల విషయమై తీపి కబురు అందిస్తామని చెప్పారు.

### జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటాం

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి కృషితో జర్నలిస్టులకు మంచిరోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజానికి జర్నలిస్టులు చేసే సేవ మహోన్నతమైనదని, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్ అన్నారు. పత్రికలు, చానళ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉండాలని డాక్టర్ యలమంచలి రవీంద్రనాథ్ సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులు సమస్యల వెలికితీయడంలో ముందున్నారని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభల సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం లోగోతో కూడిన జెండాలను చేతబట్టి, దప్పులదరువులో అమరవీరుల స్థూపం వద్ద ఈ ర్యాలీని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్, వైరా రోడ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఇల్లెందు రోడ్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ మీదుగా ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా మార్గమధ్యలో అంబేద్కర్, శ్రీశ్రీ విగ్రహాలకు యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నివాళులర్పించారు. ఈ మహాసభలో టీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ రాజశేఖర్, బుడిగె రఘు యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస రెడ్డి

ఈ మహాసభల్లో భాగంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ ఖదీర్, కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి, కోశాధికారిగా తేనె వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా సాగర్ దువ్వ, సహాయ కార్యదర్శులుగా జక్కంపుడి కృష్ణ, నాగుల్ మీరా, ఈసీ మెంబర్లుగా కొత్త యాకేష్, నూకల రామచంద్రమూర్తి, అయ్యప్ప, అంజయ్య, జీ వెంకటేశ్వర్లు, ఎస్కే జానీపాషా, మేడా సంపత్, చల్లా నర్సింహారెడ్డి, కే సుధాకర్, సయ్యద్ అంజాద్, మోహన్ రావు, బీ వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి, మేకల రమేశ్, కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా బాలకృష్ణ, నాగేందర్ రెడ్డి, మధుశ్రీ ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులుగా ఆవుల శ్రీనివాస్, రవికిరణ్ కెమెరామెన్ విభాగం అధ్యక్షునిగా ఫయాజ్, కార్యదర్శిగా గణేష్ ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా తురుగ రామచంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా వీసారపు అంజయ్య, భారతి జాయింట్ సెక్రటరీగా రామకృష్ణ నాయక్, ఈసీ మెంబర్లుగా శివారెడ్డి ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా పల్లా కొండల్ రావు, కందికొండ శ్రీనివాస్, బోయినపల్లి అంజయ్య ఎన్నికయ్యారు.

## జనవరి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం

- ప్రతి జిల్లాలో రోడ్డు భద్రత ఫోర్స్ వాలంటీర్స్ బృందాలను ఏర్పాటు చేయాలి
- నెలాఖరులోపు జిల్లా కలెక్టర్ ల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో రోడ్ సేఫ్టీ కమిటీల సమావేశం నిర్వహించాలి.
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్ (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా జనవరి మాసంలో జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు లో తీసుకోవాల్సిన కార్యాచరణ పై సచివాలయంలో సిఎస్ కే.రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి లతో కలసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత సంవత్సరం తెలంగాణ లో 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా ,7949 మరణాలు జరిగాయని ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు నిబంధనలు ఉల్లంఘించి రాష్ డ్రైవింగ్ , డ్రైవర్ నిరక్ష్యం వల్లే జరిగినట్లు గుర్తించామని ప్రమాదాలను నివారించడానికి రోడ్డు నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ రోడ్డు నిబంధనలపై ప్రజలకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పై అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రోడ్డు సేఫ్టీ పై ప్రతి జిల్లాలో ఏర్పడిన రోడ్ సేఫ్టీ కమిటీ లు ఈ నెలాఖరులోపు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. దీనిలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఆర్ అండ్ బి అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఇందులో రవాణా శాఖ, ఆర్టీసీ, విద్యా శాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో రోడ్ భద్రతా ఫోర్స్ వాలంటీర్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో ,పాఠశాలల్లో అధికారులతో కలిసి ఈ టీం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ బృందాలకు జనవరి 26 న ప్రశంస పత్రాలతో సత్కరించారు. 2026 జనవరి లో జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలు హెల్మెట్ బైక్ ర్యాలీలు , వాక్ థన్ పరుగులు , రంగోలి ముగ్గుల పోటీలు , రోడ్డు భద్రత ప్రతిజ్ఞలు , ఆరోగ్య శిబిరాలు , రక్తదాన శిబిరాలు ,మోటార్ సైకిల్ చిన్న హెల్మెట్ స్టిక్కర్ అతికించడం ద్వారా అవగాహన కల్పించడం , కారు విండ్ స్క్రీన్‌కు చిన్న సీట్ బెల్ట్‌ను అతికించడం ద్వారా అవగాహన కల్పించడం ,అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు – సమావేశాలు, వ్యాస రచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, రోడ్లపై ఎన్‌సీసీ బృందాల ద్వారా అవగాహన, ఆడియో విజువల్ మార్గాల ద్వారా అవగాహన ,స్థానిక రేడియో, సిటి కేబుల్స్‌లో రోడ్డు భద్రత చర్చలు, సినిమా థియేటర్లలో అవగాహన స్లైడ్‌లు మరియు వీడియోలు ,హోర్డింగ్‌ల ద్వారా అవగాహన, కళాకారుల బృందాల చేత అవగాహన ఆర్టీసీ బస్సు కండక్టర్ల ద్వారా కరపత్రాల పంపిణీ, బస్టాండ్లలో హోర్డింగ్‌లు, డిస్ప్లేలు, అనౌన్సర్ల ద్వారా అవగాహన ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. చీఫ్ సెక్రటరీ కే.రామ కృష్ణరావు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కింది స్థాయి నుండి రాజధాని వరకు విస్తృత అవగాహన ద్వారానే మరణాల రేటు తగ్గించవచ్చని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ఓవర్ లోడ్ విషయంలో కఠినంగా వ్యవహరిం చాలని ఇటీవల ప్రమాదాలకు ప్రమాద కారణం ఓవర్ లోడ్ వల్లే అని సూచించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జిల్లా కలెక్టర్ లు , అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఎంజేపి సెక్రటరీ సైదులు ,నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు ,వివిధ సంక్షేమ శాఖ అధికా రులు ,రవాణా శాఖ అధికారులు , పోలీస్ ,ట్రాఫిక్ , ఆర్ అండ్ బి, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.



## కడియం గారూ స్వాగతం

- జనగామ జిల్లాలో ఫ్లెక్సీ కలకలం

జనగామ, డిసెంబర్20 (జనంసాక్షి) : జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌లో ఫ్లెక్సీల రాజకీయం హాట్‌టాపిక్‌గా మారింది. తిరుమలనాథ స్వామి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ శ్రీకారోత్సవానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్వాగతం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రాజకీయంగా చర్చకు దారితీసింది. ఫ్లెక్సీతో బీఆర్ఎస్ శ్రేణులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. తమ పార్టీలోనే ఉన్నట్టు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు లిఖితపూర్వకంగా కడియం శ్రీహరి వివరణ ఇవ్వడంతో ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. ఓవైపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫోటో.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఫోటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్టేషన్ ఘన్‌పూర్ ఫ్లెక్సీ పాలిటిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## హిజాబ్ ఘటనపై నితీష్ కుమార్ క్షమాపణ చెప్పాలి

- రాజీనామా చేయాలని హైదరాబాద్ కాంగ్రెస్ డిమాండ్
- చార్మినార్ సమీపంలో వందలాది కాంగ్రెస్ కార్యకర్తల నిరసన




హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వెంటనే ప్రజల ముందు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా నేతృత్వంలో వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం చారిత్రక చార్మినార్ సమీపంలో భారీ నిరసన చేపట్టారు. పట్నాలో జరిగిన ఒక ప్రజా కార్యక్రమంలో ఒక మహిళా డాక్టర్ హిజాబ్‌ను ముఖ్యమంత్రి లాగి తొలగించిన ఘటనకు నిరసనగా ఈ ఆందోళన జరిగింది. ఈ చర్య మహిళ గౌరవం, శరీర స్వేచ్ఛ మరియు రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన ఉల్లంఘన అని నిరసనకారులు పేర్కొన్నారు. కఠిన చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. నిరసన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖాలిద్ సైఫుల్లా, కేవలం క్షమాపణ సరిపోదని, బాధ్యత నిర్ధారించేందుకు నితీష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. వీడియోలో రికార్డ్ అయి విస్తృతంగా ప్రసారమైన ఈ ఘటన దేశ అంతఃకరణను కుదిపేసిందని, దీనిని తేలికగా పక్కన పెట్టలేమని అన్నారు. ప్రజల ముందే జరిగిన శారీరక దాడిగా దీనిని అభివర్ణిస్తూ, హోదా లేదా అధికారం ఎంత ఉన్నా, అనుమతి లేకుండా ఏ మహిళను తాకే హక్కు ఎవరికీ లేదని, ఆమె దుస్తులపై జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదని అన్నారు. నిరసనకు మద్దతుగా నిలిచిన హైదరాబాద్ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధులకు ఖాలిద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆందోళనలో భాగంగా, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 8826777445 అనే టోల్-ఫ్రీ మిస్డ్ కాల్ నంబర్‌ను ప్రారంభిస్తున్నట్లు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు ప్రకటించారు. మిస్డ్ కాల్ ఇస్తే జాతీయ మహిళా కమిషన్‌కు నితీష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నేరుగా ఈమెయిల్స్ పంపే లింక్ అందుతుందని తెలిపారు. కమిషన్ స్పందించే వరకు వేలాది, ఆపై లక్షల సంఖ్యలో ఈమెయిల్స్ పంపే బల్క్ ఈమెయిల్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేపడుతుందని అన్నారు. ఈ నిరసనలో ప్రొఫెషనల్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, యువ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. షైలేందర్, నవిక, అష్ఫాక్ ఖాన్, ఉజ్మా షాకిర్, మమత నాగి రెడ్డి తదితరులు, అలాగే అసెంబ్లీ ఇన్‌చార్జీలు నాగేష్, రాజేష్ హాజరయ్యారు.



## హుజూరాబాద్ గడ్డ రుణం తీర్చుకుంటా

- ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్

హైదరాబాద్ (జనంసాక్షి) : గెలిచిన సర్పంచులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపించాలని చెప్పారు. హుజూరాబాద్ పర్యటనలో భాగంగా స్థానిక ఎన్నికల్లో గెలిచిన సర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. ఈ హుజురాబాద్ గడ్డ రుణం తీర్చుకుంటానని, ఎమ్మెల్సీగా హుజురాబాద్ ప్రాంత గ్రామాల అభివృద్ధికి పాటు పడతానని స్పష్టం చేశారు. హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచులను అభినందించి, శాలువాలు కప్పి సన్మానించారు.

## పర్యాటక బ్రోచర్ ఆవిష్కరించిన కొండా సురేఖ

- పర్యాటక ప్రదేశాల సమాచారంపై పోటీలు




హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 20 (జనం సాక్షి) : పర్యాటక శాఖ 100 ప్రదేశాలను వీకెండ్ డెస్టినేషన్ గా చెయ్యడానికి ఔత్సాహికుల నుండి పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ వెబ్సైట్ లో అప్లోడ్ చెయ్యడానికి ఈ పోటీని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా రూపొందించిన పోస్టర్ ను మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశం లో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్,మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పై,జిల్లా పర్యాటక శాఖ అధికారి యం శివాజీ, ఇతర అధికారులు పోస్టర్ ను విడుదల చేశారు.

### వీకెండ్ డెస్టినేషన్ గా వరంగల్

రాజధాని హైదరాబాద్ నుంచి రెండు, మూడు గంటల ప్రయాణంలోనే చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక వైభవం, అభయారణ్యాలను ఆస్వాదించాలంటే ఉమ్మడి వరంగల్ ను సందర్శించాల్సిందే. కాకతీయుల చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం, ఘనపురం కోటగుళ్లు, లక్నవరం సరస్సు , పాకాల సరస్సు,భోగత జలపాతం, మేడారం జాతర, ఏటూరునాగరం, తాడ్వాయి అభయారణ్యాలు, పాండవుల గుహలు దేశ, విదేశీ పర్యాటకులు ఇష్ట పడే ప్రాంతాలు చాలా ఉన్నాయి. సాహస క్రీడల ప్రాంతాలు, చరిత్రక లోకల్ ఫుడ్ వరంగల్ కు ప్రత్యేకంగా గుర్తింపు ఉంది.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల పరిచయంలో భాగంగా 100 ప్రదేశాలను 'వీకెండ్ డెస్టినేషన్లు'గా మార్చేందుకు పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ప్రయత్నాన్ని ప్రారంభించింది. ఇప్పటికి అంతగా వెలుగులోకి రానివి ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు హైదరాబాద్ తో పాటు జిల్లాల నుం పర్యాటకుల్ని పెంచాలన్నది ప్రధాన లక్ష్యం.

### వీకెండ్ ట్రిప్ ప్లాన్స్

వీకెండ్ ట్రిప్ లపై ఆసక్తి ఉన్నవారు హైదరాబాద్లోనే సుమారు 10 లక్షల మంది ఉంటారని పర్యాటక సంస్థ అంచనా వేసింది. ప్రధానంగా ఐటీ ఉద్యోగులతోపాటు వర్సిటీల్లో విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు తమ స్నేహితులు, కుటుంబాలతో ప్రయాణాలకు ఆసక్తి చూపిస్తున్నారని గుర్తించింది. ఈ 'హైపర్ లోకల్ టూరిస్టు'లను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి 50-200 కి.మీ. దూరంలో 100 వారాంతపు పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సేకరిస్తోంది. ప్రధానంగా శని, ఆదివారాలు.. లేదా ఇతర సెలవు రోజుల్లో ఒకట్రెండు రోజులు సరదాగా వెళ్లివచ్చే ప్రదేశాలను ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, సమీపంలోని వసతి సదుపాయాలు.. అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్, స్థానిక వంటకాలు వంటి పూర్తి సమాచారాన్ని పర్యాటక సంస్థ అధికారులు సేకరిస్తున్నారు.

### 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పోటీలకు ఆహ్వానం

రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు టూరిజం డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతి వెల్లడించారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశం స్పష్టంగా కనిపించేలా 3 ఫొటోలు, 60 సెకన్ల వీడియో, వంద పదాల్లో ప్రత్యేకతను వివరిస్తూ జన వరి 5లోగా ఎంట్రీలను పంపాలని సూచించారు. అందులో హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ, వసతి తది తర వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు ఇస్తామన్నారు. పది మందికి కన్సొలేషన్ బహుమతులు అంద జేస్తామన్నారు. సంక్రాంతి రోజున కైట్ ఫెస్టివల్లో బహుమతులను ప్రదానం చేస్తారు.


## క్రమశిక్షణకు మారుపేరు బీసీ విద్యుత్ ఉద్యోగులు

- ఎన్పిడిసిఎల్ (కంపెనీ) కార్యదర్శి నీలారాపు రాజేందర్



స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) : క్రమశిక్షణకు మారుపేరు బీసీ విద్యుత్ ఉద్యోగులని ఎన్పిడిసిఎల్ (కంపెనీ) కార్యదర్శి నీలారాపు రాజేందర్ అన్నారు. స్టేషన్ ఘనపూర్ డివిజన్ ఈమధ్య కాలంలో విద్యుత్ శాఖలో (ఎస్ఏఓ) సీనియర్ అకౌంట్ ఆఫీసర్ గా పదోన్నతిపొందిన బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం టిజిఎన్పిడిసిఎల్ కంపెనీ కార్యదర్శి నీలారపురాజేందర్ ని శుక్రవారం హన్మకొండలోని ఒక సమావేశ వేదికపై స్టేషన్ ఘనపూర్ నూతన అధ్యక్ష,ఉపాధ్యక్షులు డివిజ న్ కార్యవర్గ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎన్పిడిసిఎల్ కంపెనీ కార్యదర్శి నీలారపు రాజేందర్ మాట్లాడుతూ విద్యుత్ సౌంస్థలోని బీసీ ఉద్యోగులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటూ ఐక్యతను చూపుతూ,ఆప్యాయ తను చాటుతూ తమ హక్కులను పొందుతున్నారని చెప్పారు. సౌంస్థలో 60శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీ ఉద్యోగుల న్యాయమైన హక్కులను కాపాడటానికి టిజిఎన్పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడు నాగెల్లిసధానందం డిఈ తో కలిసి పనిచేస్తానని చెప్పారు. సౌంస్థలో ని ఆపరేషన్ అండ్ మెంటనెన్స్ సిబ్బందితో పాటు, కింది స్తాయి ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పదోన్నతి ప్రక్రియ త్వరలో ప్రారంభమ వుతుందని, యాజమాన్యం సానుకూలంగా ఉందని అన్నారు. బీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల సాధన కోసం న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నా యని, త్వర లో విజయం సాధిస్తామని న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకముందని తెలిపారు. పదోన్నతి పొందిన సంద ర్భంగా తననుకలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క రికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య నాయకులు స్టేట్ జాయింట్ సెక్రటరీ రంగు సత్యనారా యణ,ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ నాగబెల్లి ప్రసాద్, వరంగల్ జిల్లా ప్రసిడెంట్ మార్త సర్వేశ్వర్, ఏఓ సంతోష్,హన్మకొండ జిల్లా సెక్రటరీ చంద్రమౌళి, సీనియ ర్ నాయకులు మధుకర్,కృష్ణ,జనగాంజిల్లా కోశాధికారి పగిడిముంతల శంకర్,స్టేషన్ ఘనపూర్ డివిజన్ అధ్య క్ష,కార్యదర్శులు మొహమ్మద్ అన్వర్ పాషా, వాసం శ్రీధర్, వర్కింగ్ ప్రసిడెంట్ నహీం,సందీప్,ఉపాధ్యక్షుడు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన కాకులమర్రి లక్ష్మణ్‌బాబు




ఏటూరునాగారం, డిసెంబర్ 20(జనంసాక్షి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ భారీ విజయం సాధించటంతో పాటుగా 3,230 మెజార్టీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పై భారీ విజయం సాధించడంతో ఏటూరునాగారం గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం జరిగినది ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానం మేరకు హైదరాబాదులో కేటీఆర్ నంది నివాసంలో కలిసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి దిమ్మతిరిగే మెజార్టీని ఇచ్చి చరిత్ర సృష్టించారని అన్నారు. ములుగు జిల్లాలో మేజర్ గ్రామపంచాయతీలో అత్యధిక రాష్ట్రంలోనే అత్యధిక 3,230 మెజార్టీతో భారీ విజయం సాధించటంతో కేటీఆర్ కాకులమర్రి శ్రీలతను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్, రంజిత్ రెడ్డి, తాటికొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 21 డిసెంబర్ 2025

# కార్పొరేట్ల సేవ కోసమే ప్రభుత్వం!

జనమే సాక్షి




పొరుగు రాష్ట్రం ఒడిశాలో వేదాంత ప్రైవేట్ లిమిటెడ్ అనే బహుళజాతి కార్పొరేట్ కంపెనీకి బాక్సైట్ గనుల తవ్వకం కోసం అడవిని అప్పగించడానికి, ఆ క్రమంలో ఆదివాసులను నిర్వాసితులను చేయడానికి, అంటే రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ లో ఆదివాసులకు కల్పించిన రక్షణలను ధ్వంసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తలమునకలుగా పని చేస్తున్నది. కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు, రాజ్యాంగబద్ధ సంస్థలు, న్యాయవ్యవస్థ కూడా అదే పనిలో మునిగి ఉన్నాయి. స్థానిక ఆదివాసీ ప్రజల ఉపాధిని, భద్రతను, జీవనాన్ని, మొత్తంగా అడవిని ధ్వంసం చేయనున్న ఈ వ్యవహారం లో ఎన్నెన్నో అక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ఇంతచేసీ, ఈ వ్యవహారం వల్ల దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనం ఏమన్నా ఉందా అంటే అదీ లేదు, ఇది కేవలం వేదాంత అనే ఒకే ఒక్క కార్పొరేట్ సంస్థకు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు ఆర్జించి పెట్టే పథకం మాత్రమే. ఆ వేదాంతకు సేవ చేయడమే తమ విధి నిర్వహణగా ప్రభుత్వం పని చేస్తున్నది.

తాజాగా డిసెంబర్ మొదటి వారంలో ఒడిశా లోని రాయగడ, కలహండి జిల్లాల్లో సిజిమాలి అటవీ ప్రాంతంలో రాజ్యాంగ ఐదో షెడ్యూల్ పరిధిలోకి వచ్చే 708.24 హెక్టార్ల (దాదాపు 1700 ఎకరాల) భూమిని బాక్సైట్ తవ్వకాల కోసం వేదాంతకు అప్పగించడానికి అనుమతించాలని అటవీ సలహా మండలి (ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ) ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ అనుమతిని రాష్ట్ర స్థాయి తొలిదశ అనుమతి అంటారు. అటవీ సలహా మండలి అనేది కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కింద పనిచేసే చట్టబద్ధ వ్యవస్థ. ఇది దేశంలో అటవీ భూములను అటవీయేతర అవసరాల కోసం, పారిశ్రామిక, గనుల తవ్వక, మౌలిక సాధనా సంపత్తి అవసరాల కోసం బదలాయించడానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, అనుమతించాలని గాని, తిరస్కరించాలని గాని సిఫారసు చేసే అధికారం ఉన్న సంస్థ. ఇప్పుడైతే ఈ 1,700 ఎకరాల అడవిని గనుల తవ్వకానికి ఇమ్మని సిఫారసు చేశారు గాని, నిజానికి ఇక్కడ వేదాంతకు లీజుకు ఇస్తున్న మొత్తం బాక్సైట్ గనుల తవ్వక విస్తీర్ణం 1548.76 హెక్టార్లు (దాదాపు3,800 ఎకరాలు).

ఈ అనుమతి సిఫారసు ఇప్పుడు డిసెంబర్ మొదటివారంలో వచ్చింది గాని ముందు నుంచీ, దాదాపు రెండు సంవత్సరాలుగా సాగుతున్న ఈ గనుల తవ్వకం వ్యవహారంలో అనేక అక్రమాలున్నాయి.

మొట్టమొదట, ఇది ఐదో షెడ్యూల్ ప్రాంతం కాబట్టి ఇక్కడ భూమి ఆదివాసేతరులకు, ప్రైవేటు కంపెనీలకు, చివరికి ప్రభుత్వానికైనా సరే, ఇవ్వాలంటే స్థానిక ఆదివాసులతో సంప్రదింపులు, చర్చలు జరిపి, ఆ ఆదివాసుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రాజ్యాంగం చెపుతుంది. ఇక్కడ మొత్తం గనుల ప్రాంతంలో సగభాగం అటవీ భూమి. ఆదివాసీ సమూహాల సమిష్టి నిర్వహణలో ఉన్న భూమి. అడవికి హాని జరగకుండా ఆదివాసులు ఆవాసం ఉంటున్న, వ్యవసాయం సాగిస్తున్న భూమి. కనుక అది రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ పరిధిలోకి మాత్రమే కాదు, అటవీ సంరక్షణ చట్టం 1980, ఒరిస్సా షెడ్యూల్ ఏరియాస్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రెగ్యులేషన్స్ 1956, పంచాయత్ ఎక్స్ టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ చట్టం 1996, అటవీ హక్కుల చట్టం 2006 వగైరా ఎన్నో చట్టాల పరిధిలోకి వస్తుంది. ఈ చట్టాలన్నీ కూడా స్థానిక ఆదివాసుల సమాచారపూర్వకమైన, స్వేచ్ఛాయుతమైన అనుమతి లేకుండా ఎటువంటి భూబదలాయింపు జరగగూడదని నిర్దేశిస్తాయి.

ఈ చట్ట పరమైన నిబంధనలు అడ్డు తొలగించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, వేదాంత కంపెనీ కలిసి ఈ ప్రాంతంలో 2023 డిసెంబర్ లో పది గ్రామాల్లో సాయుధ పోలీసుల పహారాలో, వేదాంత కంపెనీ ఉద్యోగుల దౌర్జన్యంతో గ్రామ సభలు జరిపినట్టు నటించి, ఆ ఆదివాసుల అనుమతి సంపాదించామని ప్రకటించింది. గ్రామ సభ జరిగిందనీ, అక్కడ ఫలానా తీర్మానం జరిగిందనీ ప్రభుత్వ అధికారులే నిర్ధారించాలి. వారు వేదాంతకు అనుకూలంగా తీర్మానాలు చేశామని దొంగ ధృవీకరణ పత్రాలు సృష్టించారు.

రాయగడ జిల్లా కాశీపూర్ బ్లాక్ సుంగేర్ గ్రామ పంచాయతీ కంటమాల్, అలిగున, బుండేల్, కడిఘట, పెలకోన, దుమర్ ఫదర్, సాగబరి, మాలి పదర్ గ్రామాల్లో, కలహండి జిల్లా తువాముల్ రాంపూర్ బ్లాక్ లోని తలాం పదర్ గ్రామ పంచాయతీ చుల్బాడి, తిజ్మాలి గ్రామాల్లో జరిగిన గ్రామ సభలు ఇలా దౌర్జన్య పూరితంగా, నిర్బంధపూరితంగా, దొంగ నిర్ధారణలతో జరిగాయని, కనుక ఆ గ్రామ సభలు చేసినట్టుగా చెపుతున్న తీర్మానాలు, అనుమతులు ఎంతమాత్రమూ చెల్లవని ఆదివాసులు అంటున్నారు.

ఇది కేవలం ఆదివాసుల ఆరోపణ మాత్రమే కాదు, 2024 ఫిబ్రవరిలో, సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తులకు కలహండి జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఇచ్చిన జవాబుల్లో కూడా గ్రామస్తులను బలవంతపెట్టి, నిర్బంధపూరితంగా గ్రామసభ తీర్మానాల మీద వారి వేలిముద్రలు తీసుకున్నారని వెల్లడించారు. ఆ ఆర్టీఐ జవాబుల్లోనే గ్రామ సభలు జరిగిన స్థలాల్లో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారని, స్థానిక గూండాలు, కంపెనీ అధికారులు కూడా ఉన్నారని కలెక్టర్ అంగీకరించారు.

ఇంకా విచిత్రమైన విషయం కూడా కలెక్టర్ జవాబులో బైటపడింది. ఈ పది గ్రామాలు రెండు గ్రామ పంచాయతీల కింద ఉన్నాయి. అంటే ఇద్దరు సర్పంచ్ లు ఉన్నారు. పది సభలూ ఒకే తేదీన, ఒకే సమయానికి జరిగినప్పటికీ ఆ ఇద్దరు సర్పంచులు పది సభల్లోనూ పాల్గొన్నట్టుగా సంతకాలు పెట్టారు. ప్రభుత్వాధికారులు కూడా ఏక కాలంలో వేరు వేరు చోట్ల జరిగిన సభల్లో పాల్గొన్నామని సంతకాలు పెట్టారు. అంటే అవన్నీ దొంగ సంతకాలని స్పష్టంగా రుజువు అవుతున్నది.

ఈ ఆర్టీఐ వెల్లడింపు తర్వాత అబద్ధపు గ్రామ సభల మీద కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేస్తే, అది ఈ వ్యవహారం మీద విచారణ జరిపించమని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాన్నే ఆదేశించింది. కాని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది గడిచినా ఆ విచారణ చేపట్టలేదు.

ఈ స్థితిలో 2024 సెప్టెంబర్ లో ఆదివాసులు తామే స్వయంగా గ్రామ సభలు నిర్వహించి గనుల తవ్వకాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసి పంపించారు. అబద్ధపు గ్రామ సభలు ఎవరు జరిపారో వారి మీద ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయమని, కేసులు పెట్టమని కోరారు. కాని ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

అంటే ప్రభుత్వం చెపుతున్నట్టుగా గ్రామ సభలు జరగలేదని, ఆదివాసుల చేత బలవంతాన సంతకాలు, వేలి ముద్రలు తీసుకున్నారని తేలిపోయింది. పెద్ద ఎత్తున పోలీసులు, కంపెనీ అధికారులు, గూండాలు, అక్కడ ఉండనవసరం లేని ప్రభుత్వాధికారులు గ్రామ సభల్లో పాల్గొన్నారంటే, వారు కేవలం ప్రజలను బెదిరించడానికే అక్కడ మోహరించారు తప్ప, నిజమైన ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని స్పష్టమవుతున్నది.

చట్టపరమైన నిబంధనలు తప్పించుకోవడానికి ప్రభుత్వం వేసిన మరొక ఎత్తు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పారిశ్రామికాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి, ఈ భూమినంతా ఆ సంస్థ అధీనంలో ఉండే లాండ్ బ్యాంక్ (భూ నిలువ) కు మొదట బదలాయించి, ఆ తర్వాత దొడ్డిదారిన వేదాంతకు అప్పగించడం. మరొక అక్రమం పర్యావరణ ప్రభావ నివేదిక అనే చట్టబద్ధ ప్రక్రియకు సంబంధించినది. గ్రామ సభలు నిర్వహించి, ఆదివాసుల అనుమతి తీసుకునే ముందు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే పర్యావరణ ప్రభావ నివేదిక (ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్) తయారు చేయవలసి ఉంటుంది. ఈ నివేదిక ఆ ప్రాంతం గురించీ, ఆ ప్రాంతాన్ని అటవీయేతర వినియోగంలోకి మారిస్తే జరగబోయే పర్యవసానాల గురించీ సమగ్రంగా, శాస్త్రీయంగా, వివరంగా ప్రకటించవలసి ఉంటుంది. అటవీయేతర వినియోగం వల్ల అడవి ఎంత నష్టమవుతుంది, వన్య ప్రాణులకు ఏమవుతుంది, ఏ వృక్షజాతులు అంతరిస్తాయి, ఆ ప్రాంతంలో ఉండే జల వనరులేమిటి, ఆవాసం ఉండే మానవ సమూహాలేమిటి, ఆ ప్రాంతంలో ఉండే చారిత్ర, సాంస్కృతిక, వారసత్వ వనరులకు ఎటువంటి నష్టం జరుగుతుంది, మొత్తంగా పర్యావరణానికి ఎటువంటి నష్టం జరుగుతుంది వంటి అనేక వివరాలతో సవివరమైన అంచనా వేసి, ఆ బదలాయింపు వల్ల ప్రయోజనాలను, నష్టాలను మదింపు చేయాలి. ఇది చట్టబద్ధమైన అనివార్య ప్రక్రియ. కాని ఒడిశా ప్రభుత్వం ఒక తూతూ మంత్రపు, అసమగ్రమైన, పాక్షికమైన, కార్పొరేట్లకు అనుకూలమైన ఈఐఏ నివేదిక తయారు చేయించింది. ఈ నివేదికను ఆ ప్రాంతంలోని ఆదివాసులు, ప్రజా సంఘాలు, పౌర సమాజ సంస్థలు తీవ్రంగా తప్పు పట్టినప్పటికీ ప్రభుత్వం ఎంతమాత్రం ఖాతరు చేయలేదు.

వాటన్నిటికీ తోడు ఈ ప్రాంతంలో గనుల తవ్వకాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న ఆదివాసులను, వారికి నాయకత్వం వహిస్తున్న 'మా మాటి మాలి సురఖ్య మంచ' అనే ఆదివాసీ ఉద్యమ సంఘాన్ని బెదిరించడానికి, నిర్బంధాల పాలు చేయడానికి గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం విపరీతంగా పోలీసు, పారామిలిటరీ బలగాలను దించింది. వారికి తోడు కంపెనీ నియమించిన గూండాలు కూడా గ్రామాల మీద, ఆదివాసుల మీద, నాయకుల మీద దాడులు చేస్తూ వచ్చారు. 2025 జూన్ నుంచి ఈ ప్రాంతమంతటా నిషేధాజ్ఞలు విధించారు. సాధారణ దుస్తుల్లో వచ్చి ఆదివాసులను పట్టుకుని వాహనాల్లో ఎత్తుకుపోయేవాళ్లు పోలీసులో, వేదాంత కంపెనీ గూండాలో, సంఘ వ్యతిరేక శక్తులో తెలియని ఒక బీభత్స స్థితి నెలకొంది.

మొత్తంగా స్థానిక అధికార యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం కాక, వేదాంత కంపెనీ కోసం మాత్రమే పని చేస్తున్నారు. ఇటువంటి భయానక స్థితిలో ఆదివాసులు బైటికి రావడానికి, మందో మాకో తీసుకోవడానికి ఆస్పత్రికి వెళ్లడానికి, నిత్య జీవితావసరాలు కొనుక్కోవడానికి వారాంతపు సంతలకో, దగ్గరి పట్టణాలకో వెళ్లడానికి కూడా భయపడే స్థితి నెలకొంది. డిసెంబర్ 7న కాశీపూర్ బ్లాక్ లోని సుంగేర్ చౌక్ లో పట్టపగలు ఆదివాసీ ఉద్యమ నాయకులైన తొమ్మిది మంది స్త్రీ పురుషులను ఎత్తుకుపోయి అక్రమ కేసు పెట్టి జైలులో నిర్బంధించారు. చివరికి ఆదివాసుల తరఫున న్యాయస్థానా ల్లో వాదిస్తున్న న్యాయవాదులను కూడా వేదాంత కంపెనీ బెదిరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

దేశంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వాలు నడుస్తున్నాయని, అవి ప్రజా ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయని, రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా పని చేస్తున్నాయని ఇంకా నమ్మే వాళ్లున్నారా?



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

## గ్రామ పంచాయతీల పురోగతి-
# దేశాభివృద్ధికి పునాది!

**గ్రామాల్లో నివసిస్తున్న జనాభా : 65%**
**2025-26 గ్రామీణాభివృద్ధి నిధులు : 1,90,000 కోట్లు**
**ఉపాధి కల్పన నిధులు : 86,000 కోట్లు**
**గ్రామీణ గృహాల నిర్మాణం : 54,000 కోట్లు**
**గ్రామీణ రహదారులు : 19,000 కోట్లు**
**ఇంటింటి నీటి సరఫరా : 81%**
**పరిశుభ్ర గ్రామాలు : 95% పైగా**
**గ్రామీణ పేదరికం**
**2015-16 : 32%**
**2019-21 : 19%**




గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి భారతదేశ ఆర్థిక-సామాజిక పురోగతికి మూలాధారం. దేశ జనాభాలో సుమారు 65% మంది గ్రామాల్లో నివసిస్తుం డటంతో గ్రామాల పరిస్థితి మెరుగుపడితేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తూ గ్రామీణ జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తోంది.



గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం భారీగా నిధులు కేటాయిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి శాఖకు సుమారు 1,90,000 కోట్లకు పైగా నిధులు కేటాయించబడ్డాయి. ఉపాధి కల్పనకు ₹86,000 కోట్లు, గ్రామీణ గృహాల నిర్మాణానికి 54,000 కోట్లు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి 19,000 కోట్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు 19,000 కోట్లు, సామాజిక భద్రత పింఛన్లకు 9,000 కోట్లకు పైగా కేటాయింపులు ఉన్నాయి. ఈ గణాంకాలు గ్రామాలపై కేంద్రం చూపుతున్న ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఈ నిధులు నేరుగా గ్రామాలకు ఇవ్వబడవు. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా యంత్రాంగానికి చేరి, గ్రామ పంచాయతీల ప్రణాళికల ఆధారంగా వినియోగించబడతాయి. ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ప్రతి సంవత్సరం పని దినాలు లభిస్తున్నాయి. వేతన వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తోంది. నిర్మాణ సామగ్రి ఖర్చులో అధిక భాగం కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఫలితంగా గ్రామాల్లో చెరువులు, కాలువలు, భూసంరక్షణ పనులు, అంతర్గత రహదారులు వంటి ఆస్తులు ఏర్పడుతున్నాయి.

గ్రామీణాభివృద్ధి స్థాయిని అంచనా వేయడానికి మౌలిక సూచికలు కీలకం. తాగునీటి రంగంలో దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 19 కోట్ల కుటుంబాల్లో 15 కోట్లకు పైగా కుటుంబాలకు ఇంటింటికీ నీటి సరఫరా అందింది. ఇది సుమారు 81%. ఇంకా 19% కుటుంబాలకు ఈ సౌకర్యం పూర్తిగా అందాల్సి ఉంది. పారిశుధ్య రంగంలో 95% కంటే ఎక్కువ గ్రామాలు పరిశుభ్ర గ్రామాలుగా ప్రకటించబడ్డాయి. గ్రామీణ రహదారుల విషయంలో 8 లక్షల కిలోమీటర్లకు పైగా రహదారులు మంజూరై, 7.5 లక్షల కిలోమీటర్లకు పైగా పూర్తయ్యాయి. ఇవి విద్యా సేవలకు చేరువను, వైద్య సదుపాయాల వినియోగాన్ని గణనీయంగా పెంచాయి.

పేదరిక గణాంకాలను పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టమైన తగ్గుదల కనిపిస్తోంది. 2015-16 సంవత్సరంలో గ్రామీణ పేదరికం 32%కు పైగా ఉండగా, 2019-21 నాటికి అది 19%కు తగ్గింది. అయినా ప్రతి 5 గ్రామీణ కుటుంబాల్లో కనీసం 1 కుటుంబం ఇప్పటికీ మౌలిక లోపాలతో జీవిస్తోంది.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది. రాజ్యాంగ హోదా పొందిన తరువాత పంచాయతీలకు చట్టబద్ధ బలం లభించింది. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు గుర్తించబడుతూ స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల భాగస్వామ్యం కూడా కీలక అంశం. స్థానిక సంస్థలకు 5 సంవత్సరాల కాలానికి ₹4 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించబడ్డాయి. ఇందులో గ్రామ పంచాయతీలకే ₹2 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించబడ్డాయి. పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరగడం, పరిపాలనా వ్యవస్థ చట్టబద్ధంగా కొనసాగడం ఈ నిధుల విడుదలకు అనివార్యం. ఈ దేశవ్యాప్త పరిస్థితిని తెలంగాణ రాష్ట్రానికి అన్వయించి చూస్తే మిశ్రమ చిత్రం కనిపిస్తుంది. రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారుల రంగాల్లో పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది. అయినా ఉత్తర తెలంగాణలోని కొన్ని ఎండాపాటు ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, గిరిజన గ్రామాలు ఇంకా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయి. సాగునీటి కొరత, ఉపాధి అవకాశాల లోపం, విద్యా సదుపాయాల పరిమితి, వైద్య వసతుల లోపం ఈ ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా కొనసాగుతున్నాయి.

మొత్తంగా పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామీణ భారతానికి బలమైన మౌలిక పునాది వేస్తోంది. గణాంకాలు పురోగతిని స్పష్టంగా చూపుతున్నప్పటికీ అభివృద్ధి ఫలాలు అన్ని గ్రామాలకు సమానంగా చేరాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కేంద్రం, రాష్ట్రం, పంచాయతీలు ప్రజల భాగస్వామ్యంతో సమన్వయంగా పనిచేసినప్పుడే గ్రామీణాభివృద్ధి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

గ్రామీణాభివృద్ధి అనేది తాత్కాలిక కార్యక్రమం కాదు. ఇది తరతరాల భవిష్యత్తును నిర్ణయించే దీర్ఘకాలిక ప్రక్రియ. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరిగితే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం లభిస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాలపై పెట్టుబడులు ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వాలు రూపొందించే విధానాలు కాగితాలకే పరిమితమైతే ఆశించిన ఫలితాలు రావు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే అభివృద్ధి నిజమైన రూపం దాలుస్తుంది. గ్రామసభలు చురుకుగా పనిచేయాలి. పంచాయతీ ప్రతినిధులు బాధ్యతతో వ్యవహరించాలి. నిధుల వినియోగంపై ప్రజా పర్యవేక్షణ బలపడాలి.వెనుకబడిన గ్రామాలకు ప్రత్యేక కార్యాచరణ అవసరం. భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించాలి. సాగునీటి కొరత ఉన్న ప్రాంతాలకు తగిన పరిష్కారాలు చూపాలి. గిరిజన గ్రామాలకు విద్యా, వైద్య సదుపాయాలు చేరేలా చర్యలు తీసుకోవాలి. యువతకు గ్రామాల్లోనే ఉపాధి లభించే వాతావరణం ఏర్పడాలి.

తెలంగాణ వంటి యువ రాష్ట్రానికి గ్రామీణాభివృద్ధి మరింత కీలకం. గ్రామాలు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది. కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను రాష్ట్రం సమర్థంగా వినియోగించగలిగితే అభివృద్ధి వేగం మరింత పెరుగుతుంది. ప్రజలు, పంచాయతీలు, ప్రభుత్వ వ్యవస్థలు ఒకే దిశగా కదిలినప్పుడే గ్రామీణ అభివృద్ధి లక్ష్యం సాధ్యమవుతుంది.

గ్రామీణ భారతం అభివృద్ధి చెందిన రోజే నిజమైన జాతీయ అభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామాల వెలుగు దేశ భవిష్యత్తుకు దారి చూపుతుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## ఇది రాజ్యాంగ పాలనా? లేక
# కార్పొరేట్ రాజ్యాంగమా?




భారతదేశం ఒక ప్రజాస్వామ్య గణరాజ్యమని రాజ్యాంగం ప్రకటించింది. కానీ మధ్య భారతదేశంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో నేడు అమలులో ఉన్నది రాజ్యాంగ పాలనా కాదు అది తుపాకీ పాలన, కార్పొరేట్ పాలన. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రలలోని అబూజ్మడ్, బామ్‌రాగడ్ వంటి అటవీ ప్రాంతాలు, దేశ ఖనిజ సంపదకు వెన్నెముక. ఈ సంపదను వేల ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన ఆదిమ జాతి ఆదివాసులు ఈ దేశానికి భారం కాదు ౹ వాళ్లే ఈ దేశానికి నిజమైన సంపద.కానీ నేడు అదే ఆదివాసులను "నక్సలైట్లు", "అభివృద్ధి వ్యతిరేకులు" అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక శత్రువులా చిత్రీకరిస్తున్నాయి. ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ పహార్, సల్వా జూడుం, ఆపరేషన్ కగార్ ఇవి భద్రతా చర్యల పేర్లు కావు. ఇవి రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, ఐదవ షెడ్యూల్‌ను కాలరాసి, ఆదివాసుల భూములను కార్పొరేట్లకు అప్పగించడానికి పెట్టిన రక్తపు ముద్రలు.

**రాజ్యాంగం ఏమంటుంది? ఐదవ షెడ్యూల్ ఏమంటుంది?**

పేసా గ్రామ సభ అనుమతి లేకుండా, ప్రభుత్వం కానీ, ప్రైవేట్ వ్యక్తులు కానీ, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోకి వెళ్ళి ఎలాంటి కార్యకలాపాలు చేయకుడదు ప్రభుత్వం కూడా గిరిజనేతర ప్రభుత్వమే అని, సమత జడ్జిమెంట్ స్పష్టంగా చెబుతుంది. కానీ నేడు ఆ అనుమతి ఎవరి దగ్గర తీసుకున్నారు? గ్రామసభ దగ్గరా? లేక మల్టీ నేషనల్ కంపెనీల బోర్డు రూమ్‌లలోనా?

దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యాన్ని మధ్య భారతదేశంలో దింపి, ఆయుధాలు లేని ఆదివాసులపై ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధం కాదా? ఇది అంతర్గత భద్రతా చర్య అని ప్రభుత్వం చెబుతుంది. కానీ నిజంగా భద్రత ఎవరిది? ప్రజలదా? లేక ఖనిజాలదా?ఎన్‌కౌంటర్ అనే పదం ఇప్పుడు ఒక న్యాయ ప్రక్రియలా మారిపోయింది. అరెస్ట్ లేదు. విచారణ లేదు. కోర్టు లేదు. ఒక్క గుండె ఆగితే చాలు ౹ "నక్సలైట్ హతం" అని ఫైల్ మూసేస్తారు. రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కు (ఆర్టికల్ 21) అడవుల్లోకి వెళ్తే రద్దవుతుందా?

ఈ పరిస్థితుల్లో దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన గౌరవ సుప్రీంకోర్టు పాత్రపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మధ్య భారతదేశంలో ఆదివాసులపై జరుగుతున్న దాడులు, వారి జీవించే హక్కును (ఆర్టికల్ 21), మాట స్వేచ్ఛను (ఆర్టికల్ 19) హరించే ప్రభుత్వ చర్యలపై రాజ్యాంగ పరిరక్షకుడిగా సుప్రీంకోర్టు తక్షణమే స్పందించాల్సిన బాధ్యత ఉంది. సుప్రీంకోర్టు సుమోటోగా కేసు స్వీకరించి, స్వతంత్ర న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై తగిన ఆదేశాలు ఇవ్వకపోతే, ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే ఈ పాలకులపైనా, ఈ ప్రజాస్వామ్య వ్యవస్థపైనా ప్రజలు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. అడవుల్లో ఉన్న ఆదివాసులు పదే పదే శాంతి చర్చలు జరపాలని కోరుతున్నారు. ఇది రాజ్యాంగబద్ధమైన డిమాండ్. కానీ ప్రభుత్వం మాత్రం చర్చలకు కాదు తూటాలకు సిద్ధంగా ఉంటుంది. ప్రశ్నించేవారిపై దేశద్రోహం కేసులు, మేధావులు, జర్నలిస్టులపై బెదిరింపులు. ఇదేనా మాట స్వేచ్ఛ (ఆర్టికల్ 19)? ఇక్కడ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి స్పష్టంగా బయటపడుతుంది. పాకిస్తాన్‌తో యుద్ధం వస్తే, అమెరికా "చర్చలు జరపండి" అని చెబితే భారత ప్రభుత్వం చర్చలకు సిద్ధమవుతుంది. కానీ అదే దేశంలోని పౌరులైన ఆదివాసులు "మాతో చర్చలు జరపండి" అంటే మాత్రం ప్రభుత్వం తుపాకీ చూపిస్తుంది. విదేశీ శత్రువులతో చర్చలు ౹ స్వదేశీ ప్రజలపై యుద్ధం! ఇది ఏ రకం సార్వభౌమత్వం?

పాకిస్తాన్ ఉగ్రవాది కసబ్ భారతదేశంలో ఎన్నో బ్లాస్టులు చేసినప్పటికీ, అతడికి కూడా చట్టం వర్తించింది. అరెస్ట్, రిమాండ్, కోర్టు విచారణ, చట్టబద్ధమైన శిక్ష ఇదే రాజ్యాంగ ప్రక్రియ. కానీ దేశ పౌరులైన ఆదివాసుల విషయంలో మాత్రం ఆ రాజ్యాంగం అడవుల్లోకి వెళ్లగానే మాయమవుతుంది. ఉగ్రవాదికి న్యాయం ఆదివాసీలను ఎన్‌కౌంటర్! ఇదేనా సమానత్వం (ఆర్టికల్ 14) నిజం ఏమిటంటే ౹ ఈ యుద్ధం నక్సలిజం మీద కాదు. ఇది ఆదివాసుల భూముల మీద. అడవుల మీద. ఖనిజాల మీద. ఈ దేశ సంపదను కార్పొరేట్ సామ్రాజ్యవాదానికి అప్పగించడానికి నడుస్తున్న యుద్ధం ఇది. అభివృద్ధి అనే పదాన్ని తుపాకీకి కవర్‌గా వాడుతున్నారు. ఆదివాసులు అడవులను కాపాడుతున్నారు దేశాన్ని కాపాడుతున్నారు. ప్రభు త్వం మాత్రం ఆదివాసులను జీవ సమాధి చేసి ఖనిజాలను అమ్ముతోంది. ఇది అభివృద్ధి కాదు. ఇది దోపిడీ. ఇది దేశభక్తి కాదు. ఇది రాజ్యాంగ ద్రోహం.

**ఇది స్పష్టంగా చెప్పాలి:**

ఆదివాసులపై జరుగుతున్న హింస ఒక ప్రాంత సమస్య కాదు.

ఇది భారత ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి. ఈ రోజు అడవుల్లో రాజ్యాంగాన్ని కాల్చితే, రేపు నగరాల్లో ప్రజాస్వామ్యాన్ని కాల్చడానికి ఆలస్యం ఉండదు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ఆదివాసుల హక్కులను రక్షించాలి.

సామాజిక విశ్లేషకులు
**కుడ్మేత శ్రీనివాస్**
సెల్ నెం: 9177166152

## పొత్తాల జాతర

చలన నైజం
విజ్ఞాన కల్పవృక్షం
గ్రంథ కుటీరం
దివ్య భావన
జగన్నాటక
సూత్రాలుజి
విశ్వ వీక్షణం
కొత్త దారులు
సర్వకాంతి వాహినీ
వివేక నిధి
బహు భాషలు
ఒకటే జ్ఞాన కేంద్రం
పొత్తాల జాతర

**రేడియమ్**
9291527757
(పుస్తక ప్రదర్శన సందర్భంగా)

## స్మార్ట్ ఫోన్ లేని ఒక రోజు

స్మార్ట్ ఫోన్ లేని ఒక రోజున
మోడు బారిన పచ్చని చెట్టుకు
కొత్త చిగురు చిగురించినట్లు
అనుబంధాలు సరికొత్తగా
మళ్లీ చిగురించి
మమతానురాగాలతో
వికసిస్తాయి..!!

విడిపోయి నిశ్శబ్దం అలముకున్న
మనుషుల మనసులు
పలకరింపుల పరిమళాలతో
కలివిడిగా కలిసిపోయి
ఒక్కటవుతాయి..!!
అమ్మ చేతి గోరు ముద్దలు
ఆరగిస్తూనే

అమ్మమ్మ చెప్పే కథలు వింటూ
మేడపై ఆకాశంలో చుక్కలు
లెక్కబడుతూ
జాబిల్లి లో వెన్నెల కాంతిని
ఆస్వాదిస్తూ చిన్ని హృదయాలు
మధురానుభూతిని
పొందుతాయి..!!
లేత పసి మనసులు
ఆకలి ధ్యాసమరిచి మైదానంలో
కప్ప గెంతుల్లా గెంతుతూ
చెమట కారేల ఆటల్లో
దోస్తులతో కుస్తీ పడతాయి..!!

ఉత్తరాలే గగనతలంలో
విహరించే పక్షులై ఒడిలో వాలి
భావ సుగంధాలను
వెదజల్లుతాయి

పచ్చని గట్లతో
పుస్తకాల సఖులతో
ప్రేమతత్వం నిండి ఆహ్లాదకర
వాతావరణ ఏర్పడి తీయని
జ్ఞాపకాల మజిలీలా ఈ జీవితం
నిలిచిపోతుంది...!!

ఎం రాజశేఖర్ ఆదోని.
9381004519

## గజ్జెల సవ్వడి..!!

పురివిప్పిన నాట్య మయూరి
మువ్వల సవ్వడి అడుగుల్లో
మెలమెల్లగా అడుగులేసింది
సంగీత సాహిత్య మేళవింపు
హాయిని గొలిపే రాగరంజితమై
కూచిపూడిని ప్రదర్శిస్తుంటే
రాయిని సైతం కరిగించే సంగీతంతో
మనసు మైదానం పైన తిష్ట వేసింది
రారాజులు సైతం
కళా మందిరాలను నిర్మాణాత్మకంగా
తీర్చిదిద్దిన కాలం పులకించిపోయింది
చిరునవ్వుల తొనికిసలను కూడా
చిరు గజ్జెలకు తోడు చేస్తూ
ముల్లోకాలను సంగీతంలో
తరింపజేసిన గొప్ప నాట్య కళ
గజ్జెలు ఘల్లు ఘల్లు మంటూ
కళ్ళను ఆకట్టుకునే విశ్వకళ

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

# సామాజిక అసమానతల నిర్మూలనకు విద్యే ప్రధాన ఆయుధం

- నైపుణ్యాలు-మానవ విలువలతో కూడిన విద్యే ప్రభుత్వ లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**అల్వాల్, డిసెంబరు 20 (జనంసాక్షి) :** సమాజంలో పాతుకుపోయిన అసమానతలను రూపుమాపే శక్తివంతమైన ఆయుధం విద్యేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మేడ్చల్ జిల్లా అల్వాల్‌లో లయోలా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నైపుణ్యాలతో పాటు మానవ విలువలు కలిగిన విద్యను అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనిలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు వేగంగా సాగుతున్నాయని, రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర జీడీపీ వృద్ధికి దోహదం చేస్తుందన్నారు. సామాజిక అసమానతలను తొలగించేందుకు అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో చదువుకునేలా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాల కోసం 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో ఆధునిక వసతులు కల్పిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలలకు అనుమతులు ఇచ్చి వేగంగా నిర్మాణాలు సాగుతున్నాయని చెప్పారు. దీర్ఘకాల అభివృద్ధికి లోతైన మానవ మూలధనమే పునాది అని అగ్రదేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూలధనం, ఆవిష్కరణలు ఎంత కీలకమైనవైనా వాటిని నిలబెట్టే శక్తి మానవ మూలధనమేనని అన్నారు. ఉత్పాదకత అంటే ఎక్కువ గంటలు పని చేయడం కాదని, తెలివిగా, మెరుగ్గా, కలిసి పనిచేయడమేనని చెప్పారు. యాభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసిన లయోలా అకాడమీ విద్యతో పాటు సామాజిక విలువలను పెంపొందిస్తూ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ సాధించాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు, మైదానాలు ప్రభుత్వమే కల్పిస్తుందని మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శనివారం శామీర్‌పేట్ మండలం హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న క్రీడలు, కోచ్‌ల శిక్షణ విధానాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ విద్యతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన క్రీడల్లో నిరంతర సాధన అవసరమని సూచించారు. విద్యార్థులు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, సైక్లింగ్, హాకీ వంటి క్రీడలకు అవసరమైన మైదానాలు, పరికరాలు కావాలని కోరగా వాటిని పరిశీలించి అందజేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్లే విద్యార్థులపై ప్రభుత్వం ఒక్కొక్కరికి నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తోందని తెలిపారు. కోచ్‌ల శిక్షణతో పాటు విద్యార్థుల్లో చిత్తశుద్ధి, అంకితభావం, స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. రోజురోజుకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలు, లక్ష్యాలను నవీకరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చదువులో ప్రతిభ సాధిస్తే భవిష్యత్తులో ఉద్యోగ, వ్యాపార పరంగా అవసరమైన సహాయాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు. సివిల్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎప్పుడైనా మార్గనిర్దేశం, సలహాలు అందిస్తానని తెలిపారు. అనంతరం జిమ్నాస్టిక్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలించి సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు.

## ఇబ్రహీంబాగ్ సరస్సు దోమల బెడద నివారణకు చర్యలు



**రాజేంద్రనగర్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** దోమల బెడద నివారణపై చర్యలలో భాగంగా ఇబ్రహీంబాగ్ సరస్సును మణికొండ ఉప కమిషనర్ ఎన్. శంకర్ ఇంజనీరింగ్ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు మేరు జితేందర్ లు పాల్గొని సమస్యలపై అధికారులతో చర్చించారు. అధిక ఇన్‌ఫ్లో కారణంగా సరస్సును వెంటనే ఎండబెట్టలేని పరిస్థితి ఉన్నందున, బాక్స్ డ్రెయిన్ ద్వారా మురుగునీటిని మళ్లించి సరస్సులోకి ప్రవాహాన్ని నిలిపివేశారు. హైసింత్ ఎండిపోవడానికి రసాయనాల స్ప్రేయింగ్ ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు.దోమల నియంత్రణ కోసం రోజువారీ ఫాగింగ్ చేపట్టాలని, డ్రోన్ల ద్వారా రసాయనాల స్ప్రే నిర్వహించాలని జిహెచ్ఎంసి అధికారులను కోరారు. ఇబ్రహీంబాగ్ సరస్సు మూసి పునరుజ్జీవన ప్రాజెక్టులోని 14 సరస్సుల జాబితాలో ఉండటంతో, త్వరలో మరిన్ని అభివృద్ధి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, సీనియర్ నేతలు ముత్యాలు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## మడపతి సంగయ్య స్వామిపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి



**తాండూరు, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** మడపతి సంగయ్య స్వామి పై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని తాండూరు వీరేశైవ సమాజం సభ్యులు కోరారు శనివారం తాండూరు వీరశైవ సమాజం సభ్యుల ఆధ్వర్యంలో డి.ఎస్.పి ని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సమాజం సభ్యులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో కోట్‌పల్లి గ్రామ సర్పంచ్ గా గెలిచిన మడపతి బసమ్మ భర్త కోటపల్లి వీరశైవ సమాజం సభ్యుడైన సంగయ్య స్వామి పై మొన్న రాత్రి దాడి జరగడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.ఈ విషయాన్ని తాండూర్ వీరశైవ సమాజం, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడి జరిపిన వారిపై కఠిన చర్యలను తీసుకొని మా వీరశైవుల మనోభావాలను కాపాడాలని తాండూర్ వీరశైవ సమాజం మరియు వీరశైవ యువదళ్ తరపున డిమాండ్ చేశారు. సంగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దాడి జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకొనీ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం కార్యవర్గ సభ్యులు మరియు వీరశైవ యువదళ్ కార్యవర్గ సభ్యులు, సమాజం సర్వసభ్యులు, కరణ్ కోట్ సర్పంచ్ మైలారం రాజ్ కుమార్, చిట్టిఘనాపురం సర్పంచ్ పటేల్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతి



**అల్వాల్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** అల్వాల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న విలేకరులకు ప్రభుత్వం ద్వారా ఇండ్ల స్థలాలు / ఇండ్లు మంజూరు చేయాలని అల్వాల్ విలేఖరులు కోరారు. శనివారం అల్వాల్ లోని లయోలా అకాడమీ వార్షికోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వారు ఇండ్ల స్థలాలు ఇండ్లు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ, ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే తమ వృత్తి బాధ్యతల మధ్య స్వంత నివాస సమస్యను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అల్వాల్ మండలంలో పనిచేస్తున్న అర్హులైన విలేకరులను గుర్తించి, గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇండ్ల స్థలాలు లేదా ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అల్వాల్ మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మక్తాల రాములు, రమణ, పల్లె మల్లేష్, మధుసూదన్ రెడ్డి, సుక్క రవి, ఉపేందర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- హెచ్చరించిన మల్కాజిగిరి గిర్దావర్ పరమేశ్వర్ రెడ్డి
- హైడ్రా సహకారంతో కూల్చివేతలు



మల్కాజిగిరి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : చెరువులు, కుంటల వంటి ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని మల్కాజిగిరి గిర్దావర్ పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్కే పురం చెరువు పరిధిలోని సర్వే నంబర్ 243లో గల సుమారు 700 గజాల స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించి, రేకులతో బౌండరీ నిర్మిస్తున్నట్లు స్థానికు లు విక్రమ్, గోవర్ధన్, ముఖేష్, శ్రీరామ్, అంటోని, లక్ష్మణ్, రాజేష్ గౌడ్ లు ఫిర్యాదు చేయడంతో.దీనిపై తక్షణమే స్పందించిన మల్కాజిగిరి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, హైడ్రా బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువు శిఖం భూమిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన రేకుల బౌండరీలను హైడ్రాస్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా గిర్దావర్ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువుల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉందని, ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే అధికారులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మరియు హైడ్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి సన్నిధానంకు అయ్యప్ప విగ్రహం అందజేత

- విగ్రహ దాత జూలపల్లి శ్రీకాంత్ గౌడ్



తలకొండపల్లి, డిసెంబర్ 20 (జనంసాక్షి) : మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలోని అయ్యప్ప స్వామి సన్నిధానానికి జూలపల్లి వాస్తవ్యులు మౌనిక శ్రీకాంత్ గౌడ్ దంపతులు జహంగీర్ గురు స్వామికి ఇచ్చిన మాట ప్రకారం అభిషేక అయ్యప్ప స్వామి విగ్రహం అయ్యప్ప స్వాములకు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం ఒక అయ్యప్ప సన్నిధానానికి అయ్యప్ప విగ్రహం ఇప్పించి తనకు హిందూ ధర్మం పట్ల,దైవ భక్తి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటానని అన్నారు. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆశిస్తూ గత సంవత్సరం మొదటగా వెల్జాల్ గ్రామంలో అయ్యప్ప స్వామి దానంతో ప్రారంభించిన విగ్రహ ప్రధానం ప్రతి ఏటా కొనసాగుతుందని,వచ్చే సంవత్సరం అంతారం గ్రామ అయ్యప్ప సన్నిధానానికి ఇస్తానని పేర్కొన్నారు. అనంతరం అయ్యప్ప పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్వాముల ఆశీర్వాదాన్ని తీసుకొని తన్మయ ఆనందం పొందారు.ఈ కార్యక్రమంలో శంకర్ గురు స్వామి,శరత్ స్వామి,తడిసిన ప్రదీప్ రెడ్డి స్వామి,రామ్ రెడ్డి స్వామి,చంద్రశేఖర్ రెడ్డి స్వామి,ఎన్టీఆర్ స్వామి,యాదగిరి స్వామి,మదన చారి స్వామి,ప్రశాంత్ స్వామి,బిట్టు స్వామి, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



**శంకర్‌పల్లి, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని శంకర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గోవిందమ్మ హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం డైరెక్టర్ తో పాటు మునిసిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి తో కలిసి ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం చేసిన ఆరోపణలను వారు ఖండించారు. ఎమ్మెల్యే కారు డ్రైవర్ జీతం డబ్బులు డీజిల్ డబ్బులు మునిసిపల్ నుంచి చెల్లిస్తున్నారనే నిరాధారమైన ఆరోపణలను వారు ఖండించారు.ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు.జిల్లా పరిషత్ చైర్మన్ గా చేవెళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో శంకరపల్లి లోని డబ్బాలవారి నుంచి 5000 చొప్పున వసూలు చేసిన విషయం మర్చిపోయావా అంటూ ప్రశ్నించారు.

## రాష్ట్రపతి పర్యటన, మాక్‌డ్రిల్ ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకొని తిరిగి ఢిల్లీకి ప్రయాణం అవుతున్న సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు, అలాగే విపత్తుల సమయంలో నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహణ పనుల్లో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున సోమవారం (డిసెంబర్ 22, 2025) మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, తదుపరి ప్రజావాణి తేదీని ముందుగా తెలియజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే బీయంఆర్‌ను కలిసిన నూతన సర్పంచ్‌లు



**తాండూరు, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** నియోజకవర్గంలో ని పెద్దేముల్ మండలం కందెనెల్లి తండా గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ ఆనంద్ నాయక్, బషీరాబాద్ మండలం పర్శ్యానాయక్ తండా సర్పంచ్ లక్ష్మి బాయ్, కోట్ పల్లి మండలం ఓగులపూర్ సర్పంచ్ చేన్నకర్ తో పాటు వార్డ్ మెంబర్స్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ లకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు.

# ఉపాధ్యాయునికి నష్టపరిహారం చెల్లించాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



**జడ్చర్ల, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహబూబ్ నగర్ రూరల్ మండలం మాచన్ పల్లి గ్రామంలో ఎన్నికల విధులు నిర్వహణ కోసం వెళ్లిన సీసీ కుంట మండలం లాల్కోటలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శివ కుమార్ వాటర్ ట్యాంక్ దగ్గర జారిపడి ప్రమాదానికి గురై కుడి భుజానికి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయునికి నష్ట పరిహారాన్ని చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జడ్చర్లలో నివాసం ఉంటున్న గాయపడ్డ ఉపాధ్యాయుడు శివకుమార్ ని పరామర్శించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో గాయపడిన సిబ్బందికి నష్టపరిహారం ప్రభుత్వం తప్పక చెల్లించాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని, ఉపాధ్యాయుడు గాయపడి పది రోజులు అయినప్పటికీ ఈరోజు వరకు జిల్లా ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, వెంటనే అధికారులు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మాచన్ పల్లిలో సరియైన ఏర్పాట్లు, శుభ్రత పాటించకనే ఇలా జరిగిందని ఎన్నికల అధికారులు బాధ్యత వహించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు గోవిందు నాయక్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు తాహేర్, జిహెచ్ఎం మల్లయ్య, యుగంధర్, మధు, నర్సింలు, కృష్ణా నాయక్, వెంకటయ్య, శివరాజ్, వెంకట్ రాములు గౌడ్, అనురాధ, మాధవి, కోదండ రామయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండాపురం శ్రీశైలం బీఆర్ఎస్ నుంచి శాశ్వత బహిష్కరణ

- పార్టీకి వెన్నుపోటు పొడవడమే కారణం
- మాజీ సర్పంచ్ రాజు నాయక్



**యాచారం, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** నంది వనపర్తి సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా 8 వ వార్డు సభ్యుడుగా పార్టీ నుంచి టికెట్ పొంది పార్టీ కార్యకర్తలు ఆయన ప్రచారంలో అహర్నిశలు శ్రమించి గెలిపించుకున్నారు. గెలిచిన మరునాడే టిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని నాయకుల చేతుల మీదుగా పార్టీషాలుగా ధరించి కాంగ్రెస్లో చేరారు. కాంగ్రెస్ లో చేరిన శ్రీశైలం ఫోటోలు సోషల్ మీడియా వేదికగా వైరల్ కాగా టిఆర్ఎస్ కార్యకర్తల్లో ఆగ్రహాన్ని నింపింది. కొండాపురం శ్రీశైలం పార్టీలో ఉండడానికి వీలులేదని, తక్షణమే పార్టీ నుండి బహిష్కరించాలని, గతంలో తప్పులు చేసిన పార్టీలో చేర్చుకున్నామని ఇక క్షమించడానికి వీలులేదని కొండపురం శ్రీశైలం ను శాశ్వతంగా పార్టీ నుంచి బహిష్కరించాలని పార్టీ పెద్దలకు నందివనపర్తి పార్టీ కార్యకర్తలు తెలిపారు. నంది వనపర్తి పార్టీ అధ్యక్ష కార్యదర్శులు సీనియర్ నాయకులు... బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి దగ్గరికి విషయాన్ని తీసుకుపోగా మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ తో చర్చించి కొండాపురం శ్రీశైలం ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు నంది వనపర్తి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ డాక్టర్ వార్త్యావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఒంగురు రాజు, కార్యదర్శి చందు, నాయకులు కార్యకర్తల సమక్షంలో కొండాపురం శ్రీశైలం ను పార్టీ నుంచి శాశ్వత బహిష్కరణ చేస్తున్నట్లు ప్రకటించారు.

# అధిక దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహించాలి

● జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా జిల్లా రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. పీడీ ఆత్మా నారాయణపేట ఆధ్వర్యంలో సమగ్ర పంటల యాజమాన్యం పైన, సమగ్ర ఎరువులు యాజమాన్యం - విస్తరణ పద్ధతుల పైన, ఎరువులు, విత్తనములు - పురుగుమందుల చట్టాల పైన సంబంధిత విషయ నిపుణులతో 2023-24 సంవత్సరంలో 39 మంది విత్తన, 48 మంది పురుగుమందుల డీలర్లకు 48 వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం మదనాపూర్ శాస్త్రవేత్తలు, హాజరై తర్ఫీదునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం 80 థియరీ క్లాసులతోపాటు 8 క్షేత్ర పర్యటనలు నిర్వహించారు. ప్రతి నాలుగు వారాలకు ఒకసారి ఇంటర్నల్ టెస్టులు, మిడ్ టర్మ్ ఎగ్జామినేషన్ తో పాటు, ఫైనల్ ఎగ్జామ్ నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ మేనేజ్మెంట్ సంస్థ వారు సర్టిఫికెట్స్ జారీ చేయగా, ఇందులో ఒకరు డిస్టింక్షన్ , 32 మంది మొదటి శ్రేణులు ,6 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన డీలర్లకు శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మెరిట్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి డీలరు శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరారు. తక్కువ ఖర్చు తోటి అధిక దిగుబడి, అధిక లాభాలు సాధించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన అధికారులు



**చిన్నశంకరంపేట, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్ డిఇ యాదగిరి, ఏఈ లోకేష్, ఇట్టి ఇండ్లు తొందరగా కంప్లీట్ చేయాలని ఇంటి యజమానికి తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ సంతోష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మరియు గ్రామస్తులు పసుల శేఖర్, శివయ్యల సత్యం, ముత్తగారి చంద్రయ్య, రెడ్డి మహేష్, బండమీది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణితశాస్త్రంలో రణించిన కస్తూర్బా విద్యార్థినులు



**శివ్వంపేట, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** తెలంగాణ మేథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గణిత శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షలో తెలుగు మీడియం విభాగంలో శివంపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యార్థినులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలల్లో రాణించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వారి గణిత ఉపాధ్యాయురాలు రాధిక అదేవిధంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి మంజుల పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఇందులో మంచి ప్రతిభ కనబరించి, ప్రథమ స్థానం నిఖిత, ద్వితీయ స్థానం సక్కు భాయి, తృతీయ స్థానం జయంతిక లు ఉన్నారు. అలాగే వీరందరూ జిల్లా స్థాయిలో కూడా మంచి విజయం సాధించాలని ప్రత్యేక అధికారి మంజుల, గణిత ఉపాధ్యాయురాలు రాధికలు ఆకాంక్షించారు.

## విద్యార్థుల్లో మేధో వికాసానికి గణిత పోటీలు



**మక్తల్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం నర్వ మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ టెస్ట్ లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో జడ్పీహెచ్ఎస్ నర్వ పాఠశాల విద్యార్థి కే. పల్లవి మొదటి స్థానం, జడ్పీహెచ్ఎస్ పాతర్చెడ్ విద్యార్థి ఎం. నవీన్ కుమార్ రెండవ స్థానం సాధించారు. తెలుగు మీడియం విభాగంలో ఎం. నవీన్ కుమార్ త్రివేణి మొదటి స్థానం, మమత రెండవ స్థానం, అనురాధ మూడవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది విద్యార్థుల కృషికి, ఉపాధ్యాయుల మార్గనిర్దేశానికి నిదర్శనమని తెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచి, వారి మేధో వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలందరినీ తెలంగాణ గణిత ఫోరం ప్రతినిధులు, మండల ఇన్చార్జి మల్లేష్, ఉపాధ్యాయులు వీరేశ్ బాబు, రాములు, శైలజ అభినందించారు.

## గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేయాలి

● మెదక్ ఎంపీ రఘునందన్ రావు నూతన సర్పంచులకు సూచన



**తూప్రాన్, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని నూతన సర్పంచులకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచనలు చేశారు. శనివారం నాడు జీడ్డిపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల నూతన సర్పంచులు నర్సుగారి కృష్ణ, కందల రాజనర్సింహా వార్డు సభ్యులు సాదు సత్యనారాయణ ఎంపీ రఘునందన్ రావు ను తన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన వాళ్ళకి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి గ్రామ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. కేంద్రం నుండి గ్రామాలకు వచ్చే నిధులను వినియోగాం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ మాజీ ఉపాధ్యక్షుడు బిజెపి సీనియర్ జిల్లా నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్,మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,ఉపాధ్యక్షుడు సాదు సత్యనారాయణ కూచారం మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి,సాదు సాయిబాబా బారి ఎత్తున రెండు గ్రామాల యువకుకు పాల్గొన్నారు.

# నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ఉక్కుపాదం



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి ట్రాఫిక్ ఎస్సై, సురేందర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై కఠినంగా చర్యలు చేపట్టారు. వనపర్తి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఆపి, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి, కౌన్సిలింగ్‌తో పాటు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డు ప్రమాదాలకు మాత్రమే కాకుండా చైన్ స్నాచింగ్, దొంగతనాలు వంటి నేరాలకు కూడా వినియోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అట్టి నేరాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజల భద్రతను కాపాడడం కోసమే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన నంబర్ ప్లేట్లు అమర్చుకుని ప్రయాణించాలని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వనపర్తి ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకంతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుంది

● మత్స్య పారిశ్రామిక జిల్లా డైరెక్టర్ మంజే మల్లేశం



**చేర్యాల, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి ప్రజా ప్రభుత్వం చెరువులలో చేప పిల్లలను విడుదల చేయడం అనే కార్యక్రమం చాలా గొప్పదని మత్స్య పారిశ్రామిక సిద్దిపేట జిల్లా డైరెక్టర్ మంజే మల్లేశం అన్నారు. శనివారం ఆకునూరు పుల్కమ్మ చెరువులో 75,000, వీరన్నపేట మిధునమ్మ చెరువులో 1,68,000, ముస్త్యాల జక్కుల చెరువు, తాళ్ళ చెరువులో 1,00,000 చాప పిల్లలను చెరువులో వేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఉచితంగా మత్సకార సహకార సంఘాలకు చేప పిల్లలను సరఫరా చేసిందన్నారు. దీనివల్ల జిల్లాలోని మైనర్ చెరువుల్లో చేపల ఉత్పత్తితో పాటు ఉత్పాదకత పెరిగి మత్స్యకారుల సహకార సంఘాల్లోని కుటుంబాల జీవనోపాధి కలుగుతుందని, ఈ చేప పిల్లలు మూడు, నాలుగు నెలల్లో పెరిగి పట్టుకోవడానికి అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు,ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్‌పూర్, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ పరిధిలోని పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్పూర్ లలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, శంకుస్థాపన ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్న కంజర్ల నుండి అందూర్ వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల మధ్య ఇంటర్ లింక్ రోడ్లు నిర్మిస్తూ.. మెరుగైన రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభా కు నాగునంగా ఏర్పడుతున్న కాలనీలలోనూ మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల అభివ ృద్ధికి సైతం ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ క ృష?, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, పంచాయతీరాజ్ డిఇ సురేష్ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచందర్, ఖదీర్, పిఆర్ డిఈ సురేష్, సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చట్ట సవరణను విరమించుకోవాలి



**సంగారెడ్డి, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** రైతులకు నష్టం చేసే విద్యుత్ చట్ట సవరణ బిల్లును విరమించు కోవాలని రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్త విద్యుత్ చట్టం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చేదిగా ఉన్నదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా డిసెంబర్ 23న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని అన్నారు. తరతరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకురావటం ద్వారా కేంద్రం బడా కార్పొరేట్లకు మేలు చేకూర్చుతున్నదని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా రైతాంగానికి, నిరుపేదలకు ఇస్తున్న క్రాస్ సబ్సిడీని ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. రైతాంగ పోరాట ఫలితంగా రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల అమలులో భాగంగానే నూతన విత్తన బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందనీ, విదేశీ స్వదేశీ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ దుష్ట చర్యకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మహిళలు , యువజన సంఘాలు కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమం లో రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య, కార్యదర్శి యాదవ రెడ్డి, నాయకులు నర్సింహా రెడ్డి, శ్రీనివాస్, మాణిక్ రెడ్డి,మల్లారెడ్డి, విట్టల్, అశోక్, అంజయ్య లక్ష్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం

● హెచ్‌ఎం ఏనుగందుల మనీష్ కుమార్

**నంగునూరు, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్ అన్నారు .ఇట్టి కార్యక్రమంలో షెడ్యూల్ ప్రకారం ఫుడ్ ఫెస్టివల్ ఆహార దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు వారి వారి ఫుడ్ ఐటమ్స్ ని పాఠశాలకు తీసుకువచ్చి ప్రదర్శించడం జరిగింది. వారు తయారు చేసినటువంటి ఆహార పదార్థాల వివరాలు తయారు చేసిన విధానాన్ని ఒకరికొకరు షేర్ చేసుకోవడం జరిగింది. సమ్మేటివ్ పరీక్షలో ఒకటి రెండు మూడు గ్రేడులు ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రుల చేత బ్యాడ్జీలను అలంకరింప చేయడం. ఇట్టి కార్యక్రమానికి హాజరైన పేరెంట్ నాగిని శ్రీహరి స్రవంతి దంపతులు పాఠశాలకు పోడియం ను అందించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. వారికి పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలియజేయడం జరిగిందని అదేవిధంగా వారిని శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ లింగంపల్లి రజిత కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు తహసిన్ సుల్తానా, అర్షద్ సునీత,లలిత కవిత,నిర్మల పాల్గొన్నారు.




# జీతాలు లేక పస్తులు ఉంటున్న ఉపాధిహామీ సిబ్బంది



**మల్దకల్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉపాధి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి గత నాలుగు మాసాల నుండి వేతనాలురాక కుటుంబాలు పోషించలేక తీవ్ర ఇబ్బందులకు గురై అప్పులపాలు అవుతున్నారు. ప్రతినెల ఈఎంఐతోపాటు విద్యార్థుల ఫీజులు, ఇంటి కిరాయిలు, ఇంటి సరుకులకు డబ్బులు లేక అప్పుల పాలై పస్తులు ఉంటున్నారు. గత ఆరు మాసాల నుండిఉపాధి హామీ సిబ్బందికి వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లకు ఐదు నెలలు,ఏపీవోలు,ఫీల్డ్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లకు మూడు నెలలు వేతనాలు అందక పోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అందులో పనిచేసే అటెండర్ వేతనం 9 మాసాల నుండి వేతనాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉపాధిహామీ కార్యాలయం పనిచేయాలంటే కరెంట్ బిల్లు, ఇంటర్నెట్ బిల్లు,ప్రింటర్ పనిచేయాలంటే కర్టేజ్,పేపర్ ప్రింట్ తీయాలంటే పేపర్స్ కూడా కొరత ఏర్పడింది. ఈ బిల్లులు సంబంధించి దాదాపు రెండు సంవత్సరాలు నుండి రాకపోవడంతో వారు సొంతం ఖర్చుతోనే పెట్టుకొని ఆఫీసును నడుపుతున్నారు. అవికూడా సక్రమంగా చెల్లించకపోవడంతో మూతపడే పరిస్థితి ఏర్పడింది. తాగడానికి నీళ్ల బిల్లులు కూడా సక్రమంగా రావడంలేదు. అడ్మినిస్ట్రేషన్ బిల్లులు వస్తే కనీసంఆఫీస్ సక్రమంగా నడిచే అవకాశం ఉందని సిబ్బంది వాపోతున్నారు. గతంలో కార్యాలయానికి కరెంటు కటింగ్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ సిబ్బంది చందాలు వసూలు చేసి కరెంట్ బిల్లు కట్టడం జరిగిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఉపాధి హామీసిబ్బందికి వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి! రేవంత్ రెడ్డి, ఈ నెల 24న కోస్గి రానున్న నేపథ్యంలో, భద్రతా ఏర్పాట్లను శనివారం డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించారు. ఆయనతో పాటు సీఐ సైదులు, ఎస్‌బి ఎస్సై నరేష్, ఎస్ఐ లు బాలరాజు, విజయ్ కుమార్‌లు కలిసి కోస్గి మండల కేంద్రం కొడంగల్ రూట్‌లోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ వద్ద బందోబస్తు, హెలిప్యాడ్ ఏర్పాటు స్థలాన్ని, పార్కింగ్ స్థలాలు, భద్రతా పరమైన అంశాలు, బ్యారికేడింగ్, బందోబస్తు వంటి ముఖ్యమైన ఏర్పాట్లను ప్రత్యేకంగా అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయా లని అధికారులు సంబంధిత విభాగాలకు సూచించారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే సమావేశంలో భద్రతా చర్యల ను మరింత బలోపేతం చేయనున్నట్లు డిఎస్పీ తెలిపారు

## ఐనవోలు జాతరలో భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు..

- రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- జాతరను విజయవంతం చేసేందుకు అధికారులతో సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 20 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు,శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కానారేన్స్ హాలు లో ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఐనవోలు జాతర ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,ఆలయ కమిటీ ప్రతినిధులతో కలసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, కుడా, మున్సిపల్, మిషన్ భగీరథ, ఇతర అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, భద్రత వంటి జాతరలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కెఆర్ నాగరాజులు సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఐనవోలు జాతర నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలన్నారు. బస్టాండ్ ఏర్పాటు చేసే చోట భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు మాట్లాడుతూ ఐనవోలు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. విఐపి దర్శనం కోసం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విఐపి దర్శనం కోసం రుసుమ చెల్లించిన వారికి టోకెన్లు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జాతరలో మెరుగైన సౌకర్యాలను వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం జాతర ఉత్సవాల పోస్టర్లను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కలెక్టరేట్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి సుధాకర్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మేడారం జాతరలో వైద్య సదుపాయాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఆరు జిల్లాల డీఎంహెచ్‌వోల పర్యవేక్షణలో వైద్య సదుపాయాలు
- మేడారంలో 30 క్యాంపులతో ఏర్పాట్లు
- ములుగు డిఎంహెచ్‌వో గోపాల్‌రావుతో 'జనంసాక్షి' ముఖాముఖీ






**ములుగు బ్యూరో, డిసెంబర్20 (జనంసాక్షి):** మేడారం జాతర లో భక్తులకు వైద్య సదుపాయాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని ములుగు డిఎంహెచ్ఓ గోపాలరావు జనం సాక్షితో ముఖాముఖిలో తెలిపారు.మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ చొరవ తో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.మొత్తం మూడు రకాలు జాతర ఏర్పాట్లను ప్లాన్ చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. శ్రీ జాతర డిసెంబర్ 26 నుంచి జనవరి 27 వరకు ఉంటుందనీ,జాతర జనవరి 27 నుంచి జనవరి 30 వరకు ప్రధాన జాతర ఉంటుంది. పోస్ట్ జాతర ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు ఉంటుంది ఇందులో భాగంగా తాడ్వాయి, ఎటూర్ నాగారం, గోవిందరావుపేట, ములుగు లలో స్పెషల్ డాక్టర్లతో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.దీంతో పాటు అత్యవసర పరిస్థితులకు గాను భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ మరియు వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ ను వినియోగించుకోవడం జరుగుతుంది.

### జాతరలో మొత్తం 30 క్యాంపులు ఏర్పాటు....

జాతర సమయంలో భక్తులు రద్దు ఎక్కువగా ఉంటుంది.దీనిని దృష్టిలో పెట్టుకొని జాతరలో 30 క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది.శ్రీ సమ్మక్క సారలమ్మ మెయిన్ క్యాంపు వద్ద 50 బెడ్లతో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశాం.ఇందులో డెలివరీ వార్డు,జనరల్ వార్డు,స్పెషల్ వార్డులను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.సుమారుగా 150 మంది స్పెషల్ డాక్టర్లు ఉమ్మడివరంగల్ జిల్లా నుంచి పనిచేస్తారు.500 మంది పారామెడికల్ సిబ్బంది పని చేస్తారు.108 అంబులెన్స్ లు 57 వరకు పనిచేస్తాయి.మొబైల్ బైక్ అంబులెన్సులు 40 వరకు పనిచేస్తాయి.స్పెషల్ డాక్టర్లు 50 మంది వరకు పనిచేస్తారు.గవర్నమెంట్ ములుగు ఏరియా హాస్పిటల్ మొత్తం డాక్టర్లు ఇందులో పనిచేస్తారు.ఎంజీఎం వరంగల్ హాస్పిటల్ లో ఉన్న డాక్టర్లు అందరూ మేడారం జాతరలో పనిచేస్తారు. ఆశాల 500 మంది,స్టాఫ్ నర్సులు 100 మంది, సిఎస్సి ఎంప్లాయిస్ 100 మంది వరకు జాతర లో పనిచేస్తారు.

### భక్తులకు ఇబ్బందుకు లేకుండా వైద్య సదుపాయాలు....

మేడారం జాతర లో వైద్య సదుపాయాలకు తాడ్వాయి 10 బెడ్లు ఏర్పాటు చేశాం, గోవిందరావుపేటలో ఎమర్జెన్సీ బెడ్లు ఏర్పాటు చేశాం, ఎటూర్ నాగరంలో 15 బెడ్లు,వెంకటాపూర్,ములుగు,ఎంజీఎం వరంగల్,అత్యవసరమైన భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ లో ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగింది.మేడారం మెయిన్ క్యాంపులో సిపిఎం,జిఎంహెచ్ గవర్నమెంట్ మరియు ఐ స్పెషలిస్ట్ డాక్టర్లు పనిచేస్తారు. రీజనింగ్ ఆఫీసర్లు మొత్తం డిఎంహెచ్వోలు ఏడుగురు పనిచేస్తారు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం డిఎంహెచ్వో రీజనింగ్ ఆఫీసర్లుగా పనిచేస్తారు.రీజనింగ్ ఆఫీసర్లు డాక్టర్ సాంబశివరావు డిఎంహెచ్ఓ వరంగల్, డాక్టర్ మధుసూదన్ డిఎంహెచ్ఓ భూపాలపల్లి, డాక్టర్ అప్పయ్య డిఎంహెచ్ఓ హనుమకొండ పర్యవేక్షణలో ములుగు డిఎంహెచ్వో గోపాలరావు ఆధ్వర్యం లో వైద్య సేవలు భక్తులకు అందిస్తారు...

## రైతుల వాగ్వివాదాల మధ్య రబీ తైబంది వాయిదా



**గోవిందరావుపేట (జనంసాక్షి) :** రైతుల వాగ్వివాదాల మధ్య లక్నవరం రబీ తైబంది వాయిదా పడింది. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం లక్నవరం చెరువు రబీ తైబంది సమావేశం మండల వ్యవసాయ అధికారి కే.జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతుల వాదనలు వాదోపవాదాలు విన్న నీటిపారుదల శాఖ డిఈ రవీందర్ రెడ్డి 6 వేల ఎకరాలకు సరిపడా నీరు ఉందని శ్రీ రంపతి కాలువ 1100 ఎకరాలు రంగాపురం కోట కాలువ 4500 ఎకరాలు మొత్తం 5600 ఎకరాల రబీ సాగుకు తైబందీని ప్రకటించారు. దీంతో చల్వాయి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గతంలో బ్యాలెన్స్ మిగిలిపోయిన గౌరారం 400ఎకరాలను కూడా రబీ తైబందీగా ప్రకటించాలని పట్టుబట్టారు. రైతుల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్ఐ సునీల్ ఏఈలు అఖిల్ రెడ్డి, దీపక్, ఉపేందర్ రెడ్డిలతో పాటు నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి న్యాయ సేవలు

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ
- ఆర్డీవో ఆఫీసులో న్యాయ సేవలు శిబిరం ప్రారంభం




**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో గల ఆర్డీఓ కార్యాలయంలో శనివారం వృద్ధుల సంక్షేమం కొరకు ఏర్పాటుచేసిన న్యాయ సేవల శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారదతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "తల్లిదండ్రులు మరియు వృద్ధుల సంరక్షణ – మన సామాజిక, చట్టపరమైన బాధ్యత అని తెలిపారు.ఈ ఉచిత న్యాయ సేవా శిబిరం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది మన ఇంట్లో ఉన్న వృద్ధులకు మనం ఇచ్చే భరోసా. వృద్ధులలో ఆత్మగౌరవం తగ్గకూడదని, నేటి సమాజంలో మారుతున్న జీవనశైలి వల్ల చాలామంది వృద్ధులు ఒంటరితనాన్ని, నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2007లో "తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం" తీసుకువచ్చిందని తెలిపారు. వృద్ధులు పోషణ పొందే హక్కు, ఆస్తి రక్షణ, తక్షణ పరిష్కారం మొదలగు హక్కులు కలిగి ఉన్నారని వివరించారు.ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా ఈ న్యాయ సేవా శిబిరమును సంప్రదించి, ఉచిత న్యాయ సలహాలు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, వారికి అవసరమైన న్యాయ సహాయం సకాలంలో అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, ఆర్.డి.ఓ. టి.సుమ, డి.ఏ.ఓ.ఫణి కుమార్, న్యాయవాది యస్.కుమార్, పారా లీగల్ వాలంటీర్ ఆలేటి.డార్కస్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వరంగల్ అధ్యక్షులు మల్లారెడ్డి, వయోవృద్ధులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

**చిట్యాల, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో సి ఆర్ ఆర్ నిధులు రూ 20 లక్షలతో వెంకట్రావుపల్లి ( సి) మెయిన్ రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు, అలాగే రూ70 లక్షలతో గ్రామపంచాయతీ నుండి స్మశాన వాటిక (చలివాగు) వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు టెంకాయ కొట్టి , శంకుస్థాపన చేశారు .అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. నియోజకవర్గం లోని రహదారులను బలోపేతం చేసేందుకు అంతర్గత రహదారుల పనులు వేగవంతం చేస్తున్నామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, డిఈ వెంకటేశ్వర్లు, ఏఈ అరుణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా కార్యదర్శి ముఖిరాల మధువంశీకృష్ణ, చిలుకల రాయకొమురు, మూల శంకర్ గౌడ్,గడ్డం కొమురయ్య, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, బుర్ర తిరుపతి, టౌన్ అధ్యక్షులు గంగాధర్ రవీందర్,మండల యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, కొక్కుల సదానందం, దబ్బెట రవి, రమేష్, క్యాతం మార్కండేయ, ఆకుల రవీందర్, ఆరె పెల్లి నరసింహారాములు, అల్లంరాజు, బుర్ర రాజ్ కుమార్, ఆకుల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి మారుపేరు ఎస్పీ జానకి షర్మిల

- ఎస్పీ కార్యాలయంలో అన్ని మతాల పండుగల నిర్వహణ



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్20 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా ఎస్పీగా డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్మల్ జిల్లాలో మత సామరస్యానికి కొత్త నిర్వచనం ఏర్పడుతోంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన ప్రధాన పండుగలైన వినాయక చవితి, రంజాన్, క్రిస్మస్‌లను ఎస్పీ కార్యాలయంలో సమాన గౌరవంతో, సోదర భావంతో నిర్వహిస్తూ ఆమె అన్ని వర్గాల ప్రజల మన్నన పొందుతున్నారు. మతం పేరుతో విభేదాలు పెరుగుతున్న ఈ కాలంలో, పండుగలు మనందరిని కలిపే వేదికలు కావాలి అన్న భావనతో ఎస్పీ జానకి షర్మిల చేపడుతున్న ఈ కార్యక్రమాలు జిల్లాలో విశేష ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రతి పండుగను కేవలం ఆచారంగా కాకుండా, ఐక్యతకు ప్రతీకగా మార్చడంలో ఆమె ప్రత్యేక చొరవ చూపుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ పండుగల నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు జర్నలిస్టులను సైతం భాగస్వామ్యం చేస్తూ పండుగలను జరుపుకోవడం. జర్నలిస్టులను ఆహ్వానించి, వారితో కలిసి పండుగ శుభాకాంక్షలు పంచుకోవడం ద్వారా పోలీసు శాఖ మీడియా మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. శాంతి, భద్రతల పరిరక్షణలోనే కాకుండా, సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పడంలోనూ పోలీసు శాఖ కీలక పాత్ర పోషించాలన్న దృఢమైన సంకల్పాన్ని ఎస్పీ జానకి షర్మిల తన చర్యల ద్వారా చాటుతున్నారు. ఈ తరహా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా సోదర భావాన్ని పెంపొందించడమే కాకుండా, పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయని పోలీసు సిబ్బంది, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మొత్తానికి, నిర్మల్ జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా ఎస్పీ జానకి షర్మిల నిలుస్తూ, ఆదర్శ పోలీసు అధికారిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్నారు.

## సృజనాత్మక శక్తిని పెంపొందించడానికే సైన్స్ ఫెయిర్

- పరకాల, వర్ధన్నపేట శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు




**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ లు దోహదపడతాయని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన శనివారం హనుమకొండ సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్ ఆవరణలో వైభవంగా ముగిసింది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్‌వి గిరి రాజ్ గౌడ్ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఇరువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సైన్స్ ద్వారా రుగ్మతలను, మూఢనమ్మకాలను పారద్రోలాలని కోరారు. సాంకేతిక పరికరాలు అనేకం అందుబాటులోకి రావడంతో విద్యార్థులలో ఆలోచన శక్తి తగ్గి వాటి మీదనే ఆధారపడటం ఎక్కువైందన్నారు. ప్రకృతిని నాశనం చేస్తుండడం వల్లే అనేక రకాలైన అనర్థాలు వస్తున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జిల్లాస్థాయి విద్యా ,వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఇన్స్ ఫైర్ జిల్లా సైన్స్ ఫెయిర్ విజేతలకు శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కె .ఆర్. నాగరాజులు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, డిసిఇబి కార్యదర్శి రామ్ ధన్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సదానందం గౌడ్ , సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్ ప్రిన్సిపల్ హరిత, ట్రస్మా అధినేత సతీష్, ఎంఈఓ లు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలి

- హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో చట్టం ప్రతుల దగ్ధం



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** నాలుగు రోజుల క్రితం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్ లో ఆమోదించిన నూతన ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం ఆధ్వర్యంలో చట్టం ప్రజలను దగ్ధం చేశారు.మోడీ ప్రభుత్వం ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో హఠాత్తుగా ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఇందులో గ్రామీణ పేదల, ఉపాధి అవకాశాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని వారు అన్నారు.క్రమక్రమంగా ఉపాధి హామీ పని దినాలు ఎత్తివేసే కుట్రలో భాగంగానే ఈ నూతన చట్టం తీసుకువచ్చారని వారన్నారు.గతంలో వంద రోజుల పని దినాలు మాత్రమే ఉంటే రైతు సంఘాలు 200 పని దినాలు కావాలని ఆందోళన చేస్తుంటే మోడీ ప్రభుత్వం మాత్రం 125 రోజులు పని దినాలుగా ప్రకటించిందని వాస్తవానికి ఇది కూడా అమలు కాదని వారు తెలిపారు. ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 10% ఖర్చు చేస్తే ఈ నూతన చట్టంలో కేంద్రం 60 శాతం రాష్ట్ర 40 శాతం నిధులు కేటాయించాలని ఉందని వారు అంటూ గతంలోనే అర కోర నిధులు, మంజూరు చేసేదని, ఇప్పుడు ఆ కొంత నిధులు కూడా రావని అన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దుచేసి సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు .రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ డిమాండ్ల సాధనకు ఐక్య ఆందోళనలు చేపడతామని కేంద్ర , ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే యం జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు మరియు ఓదెల రాజయ్య , ఊరటి హంసల్ రెడ్డి బొల్లు ఎల్లయ్య బొజ్జం కమలాకర్ యారా ఐలయ్య జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## 22న నిర్వహించే మాక్ డ్రిల్ ను సక్సెస్ చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై ఈ నెల 22న ఉదయం 9 గంటలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మోరంచపల్లిలో నిర్వహించనున్న మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మాక్ డ్రిల్‌లో వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో సహాయక చర్యలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించే విధానాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, ఆరోగ్య , మున్సిపల్, పరిశ్రమల శాఖతో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తులు లేదా పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించడమే లక్ష్యంగా ఇటువంటి మాక్ డ్రిల్లు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.

## పోలీసులకు గ్రామస్తులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత



**నెరడిగొండ, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** మండలంలోని చిన్న బుగ్గారాం గ్రామంలో గ్రామస్తులకు,పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.శనివారం రోజున స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇటీవల జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఓ వ్యక్తి ఓడిపోవడంతో కోపం పెంచుకున్న వ్యక్తి రోడ్డుపై అడ్డంగా ఎడ్ల బండిని పెట్టి రోడ్డు ను మూసివేయడంతో తనకు ఓటు వేయాని వారు ఆ దారిగుండా వెళ్లకూడదని నిర్ణయించారని,సమాచారం అందుకున్న పోలీసులు ఎడ్లబండిని తొలగించేందుకు యత్నించారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరుగగా పోలీసులపై దాడిగి దిగినట్లు పేర్కొన్నారు.గ్రామంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలైన సంఘటన గ్రామస్తులకు పోలీసులకు మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాడానికి కారణాలు మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 డిసెంబర్ 2025

# మిర్యాలగూడలో అర్హత లేని వైద్యుల గుట్టు రట్టు

- స్టింగ్ ఆపరేషన్‌తో హడలెత్తించిన మెడికల్ కౌన్సిల్ బృందం
- బాధ్యులపై చర్యలకు సిఫారసు

**మిర్యాలగూడ, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** వైద్యో.. నారాయణో.. హరి అంటారు పెద్దలు. ప్రాణాలు నిలుపుతాడని వైద్యుడికి భగవంతుడి స్థానం కల్పించారు సమాజంలో. కానీ కొందరు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అర్హతలు లేకపోయినా.. కార్పొరేట్ స్థాయిలో సకల సౌకర్యాల తో ఆసుపత్రులు ఏర్పాటు చేసి.. వచ్చిరాని వైద్యంతో ప్రజల ఆరోగ్యాలను, జేబులను కొల్లగొడుతున్న పరిస్థితి మిర్యాలగూడ పట్టణంలో నెలకొంది. మరికొందరు హైదరాబాదుకు చెందిన ప్రముఖ డాక్టర్ల పేర్లు పెట్టుకుని, అనుమతులు పొంది టెక్నీషియన్లతోనే వైద్యం చేస్తూ, మందులు తయారీ కంపెనీలు అందించే ఫిజీషియన్ శాంపిల్స్‌తో దండుకుంటున్న దుస్థితి ఉంది. శనివారం నాడు మిర్యాలగూడ పట్టణంలో పలు ఆసుపత్రులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ తో ఈ అక్రమ బాగోతం బయటపడింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ నియోజకవర్గం లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉండటంతో మిర్యాలగూడ పట్టణంలో వందల సంఖ్యలో ఆసుపత్రులు ఉన్నాయి. రోజు రోజుకి పుట్టగొడుగుల్లా మరికొన్ని పుట్టుకు వస్తూనే ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలంటూ, ఆధునిక టెక్నాలజీలు అంటూ ఊదరగొడుతూ కొన్ని ఆసుపత్రులలో అర్హత లేని వైద్యం తో ప్రజలను దండు కోవడమే గాక,అనేక సందర్భాలలో రోగుల ప్రాణాలను హరించి వేస్తున్న సంఘటనలు అనేకం వెలుగు చూశాయి. జిల్లా వైద్యాధికారి, స్థానికంగా జిల్లా డిప్యూటీ వైద్యాధికారి కార్యాలయం ఉన్నప్పటికీ, సరైన పర్యవేక్షణ లేకపోవడం.. నెలవారి ముడుపులతో ఆసుపత్రుల అక్రమ భాగోతాలను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ప్రజల నుండి పెద్ద ఎత్తున వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో.. శనివారం నాడు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కే మహేష్ కుమార్, రిజిస్టర్ డాక్టర్ డి లాలయ్య కుమార్ ల ఆదేశాల మేరకు పబ్లిక్ రిలేషన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ వి. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ కె. రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్ వర్మ, విజిలెన్స్ అధికారి ఎం. రాకేష్ ల పర్యవేక్షణలో తనిఖి బృందాలు పట్టణంలోని ఎనిమిది కంటి ఆసుపత్రులలో తనిఖీలు చేయగా,7 ఆసుపత్రులలో అక్రమ భాగోతం బయటపడింది. శ్రీ వెంకటేశ్వర, షాలిని, మహాలక్ష్మి, అన్నపూర్ణ, యశస్వి, రఫా విజన్




కేర్, శివసాయి తదితర ఆసుపత్రుల్లో విస్తీపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్ బి, శాలిని ఆసుపత్రులకు చెందిన డాక్టర్ భరత్ భూషణ్, డాక్టర్ వెంకటేశ్వర్లు లు కేవలం ఎంబిబిఎస్ మాత్రమే చేశారని, ఎంఎస్ ఆప్తమాలజీ లేకుండానే క్వాలిఫైడ్ డాక్టర్ల మంటూ కంటి వైద్యం నిర్వహిస్తున్నారని స్టింగ్ ఆపరేషన్ లో వెలుగులోకి వచ్చినట్లు కౌన్సిల్ బృందం చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. మరికొన్ని ఆసుపత్రులలో హైదరాబాద్ కు చెందిన కంటి వైద్యులు డాక్టర్ శ్రీ కుమార్, డాక్టర్ ప్రభు చైతన్య, డాక్టర్ బషీర్, డాక్టర్ అమర్ ల పేరుపై రిజిస్టర్ చేసుకొని అనుమతులు పొందిన ఆసుపత్రులలో కేవలం టెక్నీషియన్లు మాత్రమే వైద్యం చేస్తూన్నట్లుగా గుర్తించినట్లు తనిఖీ డాక్టర్లు తెలిపారు. దీనితోపాటు కోమల మెడికల్ అండ్ జనరల్ స్టోర్ నిర్వాహకుడు ఎటువంటి అర్హతలు లేని నకిలీ వైద్యుడు ఏ కోటేశ్వరరావు తన ఫస్ట్ ఎయిడ్ సెంటర్లో బెడ్లు ఏర్పాటు చేసి, ఇష్టానుసారంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజక్షన్ ఇస్తూ ప్రజారోగ్యంతో చలగాటం ఆడుతున్నట్లు తేలిందన్నారు. మరో నకిలీ వైద్యుడు ఫ్రెండ్స్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు మునీర్ తనఖీ ఈ విషయం తెలిసి పరారైనట్లు గుర్తించి నట్లు వెల్లడించారు .ఈ సందర్భంగా తనిఖీ బృందం చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా, గతంలో అందిన ఫిర్యాదుల మేరకు మిర్యాలగూడ పట్టణంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.ఎలాంటి అర్హతలు లేకుండా, క్వాలిఫైడ్ డాక్టర్లు లేకుండా ఆస్పత్రులు ఏర్పాటు చేసి వైద్యం నిర్వహిస్తున్న ఏడు ఆసుపత్రులను గుర్తించినట్లు తెలిపారు. శాస్త్రీయంగా స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి అక్రమ తంతును సరైన ఆధారాలతో సేకరించామన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వీడియో రికార్డింగ్ చేయడం జరిగిందన్నారు. సేకరించిన వివరాలను మెడికల్ ఎథిక్ కమిషన్ కు అందజేయటం జరుగుతుందన్నారు. ఎథిక్ కమిషన్ రెగ్యులేషన్ ప్రకారం కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సెక్షన్ 34, 54 ప్రకారం అర్హత లేకుండా వైద్యం నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నకిలీ కంటి వైద్యులు డాక్టర్ ఎం భరత్ భూషణ్ డాక్టర్ కే వెంకటేశ్వర్లకు సోకాస్ నోటీసులు జారీ చేసి మెడికల్ ఎథిక్స్ అండ్ మాల్ ప్రాక్టీసెస్ కమిటీ ముందు విచారణ నిర్వహించి, సరైన సమాధానం రాకపోతే అవసరమైతే వారు ఎంబిబిఎస్ డిగ్రీ లైసెన్సులను సస్పెండ్ చేస్తామని తెలిపారు. అర్హతకు మించి వైద్యం నిర్వహిస్తున్న టెక్నీషియన్లు నాగేష్, వాల్కే శ్రీను, నాగరాజు, శివ కోటేశ్వరరావు, వెంకటేష్, వికాస్ కుమార్, నకిలీ వైద్యుడు ఏ కోటేశ్వరరావు లపై ఎన్ ఎం సి, టీఎం పిఆర్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు కౌన్సిల్ బృందం తెలిపారు. కమిషన్ ద్వారా మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఆయా ఆస్పత్రులను సీజ్ చేసేందుకు జిల్లా కలెక్టర్ కు, జిల్లా వైద్యాధికారికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఆరోపణలు రుజువైతే సంవత్సరం జైలు శిక్ష, 5 లక్షల జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తనిఖీ బృందం డాక్టర్లు తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా నకిలీ వైద్యులపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, అర్హతకు మించి వైద్యం చేయటం, ఇంజక్షన్లు ఇవ్వడం, ఆపరేషన్లు నిర్వహించటం, లింగ నిర్ధారణ జరపటం, అక్రమ గర్భస్రావాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని డాక్టర్ నరేష్ కుమార్ హెచ్చరించారు. తనిఖీలకు సహకరించి పోలీసులతో రక్షణ కల్పించిన మిర్యాలగూడ డిఎస్పి కె రాజశేఖర్ రాజుకు, పోలీస్ అధికారుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఆసుపత్రులు మూసి పారిపోయిన ఆర్ఎంపీలు..

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న కొందరు ఆర్ఎంపీలు, అర్హత లేని వైద్యం నిర్వహిస్తున్న మరికొన్ని ఆసుపత్రుల యజమాన్యాలు హడావుడిగా ఆసుపత్రులు మూసివేసి పలాయనంచిత్తగించినట్లు సమాచారం. కాగా మరికొన్ని ఆసుపత్రులను తనిఖీలు చేసినట్లయితే మరింత అక్రమ బాగోతం బయటకు వచ్చేదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# దళితుల ప్రాణాలు అంటే విలువ లేదా..?

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**కోదాడ, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ కేసులో ప్రధాన నిందితుడు చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డి తో పాటు సంబంధిత అధికారులు అందరిపై చట్టపరంగా, శాఖపరమైన చర్యలు తీసుకోవడమే తమ ప్రధానమైన డిమాండ్ అని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలుకూరు ఎస్సై రెడ్డి కులస్తుడు కావడం వాళ్ళనే కేవలం ఎస్ పి ఆఫీస్ కు అటాచ్ చేసి బీసీ అయినటువంటి రూరల్ సీఐపై సస్పెండ్ వేటు వేశారని అన్నారు. రాజేష్ కేసులో తమ కులాలకు,మతాలకు అతీతంగా డీజీపీకి, ఎస్సీ కమిషన్ కు కేసులో తమ వాళ్ళు ఉన్న చర్యలు తీసుకోమని ఫిర్యాదు చేసామని తెలిపారు. ఎస్కార్ట్ వచ్చిన వారిపై కేసును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించిన డీఎస్పీ,ఎస్పీపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ ఆసుపత్రిలో ఎవరూ లేనట్టుగా రెడ్డి కమ్యూనిటీకి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి పోస్టుమార్టం ఎందుకు చేశారు. అదే రోజు రాత్రి చిలుకూరు ఎస్సై పోస్టుమార్టం చేసిన డాక్టర్ ను ఎందుకు కలిశారు. పోస్టుమార్టం వీడియోను చిత్రీకరించేందుకు హైదరాబాద్ నగరంలో ఎవరూ లేనట్టుగా కోదాడ పట్టణంలోని మయూరి స్టూడియో రామకృష్ణారెడ్డి ని పిలిపించి ఎందుకు వీడియో తీయించారు.రెడ్డి కులస్తులు అంతా కలిసి ఒక దళిత యువకుడి ని పొట్టన పెట్టుకున్నారు.ఈ హత్య కేసులో స్థానిక ఎమ్మెల్యే ప్రత్యక్ష భాగస్వామిగా ఉన్నారని దళితుల ప్రాణాలు అంటే మీకు అంత చౌకగా కనిపిస్తున్నాయా ఎమ్మెల్యే..? అని ఆయన నిలదీశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఈ ఉదంతంపై ఏమీ పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమని అన్నారు. దళిత బిడ్డకు అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉన్న ఈ నాయకులు రేపు ఏ మొహం పెట్టుకొని మాదిగ వాడల్లో, పల్లెల్లో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. మాదిగ జాతి భవిష్యత్తు మరియు అస్తిత్వమే తమకు ముఖ్యమని, దీనిపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లాక్ అప్ డెత్ కేసులో బాధ్యులైన వారందరిపై హత్య నేరం మోపి 302, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించాలన్నారు లేనిపక్షంలో తాము ఇప్పటి వరకు శాంతియుతంగా నిరసన తెలిపామని ఇకపై రోడ్డు ఎక్కి తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్ర స్థాయి గ్రూప్-3 ఉద్యోగానికి ఎంపికైన మహేష్



**గుర్రంపోడు, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన ఇటికాల మహేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 3 ఫలితాలలో హైదరాబాదు నాంపల్లిలోని మైనారిటీ సంక్షేమ శాఖలో రాష్ట్రస్థాయి ఉద్యోగాన్ని సాధించాడు.చిన్నప్పటి నుండి కష్టపడే మనస్తత్వాన్ని కలిగి ప్రతి విషయాన్ని కూలంకషంగా విశ్లేషించే గుణం కలిగిన ఇటికాల మహేష్ గుర్రంపోడు మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్లో పదవ తరగతి,నల్లగొండ విద్యాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్,హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ,హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెస్సీ చదివి మొక్కవోని అకుంఠిత దీక్షతో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమై మొత్తం మీద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 3 ఫలితాలలో హైదరాబాదు నాంపల్లి లోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. మొక్కవోని పట్టుదలతో దీక్షగా చదివి గ్రూప్-3 లో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన ఇటికాల మహేష్ ను గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన బంధువులు,గురువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు



**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 20 (జనం సాక్షి) :** విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. జయశ్రీ తెలిపారు. క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో మెలిగి ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఆమె ఉద్బోధించారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవి, డీఈవో సత్యనారాయణలతో కలిసి 9 జెడ్పి పాఠశాలలకు చెందిన 321 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.1.80 లక్షల విలువైన స్నాక్స్, నీళ్ల సీసాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆమె చేతుల మీదుగా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు రిలయబుల్ ట్రస్ట్ ముందుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు.రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ, తాను ప్రభుత్వ నవోదయ విద్యా లయంలో చదువుకున్నానని తెలిపారు. తల్లిదండ్రులకు గర్వకారకులుగా పిల్లలు ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. జెడ్పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, దీపా జోషి, హనుమంతు, ఉదయ, అశోక్, రఘుమారెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూరు శాతం హాజరు ఉన్న విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు.

# మాక్ డ్రిల్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** ఈ నెల 22న కోదాడలో ఆకస్మికంగా సంభవించే వరదలు,అగ్ని ప్రమాదాల నివారణపై నిర్వహించు మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ కు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అనుకోకుండా జరిగే వరదలు, అగ్ని ప్రమాదాలలో ప్రజలను అప్రమత్తం చేయటానికి మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ లో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకస్మిక వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సత్వర నివారణ చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయటానికి కోదాడలోని షిరిడి సాయి నగర్ నందు మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ లో భాగంగా ఆకస్మికంగా వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేయాలి, వారి ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అలాగే ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా వారిని ఎలా రక్షించాలో కండ్లకు కట్టినట్టుగా ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు.ఈ మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ లో రెవిన్యూ, అగ్నిమాపక, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపాలిటీ, ఎలక్ట్రిసిటీ, స్పోర్ట్స్ అండ్ యూత్, ప్రజలను భాగస్వాములు చేయటం జరుగుతుందని అన్నారు.ఇలాంటి మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ వల్ల ప్రజలలో ఒక అవగాహన కలిగి వరదలు, విపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడంలో ఉపయోగపడతాయని అన్నారు. ఈ శాఖలు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి, ఈ మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ను విజయవంతం చేయాలని అన్నారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ ఈ మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ లో పోలీసు శాఖకు కేటాయించిన విధులను పోలీస్ శాఖ పటిష్టంగా నిర్వర్తిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఏఎస్పీ జనార్ధన్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ వై.కృష్ణారెడ్డి, కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డీఈవో అశోక్, డీఎస్ఓ మోహన్ బాబు, అడిషనల్ సీఈఓ శిరీష, ఇరిగేషన్ వైద్య ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద స్థలాల రోడ్ పరిశీలన



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026కు సంబంధించి రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా రోడ్డు ప్రమాద స్థలాలు, బ్లాక్ స్పాట్స్ ను జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు.రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా శనివారం సూర్యాపేట లోకల్ పరిధి జాతీయ రహదారి 65పై గల ఈనాడు ఆఫీస్,కేంద్ర గిడ్డంగుల సంస్థ, సువెన్ ఫార్మా దగ్గర, కొత్త మార్కెట్ యార్డు వెల్లే జంక్షన్ వద్ద, ఖమ్మం క్రాస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర, కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్, అంజనపూరి కాలనీ, జనగామ క్రాస్ రోడ్, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాద స్థలాలు బ్లాక్ స్పాట్స్ ను సంబంధిత అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమన్వయంగా కలిసి కలెక్టర్ పరిశీలించారు.ప్రమాద స్థలాల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.బ్లాక్ స్పాట్స్ వద్ద, మూలల వద్ద గ్రామాల వద్ద హెచ్చరిక బోర్డులను, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అధ్యయనం చేసి ఇంజనీరింగ్ లోపాలను సవరించాలని, లైటింగ్ ఏర్పాటు చేయడం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ పాటించడం, పొదలు, చెట్ల కొమ్మలు తొలగించడం, రోడ్డు పాడైన చోట మెటల్ వేయించడం, బ్లింకింగ్ లైట్స్ పెట్టించడం లాంటి చర్యలను తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కమిటీలు ప్రమాదాల నివారణకు పటిష్టంగా కృషి చేయాలని ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజనీర్ మాలాద్రి నాయుడు, టౌన్ సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, ఎంవిఐలు ఆదిత్య, జయప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడాలి




**చండూరు, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాల మైదానంలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ ప్రీమియర్ లీగ్ -6 క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మొదటి బహుమతి ద్వితీయ బహుమతి సాధించిన క్రీడాకారులకు నగదు చెక్కుతోపాటు ట్రోఫీలను అందజేశారు.. ఇటువంటి టోర్నమెంటును రాబోయే కాలంలో మునుగోడు నియోజకవర్గంలో కూడా నిర్వహిస్తామని, గ్రామీణ ప్రాంతాలలో టాలెంట్ ఉన్న పేద విద్యార్థులను గుర్తించి వారిని రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరఫున సహకరిస్తామని అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో క్రికెట్ ఫుట్బాల్ లాంటి ఆటలు ఆడడానికి పది ఎకరాల స్థలంలో నూతన హంగులతో స్టేడియం ఏర్పాటు చేసుకొని సామర్థ్యం ఉన్న క్రీడాకారులను తయారు చేసుకోవాలని అన్నారు.నూతన స్టేడియం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు.వయసు తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు క్రీడలు ఆడాలని క్రీడలు ఆడటం వల్ల శారీరక సామర్థ్యం మెరుగవుతుందని అన్నారు. ఈ మైదానంలో క్రికెట్ ఆటను చూస్తుంటే చిన్ననాటి మేము ఆడిన ఆటలు గుర్తుకొస్తున్నాయని ప్రతి ఒక్కరికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎస్పీ శరత్చంద్ర పవార్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గ్రామాల గెలుపే కాంగ్రెస్ బలం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**బూర్గంపహాడ్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో బూర్గంపహాడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చి ఘన విజయాన్ని అందించి గ్రామస్థాయిలో తమ అపారమైన బలాన్ని నిరూపించారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ విజయోత్సవాన్ని పురస్కరించుకుని సారపాక గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. సభ మొత్తం ప్రజల అభిమానం, కార్యకర్తల ఉత్సాహంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిన బూర్గంపహాడ్ మండల ప్రజలు మరోసారి తమ రాజకీయ పరిపక్వతను చాటుకున్నారు. ఇది కేవలం ఎన్నికల ఫలితం కాదు, ప్రజల నమ్మకానికి వచ్చిన ఘన తీర్పని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే కాంగ్రెస్ సిద్ధాంతానికి ప్రజలు ఇచ్చిన స్పష్టమైన మద్దతే ఈ విజయమని, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రతీకగా కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిన మండల ప్రజల తీర్పు చరిత్రలో నిలిచేలా ఉందన్నారు. గ్రామాల గెలుపే కాంగ్రెస్ బలమని, ప్రజలు ఇచ్చిన తీర్పు రాజకీయాలకు ఒక దిశ చూపిందని, ఇది వ్యక్తుల గెలుపు కాదు%ొ% ప్రజల ఆశయాల గెలుపని, కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెట్టిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే మా బాధ్యతని స్పష్టం చేశారు. పదవులు గౌరవానికి కాదు%ొ% సేవకు. గ్రామంలో చివరి వ్యక్తి వరకూ ప్రభుత్వ పథకాలు అందేలా, అభివృద్ధి ప్రతి వీధిలో కనిపించేలా పనిచేయాలని, ప్రజల మధ్యే ఉండి, ప్రజల సమస్యలే మన అజెండాగా ఉండాలని ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పాలన మాటలతో కాదు%ొ% కార్యాచరణతో ముందుకు సాగుతుందని, బూర్గంపహాడ్ మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు మీ అందరితో కలిసి నేను భుజం భుజం కలిపి పనిచేస్తానని ఎమ్మెల్యే పాయం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం గ్రామ పాలనలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికల్లో స్వయంకృతాపరాదం జరిగిందని మన పార్టీలో ఉండి మూడు రంగుల జెండా వేసుకొని కోవర్టులా వ్యవహరించే వారిని ఏమంటారో తెలియదని.. పార్టీలో ఉండి వేరే నాయకులతో చేతులు కలిపి, వేరే వాళ్ళకి సపోర్ట్ ఇచ్చి పార్టీని వాడకట్టాలని చూసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ




సీనియర్ నాయకులు రాష్ట్ర ఐఎన్టీయూసీ నాయకులు మారం వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ గాంధీ, ఐఎన్టిఈసి పేపర్ బోర్డు సారపాక నాయకులు యారం పిచ్చిరెడ్డి, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్వా వెంకటేశ్వరరావు (లడ్డా), సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ బి బ్లాక్ నాయకురాలు బర్ల నాగమణి, బోడ దివ్య, చెల్లా వెంకట నారాయణ, కైపు శ్రీనివాస్ రెడ్డి, భజన ప్రసాద్, పూలపల్లి సుధాకర్ రెడ్డి, బీసీ నాయకులు వారాల వేణు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.




# 4 రోజుల తర్వాత లాభాల్లోకి

నాలుగు రోజుల వరస నష్టాల అనంతరం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదుకావడంతో, ఫెడ్ కీలక రేట్లను మరింతగా తగ్గించొచ్చనే భావనతో ప్రపంచ మార్కెట్లు రాణించడం ఇందుకు తోడ్పడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) తిరిగి కొనుగోళ్ల బాట పట్టడం కూడా ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 53 పైసలు పెరిగి రూ.89.67 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.53 శాతం లాభంతో 60.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మదుపర్ల సంపదగా పరిగణించే



బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.43 లక్షల కోట్లు పెరిగి రూ.471.22 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. లాభాల్లోనే మొదలై..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు 84,481.80తో పోలిస్తే 275 పాయింట్ల లాభంతో 84,756.79 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అదే ఒరవడిని కొనసాగిస్తూ 85,067.50 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 447.55 పాయింట్లు పెరిగి 84,929.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 150.85 పాయింట్ల లాభంతో 25,966.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,880.45 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,993.35 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 338.30, నిఫ్టీ 80.55 పాయింట్లు నష్టపోయాయి. నాలుగే నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 4 మినహా మిగతావి లాభాల్లోనే ముగిశాయి. బెల్ 2.37%, పవర్‌గ్రిడ్ 2.19%, టీఎంపీవీ 1.98%, ఏషియన్ పెయింట్స్ 1.41%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.34%, ఎల్అండ్‌టీ 1.05%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.9% మేర పెరిగాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.14%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.27% నష్టపోయాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అదుర్స్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదైన రోజే అదరగొట్టాయి. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.2,165తో పోలిస్తే 20.37 శాతం అధికంగా రూ.2,606.20 వద్ద నమోదైంది. చివరకు 19.47 శాతం లాభంతో రూ.2,586.70 వద్ద ముగిసింది.ఐపీఓ ద్వారా రూ.2,180 కోట్లను సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలను సింబయోటెక్ ఫార్మాల్యాబ్ దాఖలు చేసింది.

# రిటైల్ పెట్టుబడులకు క్యూ..

## వచ్చే మూడేళ్లలో 3.5 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్

**జనంసాక్షి:**ఇండియాలో రిటైల్ రంగం వృద్ధిని సాధిస్తుంటే.. అమెరికాలో పతనం అవుతున్నాయి. మన దేశంలో 600 కంటే ఎక్కువ ఆపరేషనల్ మాల్స్ ఉన్నాయి. అయితే ఇందులో వంద కంటే తక్కువ మాల్స్ మాత్రమే గ్లోబల్ ఫండ్స్‌ను ఆకర్షించే సంస్థాగత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. ఈ కొరతే ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు దేశీయ మాల్స్‌లో పెట్టుబడులకు ప్రధాన కారణం. అధిక రాబడి, యువ వినియోగదారుల డిమాండ్, సంస్థాగత పెట్టుబడిదారుల్లో విశ్వాసం కారణంగా భారత రిటైల్ రంగంలో జోరు పెరిగింది. పరిమిత స్థాయిలో వ్యవస్థీకృత రిటైల్ మార్కెట్, సరళమైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) విధానాలు, విదేశీ బ్రాండ్లు, పెట్టుబడిదారులు రిటైల్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. వచ్చే మూడేళ్లలో దేశీయ రిటైల్ రంగం 3.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తోందని అనరాక్ గ్రూప్ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది.పాశ్చాత్య దేశాలలో మాల్స్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కొత్త మాల్స్ స్టోర్లలో 78 శాతం పెరుగుదల ఉన్నప్పటికీ.. 2020 నుంచి నికర మాల్ స్టోర్ మూసివేతలు పెరుగుతున్నాయి. అమెరికాలో రికార్డ్ స్థాయిలో 1,200 మాల్స్ మూతపడ్డాయి. ఉన్న మాల్స్‌లో దాదాపు 40 శాతం ఖాళీలు ఉన్నాయి. అదే మన దేశంలో 2021 నుంచి ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల మధ్యకాలంలో 88కు పైగా విదేశీ బ్రాండ్లు భారత రిటైల్ మార్కెట్‌లోకి



ప్రవేశించాయి. గ్రేడ్-ఏ మాల్స్ కోసం మరిన్ని అన్వేషణలో ఉన్నాయి. దాదాపు పూర్తి ఆక్యుపెన్సీలో ఉన్న గ్రేడ్-ఏ మాల్స్‌లో 95-100 శాతం లీజులు పూర్తయ్యాయి. కీలక జోన్‌లో రిటైల్ స్థలం కోసం దుకాణదారులు ఎదురుచూస్తున్నారు.మన దేశంలో తలసరి రిటైల్ స్టాక్ ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. భారత తలసరి రిటైల్ స్టాక్ ప్రథమ శ్రేణి నగరాల్లో కేవలం 4-6 చదరపు అడుగులుగా ఉంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 2-3 చ.అ.లుగా ఉంది. ఇక, గ్రేడ్-ఏ మాల్స్‌లో తలసరి స్థలం కేవలం 0.6 చ.అ.గా ఉంది. అదే అమెరికాలో సగటు తలసరి రిటైల్ స్థలం 23 చ.అ., చైనాలో 6 చ.అ.లుగా ఉన్నాయి.యువ జనాభా, పెరుగుతున్న ఆదాయాలు, వేగవంతమైన పట్టణ విస్తరణ కారణంగా భారతదేశం 2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్ల వినియోగ స్థాయిని చేరుకునే దిశగా పయనిస్తోంది. దేశంలో గ్రేడ్-ఏ రిటైల్ ప్రాపర్టీలు ఏటా 14-18 శాతం రాబడి అందిస్తాయి. అదే పాశ్చాత్య దేశాలలో ఈ రాబడి దాదాపు రెట్టింపు స్థాయిలో ఉంటుంది. మన దేశంలో నాణ్యమైన రిటైల్ స్థలం కొరతే డిమాండ్‌కు ప్రధాన కారణం. మన దేశంలో రోజుకు మాల్స్ ఫుట్‌ఫాల్స్ సగటున 20 వేలకంటే ఎక్కువగా ఉంటాయి. వీకెండ్‌లో అయితే 40 వేల కంటే అధికంగా ఉంటాయి. ఫుడ్ అండ్ బేవరేజెస్, ఎంటర్‌టైన్‌మెంట్ స్పేస్‌లలో ఫుట్ ఫాల్స్ 30-35 శాతం వాటాలను కలిగి ఉంటాయి. దీంతో ఆన్‌లైన్ రిటైల్ ప్రభావం భౌతిక మాల్స్‌పై ప్రభావం లేదు. మన దేశంలో రిటైల్ స్టోర్లు 'ఫిజికల్'గా మారుతున్నాయి. ఆఫ్‌లైన్ స్టోర్లు కస్టమర్లకు అనుభూతిని, విశ్వాసాన్ని పెంచే కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు డిమాండ్‌ను పెంచుతున్నాయి. మన దేశంలో ప్రముఖ డైరెక్ట్ టు కన్జ్యూమర్(డీ టూ సీ) బ్రాండ్లు ఆన్‌లైన్ కంటే ఆఫ్‌లైన్ విక్రయాలను అధికంగా చేస్తుండటమే ఇందుకు ఉదాహరణ. అయితే మన దేశంలో ఈ-కామర్స్ వాటా 8 శాతంగా ఉంది. అదే చైనా, అమెరికాలో 20 శాతం కంటే అధికం.

పొద్దున లేస్తే ఆన్‌లైన్‌లో ఒక్కసారైనా క్లిక్ మనిపించాల్సిందే. షాపింగ్, ఫుడ్, లైఫ్‌స్టైల్..ప్రతీది ఈ-కామర్స్‌లో కొనేందుకే నేటి యువత మొగ్గు చూపిస్తోంది. అయితే ఈ-కామర్స్ ఎంత పెరుగుతున్నా.. నేటికీ షాపింగ్ మాల్స్‌కు ఆదరణ మాత్రం అస్సలు తగ్గడం లేదు. పాశ్చాత్య దేశాల్లో రిటైల్ స్థలం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే.. మన దేశంలో మాత్రం జోరు కొనసాగి స్తోంది. ఇండియాలో మాల్స్ కేవలం షాపిం గ్ కేంద్రాలే కాదు వినోదం, ఆహారం వంటి సామాజిక అవసరాలను కూడా తీర్చే కేంద్రా లుగా మారాయి. దీంతో మన దేశంలో ఏటేటా రిటైల్ స్పేస్‌కు ఆదరణ పెరుగుతోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.50 | ₹ 6.52 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,23,000 (22 క్యారెట్లు) | ₹ 1,34,180 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,26,000

# రూ.1.5 కోట్ల కారు విడుదల

## చైనా కంపెనీ సరికొత్త రికార్డ్



బీజింగ్(జనంసాక్షి):భారతీయ ఆటోమోటివ్ పరిశ్రమలో బీవైడీ కంపెనీ కొత్త కార్లను లాంచ్ చేస్తూ.. ప్రత్యర్థులకు సైతం గట్టి పోటీ ఇస్తోంది. ఈ వాహన తయారీ సంస్థ చైనాలోని జినాన్ ఫ్యాక్టరీలో 15 మిలియన్ల (1.5 కోట్లు) కారును విడుదల చేసింది.దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఉత్పత్తి మాత్రమే కాకుండా.. బీవైడీ అమ్మకాలు ఎక్కువగానే ఉన్నాయి. 2025 జనవరి నుంచి నవంబర్ వరకు కంపెనీ 4.182 మిలియన్ యూనిట్లను విక్రయించింది. ఈ అమ్మకాలు అంతకు ముందు ఏడాది కంటే 11.3 శాతం ఎక్కువ. చైనాలో మాత్రమే కాకుండా.. సంస్థ ఇతర దేశాల్లో కూడా లక్షల కార్లను విక్రయించినట్లు వెల్లడించింది. మొత్తం మీద బీవైడీ ఆరు ఖండాల్లో.. 119 దేశాల్లో తన ఉత్పత్తులను విక్రయిస్తోంది. అభివృద్ధికి టెక్నాలజీ ఆవిష్కరణలు ప్రధాన కారణం. 2025 మొదటి మూడు త్రైమాసికాలలో.. కంపెనీ పరిశోధన, అభివృద్ధి వ్యయం 43.75 బిలియన్ యువాన్లకు చేరుకుంది, ఇది అంతకు ముందు ఏడాది కంటే 31% ఎక్కువ. "ఎలిగాన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ" వంటి వాటితో.. డెంజా మోడల్ ద్వారా సింగపూర్, థాయిలాండ్, మలేషియాతో సహా బహుళ ఆసియా మార్కెట్లలో కంపెనీ విజయవంతంగా ప్రవేశించింది. ఆట్టో 3 ఎలక్ట్రిక్ కారుతో.. భారతదేశంలో అడుగు పెట్టిన బీవైడీ కంపెనీ.. ఆ తరువాత సీల్, ఈమ్యాక్స్ 7, సీలియన్ 7 వంటి కార్లను లాంచ్ చేసింది. ఈ కార్లు దేశీయ మార్కెట్లో మంచి అమ్మకాలను పొందుతున్నాయి.




# ఎందుకీ ధరల మోత?

## క్రూడాయిల్ ధరలు తగ్గినా.. దేశంలో తగ్గని పెట్రోల్, డీజిల్ రేట్లు

**న్యూఢిల్లీ:**
అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధర లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం అనేది సామాన్యుడికి ఎప్పుడూ ఒక మిస్టరీగానే ఉంటుంది. ప్రస్తుత (2025) అధికారిక గణాంకాలు, గత దశాబ్ద కాలపు విశ్లేషణను పరిశీలిస్తే దీని వెనుక ఉన్న ఆర్థిక, రాజకీయ కారణాలు స్పష్టమవుతాయి.ప్రస్తుతం (డిసెంబర్ 2025 నాటికి) అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర సుమారు 60 - 70 డాలర్ల మధ్య ఊగిసలాడుతోంది. అయినప్పటికీ దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్ ధర లీటరుకు రూ.103-రూ.110 మధ్య, డీజిల్ రూ.90 నుంచి రూ.98 మధ్య ఉంది. మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల్లో దాదాపు 50% నుంచి 55% వరకు పన్నులే ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్‌ను విధిస్తున్నాయి. చమురు ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడా నికి లేదా ద్రవ్యలోటును పూడ్చుకోవడానికి పన్నులను పెంచుతోంది తప్ప, ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం లేదు.

**చమురు కంపెనీల నష్టాల భర్తీ**

గతంలో చమురు ధరలు విపరీతంగా పెరిగినప్పుడు, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రజలపై భారం పడకుండా ధరలను స్థిరంగా ఉంచుతాయి. అప్పుడు వాటికి కలిగిన నష్టాలను ఇలాంటి సమయాల్లో అంటే క్రూడ్ ధరలు తగ్గిన సమయంలో లాభాల రూపంలో భర్తీ చేసుకుంటున్నాయి.

**సెస్, సర్‌ఛార్జ్**

కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఎక్సైజ్ డ్యూటీలో అధిక భాగం సెస్ రూపంలో ఉంటోంది. దీని వల్ల వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఇది ఖజానాకు అదనపు ఆదాయంగా మారుతోంది.

**రూపాయి విలువ పతనం**

పదేళ్ల కిందట డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు రూ.45-50 ఉంటే ప్రస్తుతం అది రూ.90కి చేరుకుంది. ముడి చమురును డాలర్లలోనే కొనుగోలు కాబట్టి, అంతర్జాతీయంగా ధరలు తగ్గినా రూపాయి ఢీలాతో వల్ల మనం చెల్లించే మొత్తం తగ్గడం లేదు.

**10-15 ఏళ్ల కిందటి ధరలతో పోలిక**

సుమారు 2010-2014 మధ్య కాలంలో ముడి చమురు ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ, అప్పటి రిటైల్ ధరలు ఇప్పటికంటే తక్కువగా ఉండేవి. 2010లో పెట్రోల్ ధరలను, 2014లో డీజిల్ ధరలను ప్రభుత్వం నియంత్రించింది అంతకుముందు ప్రభుత్వం రిఫైనరీ కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇచ్చేది. అందుకే అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు ఎక్కువగా ఉన్నా దేశీయంగా ధరలు తక్కువగా ఉండేవి. ప్రభుత్వం సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులను చమురుపై పన్నుల ద్వారా సేకరించడం ప్రారంభించింది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా సామాన్యుడికి ఉపశమనం లభించకపోవడానికి ప్రధాన అడ్డంకి పన్ను విధానం, రూపాయి బలహీనపడటం. పెట్రోల్, డీజి ల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే ధర లు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ఆదా యాన్ని కోల్పోవడానికి ఇటు కేంద్రం, అటు రాష్ట్రాలు సిద్ధంగా లేకపోవడమే ప్రస్తుత పరిస్థితికి మూలకారణం.



*అంతర్జా తీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారత దేశంలో పెట్రోల్, డీజిల్ ధర లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం అనేది సామాన్యుడికి ఎప్పుడూ ఒక మిస్టరీగానే ఉంటుంది. ప్రస్తుత సంవత్సరంలో అధికారిక గణాంకాలు, గత దశాబ్ద కాలపు విశ్లేష ణను పరిశీలిస్తే ధరల తగ్గకపోవడడానికి గల ఆర్థిక, రాజకీయ కారణాలు స్పష్టమవుతాయి.*

# ఇక బంగారు కొండే

## 2026లో పసిడి కొనడం కష్టమే!..

**న్యూఢిల్లీ:**2025 ఇంకొన్ని రోజుల్లో ముగుస్తుంది. బంగార ధరలు మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది (2025) ప్రారంభంలో రూ.78,000 ఉన్న గోల్డ్ రేటు.. ప్రస్తుతం రూ.1.3 లక్షలకు చేరుకుంది.దీంతో 2026లో పసిడి ధరలు ఇంకెలా ఉండబోతున్నాయో అని చాలామంది ఆందోళన చెందుతున్నారు.2026 డిసెంబర్ నాటికి బంగారం ధర ఔన్సుకు 14% పెరిగి 4,900 డాలర్లకు చేరుకుంటుందని.. గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. సెంట్రల్ బ్యాంక్ డిమాండ్, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతలు వంటివి గోల్డ్ రేటు పెరగడానికి



కారణమవుతున్నాయి. వచ్చే ఏడాది కూడా బంగారం ధర భారీగా పెరుగుతుందని నివేదికలో గోల్డ్‌మన్ సాచ్స్ వెల్లడించింది.భారతీయ మార్కెట్లో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా గోల్డ్ రేటు 61 శాతం పెరిగింది. ఈ విధంగా ధరలు పెరగడానికి ప్రధాన కారణం.. ట్రంప్ టారిఫ్స్ ప్రకటనలు. స్టాక్ మార్కెట్స్ కుప్పకూలిన సమయంలో చాలామంది పెట్టుబడిదారులు బంగారంపై ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టారు. ఇది కూడా గోల్డ్ రేటు గణనీయంగా పెరగడానికి ఓ కారణమైంది.ప్రస్తుతం బంగారం కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు. ఎందుకంటే అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, ద్రవ్యోల్బణం సమయంలో పెట్టుబడిదారులకు గోల్డ్ సురక్షితమైన పెట్టుబడి సాధనంగా ఉపయోగపడుతుంది. రాబర్ట్ కియోసాకి వంటి నిపుణులు సైతం బంగారంపై పెట్టే పెట్టుబడి.. మిమ్మల్ని ఆర్థిక సమస్యల నుంచి బయటపడేస్తుందని చెబుతున్నారు. కాబట్టి చాలామంది పసిడిపై పెట్టుబడులు పెంచే అవకాశం ఉంది. కాబట్టి రేటు కూడా పెరుగుతుందని స్పష్టంగా అవగతం అవుతోంది.వరుస హెచ్చుతగ్గుల మధ్య డిసెంబర్ 20 బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. కాబట్టి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై నగరాల్లో.. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1,34,180 వద్ద.. 22 క్యారెట్ల 10 గ్రాముల రేటు రూ. 1,23,000 వద్ద నిలిచాయి. చెన్నైలో మాత్రమే ఈ ధరలు కొంత ఎక్కువగా ఉన్నాయి.

# తండ్రికి బీమా చేయించి.. పాముకాటుతో అంతమొందించారు

గణేశన్ బీమా క్లెయిమ్‌లను ప్రాసెస్ చేస్తున్న సమయంలో అతడిపై అధిక విలువ గల అనేక పాలసీలు ఉండడం, అతడి కుమారుల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో బీమా సంస్థ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గణేశన్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని.. ఈ కేసులో క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ కేసుపై విచారణ జరిపిన పోలీసులు కుమారులే బీమా డబ్బు కోసం తండ్రిని పాము కాటుతో చంపించినట్లు గుర్తించారు. పథకం ప్రకారమే వారు తండ్రి పేరు మీద రూ. 3 కోట్ల బీమా చేయించారని.. అనంతరం ప్రమాదవశాత్తూ తమ తండ్రి చనిపోయినట్లు నమ్మించడానికి పాము కాటుతో చంపాలని కుట్ర పన్నారని పోలీసులు వెల్లడించారు. గణేశన్ మృతి చెందిన వారానికి ముందు కూడా అతడి కుమారులు ఆయనను చంపడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తమ స్నేహితుల సహకారంతో ఒక పామును తమ తండ్రి నిద్రిస్తున్న సమయంలో ఆయన పక్కన వదిలారు. అయితే ఆ పాము కాటు ప్రాణాంతకం కాకపోవడంతో వారి ప్రయత్నం ఫలించలేదు. దీంతో వారం రోజుల తర్వాత మరో అత్యంత విషపూరితమైన పామును తీసుకువచ్చి.. గణేశన్ నిద్రపోతున్న సమయంలో అతడి మెడపై కాటు వేయించారు.

# బంగ్లాదేశ్‌లో ఆందోళనలు... ఏడుగురి అరెస్టు

ఢాకా:ఇటీవల బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఆందోళన ల్లో ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలతో 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ మతానికి చెందిన వ్యక్తిని ఆందోళనకారులు తీవ్రంగా కొట్టి చంపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతుండటంపై యూనస్ ప్రభుత్వం స్పందించింది. ఈ హత్య కేసులో ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వెల్లడించారు. తమ ప్రభుత్వ పాలనలో మూక దాడులకు చోటు లేదని, ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష విధిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిషన్ అల్లర్లపై దర్యాప్తు చేస్తోందన్నారు. ప్రజలంతా సంయమనం పాటించాలని, మూక హింసకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గతంలో 'విద్యార్థుల ఉద్యమం'లో కీలక పాత్ర పోషించిన ఇంక్విలాబ్ మోంచో యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అతడి మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆందోళనలు కొనసాగుతోన్న నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ఆ దేశంలోని భారత హైకమిషన్ అక్కడి భారతీయులకు సూచించింది. బంగ్లాదేశ్ అల్లర్లలో మైనార్టీ వర్గానికి చెందిన దీపూ చంద్రదాస్‌ను హత్య చేయడం చాలా విషాదకర ఘటనగా కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా.. నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. బంగ్లాలో నెలకొన్న ఉద్రిక్తతలపై భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా బంగ్లా ఆర్మీ చీఫ్ మాట్లాడుతూ.. తమ దేశంలోని అన్ని భారతీయ ఆస్తులు సురక్షితంగా ఉన్నాయన్నారు. దేశంలో ఉద్రిక్తతలు కొనసా గుతోన్నప్పటికీ ప్రజల భద్రతను కాపాడడానికి యూనస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# పొగమంచు గుప్పిట్లో విమానయానం

**న్యూఢిల్లీ:**ఉత్తర భారత దేశాన్ని కమ్మేసిన దట్టమైన పొగమంచు విమాన ప్రయాణికులకు చుక్కలు చూపుతోంది. శీతాకాలం తీవ్రత పెరగడంతో విజిబిలిటీకనిష్ట స్థాయికి పడిపోయి, విమాన సర్వీసులు ఒక్కసారిగా రద్దయ్యాయి. ముఖ్యంగా ఇటీవల పెద్ద మొత్తంలో విమానాలు రద్దు చేసిన ఇండిగో ఈమేరకు మళ్లీ శనివారం (డిసెంబర్ 20) సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దాంతో వందలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రతికూల వాతావరణం కారణంగా శనివారం దేశవ్యాప్తంగా 80కి పైగా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. అంతకు ముందు శుక్రవారం కూడా ఢిల్లీ విమానాశ్రయం నుంచి 73 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులతో కలిపి మొత్తం 79 విమానాలు రద్దు కావడంతో



ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రాంచీ, జమ్మూ, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం అత్యధికంగా ఉంది. 'వాతావరణ పరిస్థితులను మేము నిశితంగా గమనిస్తున్నాం. మీ ప్రయాణం సురక్షితంగా సాగేలా మా బృందాలు కృషి చేస్తున్నాయి. ప్రయాణికులు విమానాశ్రయానికి వచ్చే ముందే తమ విమాన స్థితిని తనిఖీ చేసుకోవాలి' అని ఇండిగో తన తాజా అడ్వైజరీలో పేర్కొంది.దేశ రాజధానిలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పొగమంచు ధాటికి విలవిలలాడుతోంది. విమానాశ్రయంలో 'లో విజిబిలిటీ ప్రొసీజర్స్' అమలులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నప్పటికీ, దృశ్యమానత తగ్గితే మరిన్ని విమానాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.ఉత్తరాది అంతా పొగమంచుతో ఇబ్బంది పడుతుంటే పర్యాటక రాష్ట్రం గోవాలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. డిసెంబర్ 20న గోవా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడవాల్సిన 38 ఇండిగో విమానాలు ఎటువంటి ఆటంకం లేకుండా షెడ్యూల్ ప్రకారం నడుస్తుండటం ప్రయాణికులకు కొంత ఊరటనిస్తోంది.

# మా భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయండి



### బోమ్మారాసిపేట బాధిత రైతులు

**శామీర్ పేట, డిసెంబర్ 20 (జనంసాక్షి):** మా భూమిని కొంత మంది దుండగులు లాక్కోవాలని గతకొంతకాలంగా కుట్రపన్ని తప్పుడు కేసులు పెట్టి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని మమ్మల్ని రక్షించి మాకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ బొమ్మరాసిపేట రైతులు శనివారం శామీర్ పేట ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ పెట్టి విలేకరుల ద్వారా సీఎం రేవంత్ రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, పోలీసులను కోరారు. శామీర్ పేట మండలం బొమ్మరాసిపెటకు చెందిన చాకలి కులానికి చెందిన వీరన్నగారి వెంకయ్య, నర్సింహా ల వారసులు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ... మూడు తరాలుగా శామీర్ పేట మండలం బొమ్మ రాసిపేట గ్రామంలోని సర్వే నెంబర్ 432లో మొత్తం 10ఎకరాల 27గుంటల భూమి ఉందని దాన్ని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని. అయితే దీనిలో కొంత భాగం 5ఎకరాల4గుంటల భూమిలో 80ఏండ్ల నుంచి కబ్జాలో ఉండి సాగు చేస్తున్నామని మాతోపాటు కబ్జాదారైనా నక్క ఎల్లయ్య నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. లియోనియా రిసార్ట్ ఉన్నట్టుగా తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి వీరన్నగారి వెంకయ్య, నర్సింహా వారసులమైన మా పేర్లను తొలగించి లియోనియా చక్రవర్తి రాజు పేరు నమోదు చేసుకున్నారని బాధితులు ఆరోపించారు. 2011సంవత్సరంలో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీ లించగా మా పేర్లు తొలగించి చక్రవర్తి రాజు పేరు నమోదు చేసి ఉందని ఆయన పేరు ఎలా నమోదు చేశారని సంబంధిత అధికారులను అడిగితే దరఖాస్తు పెట్టమంటే పెట్టమని అంటే అప్పట్లో రెవెన్యూ సదస్సులో అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్ కు మా పేర్లు నమోదు చేయ్యాలని దరఖాస్తు పెట్టుకున్నామని వి ఆర్ ఓ మొఖ మీదకు వచ్చి పంచనామా నిర్వహించిండని చుట్టుపక్కల రైతు లను పంచులు, సాక్షులు చేసి ఆ భూమి వీరన్న గారి వారసులే కాస్తు చేస్తున్నారని రాసుకున్నారని తెలిపారు. అయితే చక్రవర్తి రాజు తహసీల్దార్ ను మ్యానేజ్ చేసి ఆ ధాబా హెటల్ ఉన్నట్టు తప్పుడు రిపోర్ట్ ఇప్పించాడని పేర్కొన్నారు. దింతో మేము కలెక్టర్ ను సంప్రదిస్తే 432సర్వే నెంబర్లో వీరన్నగారి కృష్ణమూర్తి వాళ్లే ఉన్నారా లేదా రిపోర్ట్ ఇవ్వాలని తహసీల్దార్ కి ఆదేశాలిచ్చారని ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ ఇవ్వలేదు. చక్రవర్తి రాజు బినామీ వెంకట రామరాజు పేరుమీద కబ్జా కాలం లో పేరు నమోదు చేయించి 2014లో వీరన్నగారి వారసుల మైన మాకు కోర్టు సామాన్లు జారీ చేశారని దానికి బదులిచ్చామని 2015లో మేము ఓ పత్రికలో స్టేట్మెంట్ ఇచ్చామని అది చూసిన వెంకటపతి రామరాజు వ్యవస్థలను మ్యానేజ్ చేసి పోలీస్ ప్రొటక్షన్ తీసికుని వచ్చి మమ్మల్ని దుర్భాషా లాడుతూ భయభ్రాంతులకు గురిచేసి ఇష్టమొచ్చి నట్లు ఇది నాది అని చెప్పిండని వివరించారు. మేము 2017లో హైకోర్టు కు వెళ్లి స్టే తెచ్చుకున్నా మని 2025 డిసెంబర్ 20అయినా స్టే కొనసాగు తుందని అయితే ఈ నెల 5న హద్దుబందులు వాళ్లే చెడగొట్టి మేము చెడగొట్టామని పోలీస్ స్టేషన్ కి వెళ్లి పిర్యాదు చేశారని పోలీస్ స్టేషన్ నుంచి రావాలని ఫోన్ చేశారని మరుసటి రోజు వెళ్లామని ఎందుకు హద్దులు ఎందుకు చేరిపేసారని సి ఐ అడిగితె అది మా భూమి అని దానిమీద స్టేటస్కో ఉందని తెలిపామని అప్పుడు మీరెందుకు వెళ్లారని వెంకట రామరాజు ను అడిగిండని మమ్మలిని పి ఎస్ నుంచి పంపించేశారని తెలిపారు. మరల ఈ నెల 19న మధ్యాహ్నం మొలుగుపాటి వెంకట రామరాజు రాయి కడీలు దంపు చేయించి సుమారు 15మంది కడీలు పాతడానికి వచ్చారని వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్లి స్టేటస్కో ఉన్న భూమిలో కోర్టు స్టేటస్కోను గౌర వించకుండా ఎలా కడీలు వేస్తారని పిర్యాదు చేశామని పిర్యాదు ఏమి అవసరం లేదని నేను పరిశీలిస్తానని సీఐ తెలిపాడని తెలిపారు. కడీలు వేయడానికి ప్రయత్నించడమేగాక రాత్రికి రాత్రే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని అక్రమార్కులపై చర్యలు తీసుకుని మా భూమిని మాకు ఇప్పించా లని కలెక్టర్ ను, సీఎం రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వజ్రెష్ యాదవ్ ను, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో వీరన్నగారి వెంకయ్య, నరసింహాల వారసులు కృష్ణమూర్తి, సురేందర్, దేవేందర్, రాములు, లక్ష్మయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, విజయ భాస్కర్, సహాదేవ్, తులసిదాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# "మీ డబ్బు - మీ హక్కు"ను సద్వినియోగం చేసుకోవాలి



### నిజామాబాద్ అదనపు కలెక్టర్ అంకిత్

**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** వివిధ కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరకమైన ఆస్తుల కోసం ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ అందుబాటులోకి తెచ్చిన ' మీ డబ్బు - మీ హక్కు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన "మీ డబ్బు -మీ హక్కు" శిబిరంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం గత నవంబర్ నెల 1వ తేదీ నుండి ప్రస్తుత డిసెంబర్ 31వ తేదీ వరకు "మీ డబ్బు - మీ హక్కు" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగితున్నారని అన్నారు. ప్రజలు తమకు చెందవలసిన అన్ క్లెయిమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, బీమా రాబడులు మొదలైన ఆర్థికపరమైన ఆస్తులను తిరిగి క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించబడుతోందని తెలిపారు. అన్‌క్లెయిమ్ చేయని ఆర్థికపరమైన ఆస్తులపై హక్కు కలిగిన వారు ధృవీకరణ పత్రాలతో సంబంధిత బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించి తమ నిధులను తిరిగి క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్.బి.ఐ ఉద్గమ్ వెబ్ సైట్ (http://udgam.rbi.org.in) ద్వారా తెలుసుకుని సులభంగా పొందవచ్చని అన్నారు. ఈ శిబిరంలో ఆర్.బీ.ఐ ఎల్.డీ.ఓ ఎస్.రాములు, ఎస్.ఎల్.బీ.సీ మేనేజర్ ప్రకాష్, ఎస్.బీ.ఐ ఆర్.ఎం కే.మహేశ్వర్, ఎ.జీ.ఎం రవికిరణ్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నగేష్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 20(జనంసాక్షి):** జనవరి మాసంలో నిర్వహించే జాతీయ రహ దారి భద్రతా మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికా రులను ఆదేశించారు. జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలపై రవాణా, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, పోలీస్ విద్యాశాఖ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోడ్లు భవనాల శాఖ అధికారులు నోడల్ ఆఫీసర్లుగా ఉంటూ మాస ఉత్సవాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఆర్ అండ్ బి, పోలీస్ అధికారులు సమన్వయంతో నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్లను గుర్తించాలన్నారు. గత ఏడాది గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకున్న చర్యలు వివరించాలని తెలిపారు. పాఠశాలల్లో, కళాశాలలో రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల అవగాహన కోసం గత ఏడాది 2800 మంది విద్యార్థులు ట్రాఫిక్ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని తెలిపారు. ఆర్టీసీ, పాఠశాల బస్సులలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టీసీ ఆర్.ఎం రాజు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యాం ఘటనలపై చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల సరిహద్దుల గుండా ప్రవహిస్తున్న మానేరు నదిపై గత ప్రభుత్వ హయాంలో డి ఎం ఎఫ్ టి, ఇతర ప్రభుత్వ నిధుల ద్వారా నిర్మించిన చెక్ డ్యాంలు కూలిపోవడం, భాద్యులైన అధికారులు, ఇతరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు మంథని మండల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. చెక్ డ్యాంలు కూలిపోవడం పై అధికారులు, కాంట్రాక్టర్లు, పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడం, కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని రాజకీయ కోణంలో ప్రజా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రకటనలు ఇవ్వడం, సంబందిత ఇరిగేషన్ అధికారులు అపోహాలు సృష్టించే విధంగా ప్రకటనలు ఇవ్వడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతు న్నారని, కోట్లాధి రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ చెక్ డ్యాంలు అనతి కాలంలోనే కూలిపో వడంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వ్యక్తుల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులు పేర్కొన్నారు.

# కరీంనగర్ టౌన్ పోలీసుల ఘనత

- సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 60 మొబైల్ ఫోన్ల రికవరీ
- రికవరీ చేసిన ఫోన్ల విలువ సుమారు రూ. 10 లక్షలు
- బాధితులకు ఫోన్లు అందజేసిన కరీంనగర్ టౌన్ ఏసీపీ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 20(జనంసాక్షి):** సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, గల్లంతైన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో కరీంనగర్ టౌన్ డివిజన్ పోలీసులు విశేష విజయాన్ని సాధించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, టౌన్ ఏసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తున్న ప్రత్యేక బృందాలు సెంట్రల్ ఎగిప్మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ పోర్టల్ ద్వారా తాజాగా 60 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నాయని, వీటి అంచనా విలువ సుమారు రూ. 10 లక్షలు అవుతుందని టౌన్ ఏసీపీ తెలిపారు. కరీంనగర్ 1, 2,3 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు నిరంతరం నిఘా ఉంచి, టెక్నికల్ అనాలిసిస్ ద్వారా ఈ ఫోన్లను గుర్తించాయని తెలిపారు.

**బాధితులకు అప్పగింత**

రికవరీ చేసిన ఫోన్ల యజమానులను పిలిపించి, తగిన ఆధారాలను పరిశీలించిన అనంతరం వారికి మొబైల్ ఫోన్లను అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ టౌన్ ఏసీపీ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుతో పాటు స్వయంగా లేదా పోలీసుల సాయంతో www.ceir.gov.in పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేయాలన్నారు. దీనివల్ల ఫోన్ దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయడంతో పాటు, తిరిగి రికవరీ చేసే అవకాశం పెరుగుతుం దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఆస్తులను కాపాడటంలో కరీంనగర్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు





**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 20(జనంసాక్షి):** కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, సమగ్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ వేడుకలు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడ్డాయి. చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... విద్యా రంగంలో దూరదృష్టితో సంస్థను స్థాపించిన, వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి ఆశయాలు, విలువలు ఈ సందర్భంగా మరోసారి ప్రస్తావించబడ్డాయని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల విద్యతో పాటు నైపుణ్యాలు, విలువలు, వ్యక్తిత్వ వికాసం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ మాట్లాడుతూ.. పాఠశాల సాధించిన విద్యా, సహపాఠ్య విజయాలను వివరించి, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా చేస్తున్న ప్రయత్నాలను తెలిపారు. బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను జ్ఞానం, ఆత్మవిశ్వాసం, విలువలతో తీర్చిదిద్దుతూ, భవిష్యత్ నాయకులుగా తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు.

# ప్రజా ఉద్యమాలతో విప్లవ ఉద్యమాన్ని పురోగమిద్దాం

### రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జెవి చలపతి రావు



**బోధన్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో భారతదేశంలో వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ100 మీటర్ల రెడ్ ఫ్లాగ్ ర్యాలీని శనివారం గణంగా నిర్వహించారు. బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తా నుండి రాకాసిపేట్ మెహర్బా ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జేవి చలపతిరావు మాట్లాడుతూ, దేశంలో అనేక పోరాటాలు నిర్వహించి పేద ప్రజల సమస్యలను పరిష్కరించిందని ఈనాటికి పేదలకు ఒక పార్టీ ఉన్నదంటే అది ఎర్రజెండా పార్టీ అని పేర్కొన్నారు. దేశంలో భూ సమస్యపైన కుల సమస్యపై కార్మిక హక్కుల కోసం రైతాంగ సమస్యలపై పోరాడాలని వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వాన్ని ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య ఆర్ గౌతం కుమారులు ప్రసంగించారు అలాగే ఈ కార్యక్రమంలో న్యాయవాది పరుచూరి శ్రీధర్,జిల్లా కమిటీ , రమేష్,సభ్యులు నీలం సాయిబాబా, ప్రజా సంఘాల నాయకులు ఎల్ చిన్న పర్వయ్య, పిరోల్ల పోశెట్టి, ఆకుల అరుణ, భారతి, సాయి రెడ్డి, బాలయ్య, సూర్య విట్టల్ లతోపాటు 400 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్ల పరిశీలన

**నిర్మల్ బ్యూరో,డిసెంబర్20(జనంసాక్షి):** ఈ నెల 22 న జిల్లాలో నిర్వహించబోయే విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.జిఎన్ఆర్ కాలనీలో,ఎక్సర్సైజ్ నిర్వహించే ప్రదేశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి,అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

# ఎన్ఎండీసీకి 7 ప్రతిష్టాత్మక అవార్డులు


### పీఆర్ఎస్ఐ జాతీయ సదస్సు 2025



**హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి):** భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు, బాధ్యతాయుతమైన గనుల సంస్థ అయిన ఎన్ఎండీసీ, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నిర్వహించిన 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ 2025లో ఏడు ప్రతిష్టాత్మక ప్రశంసలను గెలుచుకుంది. "వృద్ధిని సాధికారపరచడం, మూలాలను కాపాడుకోవడం" అనే థీమ్‌పై మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశం ప్రజా సంబంధాలు, వ్యూహాత్మక కమ్యూనికేషన్‌లో అత్యుత్తమ ప్రతిభను జరుపుకుంది. నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికారత చొరవలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత, పరిశోధన, అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, కార్పొరేట్ కమ్యూనికేషన్‌లలో ఎన్ఎండీసీ విజయాలు గుర్తించబడ్డాయి. ఇది స్థిరమైన వృద్ధి, దేశ నిర్మాణానికి సంస్థ సమగ్ర విధానాన్ని ప్రతిబిం బిస్తుంది. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, ఉత్తరాఖండ్ అటవీ మంత్రి సుబోధ్ ఉనియల్, ఉత్తరాఖండ్ బయో టెక్నాలజీ మంత్రి గణేష్ జోషి, పార్లమెంటు సభ్యుడు నరేష్ బన్సాల్, స్వామి చిదానంద్ జీ సరస్వతి మహారాజ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ అవార్డులను ముఖ్య అతిథి పుష్కర్ సింగ్ ధామి, ఉత్తరాఖండ్ అటవీ మంత్రి సుబోధ్ ఉనియల్‌తో కలిసి ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రదానం చేశారు. ఇతర కార్యక్రమాలలో డాక్టర్ ప్రసాద్ గౌరీనేని, పరిశ్రమల ప్రముఖులను సత్కరించారు. ఎన్ఎండీసీకి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) సీహెచ్. శ్రీనివాసరావు సంస్థ తరపున గౌరవాలు అందుకున్నారు. ఎన్ఎండీసీకి పీఎస్ యూ, వార్షిక నివేదిక, హౌస్ జర్నల్ (హిందీ) ద్వారా ఉత్తమ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలకు అవార్డులు, మొదటి బహుమతులు, సైన్స్, టెక్నాలజీని ప్రోత్సహించడంలో ఉత్తమ ఆర్అండ్ డీ ప్రయత్నాలకు గుర్తింపు, మహిళా అభివృద్ధి కోసం ఉత్తమ సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌కు రెండవ బహుమతులు, సీఎస్ఆర్ ప్రాజెక్టులను అమలు చేయడంలో ఉత్తమ పీఎస్ యూ, వైద్య, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో అత్యుత్తమ చొరవలకు ప్రశంసలు, మూడవ బహుమతులు ప్రదానం చేయబడ్డాయి. బృందాన్ని అభినందిస్తూ, డైరెక్టర్ (పర్సనల్) జి. ప్రియదర్శిని మాట్లాడుతూ.. "పనితీరు ఉద్దేశ్యంతో మార్గనిర్దేశం చేయబడి, స్పష్టతతో సంభాషించబడినప్పుడు అర్థవంతమైన పురోగతి సాధించబడుతుందనే ఎన్ఎండీసీ నమ్మకాన్ని ఈ గుర్తింపులు పునరుద్ఘాటిస్తున్నాయి. మైనింగ్‌కు మించి కమ్యూనిటీలను శక్తివంతం చేయడం, నైపుణ్యాలను పెంపొందించడం, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, దేశ వృద్ధికి బాధ్యతాయుతంగా దోహదపడటం వరకు మా ప్రయాణం విస్తరించింది. ఈ అవార్డులు ఎన్ఎండీసీ కథను ప్రామాణికత, ప్రభావం మరియు గర్వంతో చెప్పడంలో, మా అన్ని వాటాదారులతో నమ్మకాన్ని బలోపేతం చేయడంలో మా బృందాల అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి" తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ, ఎన్ఎండిసి సమగ్ర కార్యక్రమాలను ముందుకు నడిపిస్తోంది. పిఆర్ఎస్ఐచే గుర్తింపు పొందిన అన్ని రంగాలలోనూ నిర్మాణాత్మక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా, ఎన్ఎండిసి భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ప్రతిభను నిర్మిస్తోంది. యువతలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది.

# మంథని మానేరుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- ఆరెంద మీదుగా దామెరకుంట వరకు హై లెవెల్ బ్రిడ్జి
- ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ నుండి బ్రిడ్జి వరకు అటు ? సైడు దామరకుంట రోడ్డు వరకు 9.530 మీటర్ల అప్రోచ్ రోడ్డు కమ్ రోడ్డు
- నిర్మాణం కొరకు తెలంగాణ ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ. 203 కోట్ల నిధులను మంజూరు
- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వెల్లడి






**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలములోని ఆరెంద మీదుగా దామెరకుంట వరకు 1.120 మీటర్ల పొడవు 13 మీటర్ల వెడల్పుతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి.. ఆరెంద, మల్లారం, వెంకటా పూర్ నుండి బ్రిడ్జి వరకు అటు సైడు దామేరకుంట రోడ్డు వరకు 9.530 మీటర్ల అప్రోచ్ రోడ్డుకు 203 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ నుంచి నిధులు మంజూరు కావడం జరిగిందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా, మంథని మండల ప్రజలు, ఇతర మండలాల ప్రజలు మానేరు బ్రిడ్జి దాటి ఇతర జిల్లాలకు, మహారాష్ట్రకు, కాళేశ్వరం దేవాలయానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకి, ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి వీలుగా బ్రిడ్జి నిర్మాణం చేయాలని సంకల్పించి వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆరెంద మీదుగా దామెరకుంట వరకు ఆర్ అండ్ బి శాఖ నుండి 203 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన మంథని, పెద్దపల్లి జిల్లా వారికి కాళేశ్వరం వెళ్ళడానికి 25 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుందని, కాళేశ్వరం టూరిజం డెవలప్మెంట్ కూడా పెరుగుతుందని, మహారాష్ట్ర ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి చాలా వీలు ఉంటుందని, జయశంకర్ భూపాలపల్లి కాటారం వెళ్లడానికి వీలు ఉంటుందని,ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామేరకుంట ఈ గ్రామాలలో ప్రజలకు రవాణా పరంగా మరియు వైద్య, విద్య పరంగా చాలా ఉపయోగపడుతుంది, పెద్దపల్లి మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కనెక్టివిటీ పెరుగుతుం ది. మానేరు పై బ్రిడ్జి అరెంద మీదుగా దామెరకుంట నిర్మాణానికి 203 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి పెద్దపల్లి జిల్లా ప్రజలు, మంథని మండల ప్రజలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలు,అరెంద, మల్లారం, వెంకటాపూర్, దామరకుంట గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# క్రీడాకారులు ప్రపంచ స్థాయికి ఎదగాలి

### ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి



**శామీర్ పేట్, డిసెంబర్ 20 (జనంసాక్షి):** ప్రభుత్వ సదుపాయాలతో తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ స్థాయికి ఎదగాలని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అందిస్తున్న ఆధునిక సదుపాయాలను క్రీడాకారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసు కొని జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ,మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ లు పేర్కొన్నారు.శనివారం జగన్‌గూడ మైనారిటీ గురుకుల పాఠశాలలో తెలంగాణ మైనారిటీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల (వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్) అండర్-14, అండర్-17, అండర్-19 క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి వారితో కలిసి హాజరైనారు. వికారాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన ఖోఖో పోటీలను టాస్ వేసి అధికారికంగా ప్రారంభిం చారు. ఈ పోటీలలో మూడు జిల్లాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు,100 మంది వ్యాయామ ఉపా ధ్యాయులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణ తెలిపారు. విజేత లైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయం మరొక విజయానికి నాంది కావాలని, ఓటమితో కుంగిపోకుండా మరింత కష్టపడి ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.ప్రతి వ్యక్తిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి దాన్ని సద్వినియోగం చేసుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చని తెలిపారు.కబడ్డీ,క్రికెట్ వంటి క్రీడల్లో భారత ఆటగాళ్లు ప్రపంచాన్ని శాసిస్తు న్నారని,అదే విధంగా తెలంగాణ క్రీడాకారులకు కూడా ఉజ్వల భవిష్యత్తు ఉందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు .క్రీడాకారులను తీర్చిదిద్దే వ్యాయామ ఉపాధ్యాయులకు అవసరమైన ప్రోత్సా హం, శిక్షణను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ కాంతమ్మ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్,కీసర ఆర్డీవో వెంకట్ ఉపేందర్ రెడ్డి,ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిడిపల్లి వేణుగోపాల్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్, సాయిపేట శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "ఉపాధి" పరిరక్షణ కోసం కేంద్రాన్ని నిలదీద్దాం

- ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయండి
- మంత్రి సీతక్క పిలుపు



**హైదరాబాద్ డిసెంబర్ 20 (జనంసాక్షి):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ ఆదివారం నాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, కర్షకులు, కూలీలు, సర్పంచులు, ప్రజాస్వామ్యవాదులు ప్రగతిశీల శక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో ఆమె పిలుపునిచ్చారు. పల్లెల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి కనీసం వందరోజుల పాటు ఉపాధి కల్పించేందుకు 20 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉరి వేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. లోక్సభలో పూర్తిస్థాయి చేర్చలేకుండా, హడావుడిగా బిల్లును పాస్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, మహిళలు ఉపాధి పొందుతున్నారని.. వారి ఉపాధిని దెబ్బతీసేందుకు కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఉపాధి కూలీల్లో 60 శాతం మహిళలు, తెలంగాణలో ఉపాధి హామీ లబ్ధిదారుల్లో 62 శాతం మహిళలే ఉన్నారని, అలాగే 20 శాతం ఎస్సీలు, 20 శాతం ఎస్టీలు లబ్ధిదారులుగా ఉన్నారని, కేంద్ర వైఖరి కారణంగా వారంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తిందని వెల్లడించారు. ఉపాధి హామీ చట్టం కేవలం ఉపాధి హామీ కల్పనకే పరిమితం కాలేదని, మహిళలు అట్టడుగు వర్గాల ఆర్థిక స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని తెలి పారు. జాతిపిత మహాత్మాగాంధీ కలగన్న రామ రాజ్యం, గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది పనిదినాలను తగ్గిస్తూ పేదల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 45 కోట్ల పనిదినాలకు కోత, తెలంగాణలో 5 కోట్ల పనిదినాలకు కోత పెట్టారని తెలిపారు. జి రామ్ జి చట్టం ద్వారా 125 రోజులు పని కల్పిస్తామని పైకి చెప్పినా, బీజేపీ పాలనలో ఏ ఏడాదీ 50 రోజులకు మించి పని ఇవ్వలేదని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకి నివేదించిందని అన్నారు. గాంధీ వర్సెస్ రాముడు అన్నట్లుగా చర్చను చిత్రీకరించి దొడ్డి దారిన ఉపాధి చట్టం ఉసురుతీ స్తున్నారని మండి పడ్డారు. మునుపు ఉపాధి హామీ పనులకు కేంద్రం 100 శాతం నిధులు ఇస్తే, ఇప్పుడు తన బాధ్యత నుంచి తప్పుకుని 60 శాతం మాత్రమే ఇచ్చి 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపు తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ పేరును తొలగించి 'జీ రాం జీ' పేరుతో ఉపాధి హామీకి రామ్ రామ్ చెబుతోందని విమర్శించారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని, కూలీల ఉపాధి హక్కును కాపాడుకునేందుకు కలసి కట్టుగా పోరాడుతామని, రాజకీ యాలకు అతీతంగా అందరూ ఉపాధి హామీ పరిరక్షణ పోరాటంలో పాలుపంచుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# చెర్లపల్లిలో పరిశ్రమల విపత్తులపై మాక్ డ్రిల్

### డిసెంబర్ 22న ఐఓసీఎల్ స్మార్ట్ టెర్మినల్‌లో నిర్వహణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 (జనంసాక్షి):** జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల నివారణపై ఈ నెల 22వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ మాక్ డ్రిల్‌ను సికింద్రాబాద్ పరిధిలోని చెర్లపల్లి మహాలక్ష్మి నగర్‌లో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) చెర్లపల్లి స్మార్ట్ టెర్మినల్ (హైదరాబాద్ టెర్మినల్), సర్వే నెం.183, ఫేజ్‌లో నిర్వహించ నున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల్లో సంభవించే అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అధికారులు, సిబ్బంది ఎలా స్పందించాలి, ప్రాణనష్టం తగ్గించేందుకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రయోగాత్మక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.మాక్ డ్రిల్‌ను పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. ఇలాంటి మాక్ డ్రిల్‌ల ద్వారా విపత్తుల సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో పోలీస్, రవాణా, ఆర్టీసీ, వైద్య, విద్యా, సంక్షేమ శాఖలు, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన రహదారి భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రహదారి ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి, ప్రమాదాలకు కారణాలు గుర్తించి వాటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని, వేగ నియంత్రణ, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగాన్ని కఠినంగా అమలు చేయాలని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రహదారి భద్రతా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సూచించారు.పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్టీఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, జాతీయ రహదారుల డీఈ కిరణ్, ఐఆర్డీ డిఆర్ఎం లక్ష్మణ్, ఆయా శాఖల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలి

### శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి పిలుపు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ప్రభుత్వం పేదలు, మహిళలు, మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మేడ్చల్ జిల్లాలో పర్యటించిన ఆయన, ఘట్‌కేసర్ మండలంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 350 మంది లబ్ధి దారులకు రూ.4 కోట్ల 6 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలో 46 మంది, మేడిపల్లి మండలంలో 110 మంది, కీసర మండలంలో 60 మంది, కాప్రా మండలంలో 16 మంది, మూడు చింతలపల్లి మండలంలో 32 మంది, మేడ్చల్ మండలంలో 86 మంది లబ్ధిదారులకు ఈ పథకాల కింద ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని 50 చర్చిలకు రూ.30 వేల చొప్పున మొత్తం రూ.15 లక్షల నిధులను కూడా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణా లను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



**భైంసా డిసెంబర్ 20 (జనం సాక్షి) :** భైంసా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య, వాటర్ సప్లై, ఎలక్ట్రిసిటి కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గత రెండు రోజులుగా ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరే మున్సిపాల్టీల్లో కార్మికులకు జీతాలు ఎక్కువ ఉన్నాయని, ఇక్కడ తక్కువ ఇస్తున్నారంటూ ఆందోళన చెందుతున్నారు, ఆందోళనలు చేస్తే విధుల నుంచి తొలగిస్తామని అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.వీరికి మద్దతుగా జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు హాజరై మాట్లాడుతూ .. గత కొన్ని సంవత్సరాలుగ వివిధ విభాగల్లో కాయ కష్టం చేస్తున్న అభాగ్య జీవుల పరిస్థితి చాలా ఘోరంగా తయారైంది.వీరికి కనీస వేతనం జిఓ ప్రకారం చెల్లించకుండా కేవలం పది వేలు మాత్రమే జీతం ఇస్తూ చేతు లు దులుపుకుంటున్నారు.మిగితా జిల్లా లోని మున్సిపాలిటీలో ఇస్తున్న దాని ప్రకారం కూడ వేతనం ఇవ్వడం లేదు. దీనికి తోడు పిఎఫ్ పేరిట కొన్ని సంవత్సరాలనుండి అస్సలు డబ్బులు జమ కావడం లేదు. కనీసం మెసేజ్ లు కూడ రాకపోవడం చాలా విడ్డురం. ఇందులో ఏదో అవినీతి జరుగుతుందని వాపోయారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి సబ్ కలెక్టర్, స్పందించి వారిపై చట్ట రీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జి ఓ ప్రకారం వేతనాలు 5వ తేదీ లోపు సరైన సమయానికి చెల్లించి పిఎఫ్ డబ్బులు క్లియర్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం. లేని యెడల కార్మికుల పక్షాన అండగా నిలబడి భవిష్యత్ లో జరిగే పోరాటానికి పూర్తిస్థాయి మద్దతూ తెలియచేస్తామ ని హెచ్చరిస్తున్నాం. దీనికి పూర్తి భాద్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఆరిఫ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ స్టీల్ 2026కు

### ప్రపంచానికి ఆహ్వానం

- కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి
- ప్రపంచ ఉక్కు భాగస్వామ్యాలను నిర్మించడానికి రాయబారులతో సమావేశం




**న్యూఢిల్లీ (జనంసాక్షి):** హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలోని రాయబారుల సమావేశంలో భారతదేశ ఉక్కు దార్శనికత ప్రపంచ రూపాన్ని సంతరించుకుంది కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి కీలక భాగస్వామ్య దేశాల రాయబారులు, ప్రతినిధులతో ఒక ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించి, ఏప్రిల్ 2026లో జరగనున్న ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సు-కమ్-ప్రదర్శన అయిన భారత్ స్టీల్ 2026లో చురుకుగా పాల్గొనాలని వారిని ఆహ్వానించారు. ఈ ఇంటరాక్టివ్ సమావేశంలో ప్రపంచ ఉక్కు విలువ గొలుసులో ముఖ్యమైన పాత్ర పోషించే దేశాల రాయబారులు, దౌత్య ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి, ప్రపంచ ఉక్కు ఉత్పత్తి మరియు వినియోగ దేశాలతో భారతదేశ సంబంధాలను బలోపేతం చేయడానికి మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రయత్నాలలో ఈ సమావేశం ఒక భాగం. సమావేశంలో ప్రసంగిస్తూ.. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి రాయబారులకు సాదర స్వాగతం పలికి, వారి ఉనికికి ధన్యవాదాలు తెలిపారు. వారి భాగస్వామ్యం విశ్వసనీయ అంతర్జాతీయ భాగస్వామ్యాలకు భారతదేశం ఇచ్చే ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ ఉక్కు రంగం నేడు దేశం విస్తృత ఆర్థిక పరివర్తనను ప్రతిబింబిస్తోందని, వృద్ధి, స్థితిస్థాపకత, ప్రపంచ ఏకీకరణకు ఒక స్తంభంగా ఆవిర్భవించిందని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఉక్కు ఉత్పత్తి దేశమని మంత్రి హైలైట్ చేశారు.

## రాష్ట్రపతి పర్యటన, మాక్‌డ్రిల్ ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 (జనంసాక్షి):** రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకొని తిరిగి ఢిల్లీకి ప్రయా ణం అవుతున్న సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు, అలాగే విపత్తుల సమయంలో నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహణ పనుల్లో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున సోమవారం (డిసెంబర్22,2025) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకట నలో తెలిపారు. ఈ నిర్ణయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, తదుపరి ప్రజావాణి తేదీని ముందుగా తెలియజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# జనవరిలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం

### ప్రమాదాల నివారణే లక్ష్యం : మంత్రి పొన్నం ప్రభాకర్



**మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) డిసెంబర్ 20 :** రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి, మరణాల రేటును నియంత్రి ంచడమే లక్ష్యంగా జనవరి మాసంలో నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల అమలుపై సచివాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తితో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.గత ఏడాది తెలంగాణలో 25,934 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 7,949 మంది మృతి చెందినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యం, నిబంధ నల ఉల్లంఘనలే ప్రధాన కారణాలని పేర్కొంటూ, వీటిని నివారించేందుకు రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాలు ఈ నెలాఖరులోపు నిర్వహించాలని ఆదేశించారు. రవాణా శాఖ, ఆర్టీసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యా శాఖ, ఇతర సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రతి జిల్లాలో రోడ్డు భద్రత వాలంటీర్ల బృందాలు ఏర్పాటు చేసి గ్రామాలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవగాహన పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూనిసెఫ్ సహకారంతో విద్యార్థులకు రోడ్డు భద్రతపై పాఠ్యాంశాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనాలు నడపడంపై కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారులపై అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లను తొలగించాలని మంత్రి ఆదేశించారు. గోల్డెన్ అవర్‌లో ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారిని ప్రోత్సహించేందుకు 'రహవీర్ గుడ్ సమారిటన్' పథకం త్వరలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లా నుంచి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక అసమానతల నిర్మూలనకు విద్యే ప్రధాన ఆయుధం

- నైపుణ్యం-విలువలతో కూడిన విద్యే దీర్ఘకాల అభివృద్ధికి పునాది
- లయోలా విద్యాసంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** సమాజంలో పాతుకుపోయిన అసమానతలను రూపుమాపడంలో విద్య ఒక్కటే ప్రధాన ఆయుధమని, నైపుణ్యంతో పాటు మానవ విలువలు కలిగిన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మేడ్చల్ జిల్లా అల్వాల్‌లో లయోలా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు శనివారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యను కేంద్రంగా చేసుకుని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తోందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, రాష్ట్రంలోని 100 ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుస్తున్నామని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాక రాష్ట్ర జీడీపీ వృద్ధికి కూడా దోహదం చేస్తాయని చెప్పారు. సామాజిక అసమానతల నిర్మూలన లక్ష్యంగా అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాభ్యాసం చేయడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాల కోసం 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో అత్యాధునిక వసతులు కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక-ఆర్థిక-విద్యా సర్వే ద్వారా సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని స్పష్టమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. దీర్ఘకాల అభివృద్ధి, నాయకత్వానికి లోతైన మానవ మూలధనమే పునాదిగా ఉంటుందని, ప్రపంచ దేశాల అనుభవాలు ఇదే విషయాన్ని నిరూపిస్తున్నాయని చెప్పారు. లయోలా అకాడమీ యాభై సంవత్సరాల ప్రయాణం కేవలం మౌలిక వసతులకే పరిమితం కాకుండా మానవ మేధస్సు నిర్మాణానికి అంకితమైం దని ప్రశంసించారు. యాభై ఏళ్లు పూర్తైనా మరింత ముం దుకు సాగాలనే ఉత్సాహంతో ఉన్న సంస్థగా లయోలా నిలుస్తోందని అన్నారు. ఇటీవల తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. మూలధనం, ఆవిష్కరణలు ఉత్పాదకతకు దోహదపడ తాయని, అయితే వాటికి ఆధారంగా మానవ మూలధనమే అసలైన పునాది అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తులో మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలని, విద్యను కేవలం ఉపాధి కోసం కాకుండా సమాజానికి సేవ చేయడానికి వినియోగిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మైనంపల్లి హనుమంతరావు ప్రముఖులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 డిసెంబర్ 2025

# నల్లగొండలో సమన్వయ లోపం!

- ఎమ్మెల్యేలు సరిగా పనిచేయలేదా?
- రాజగోపాల్ రెడ్డి తీరుపై మరోమారు చర్చ



**నల్లగొండ, డిసెంబర్20 (జనంసాక్షి) :** పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బాగా దెబ్బతిన్న జిల్లాల్లో నల్లగొండ కూడా ఉంది. ఇక్కడి ఎమ్మెల్యేల్లో అనైక్యత ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎవరికి వారే అన్న చందంగా సాగడంతో ఈ జిల్లాల్లో అనేక గ్రామాలను కాంగ్రెస్ కోల్పోయింది. ఇద్దరు మంత్రులు ఉన్నా పట్టుదలగా పనిచేసినట్లుగా కనిపించలేదు. ఇదే విషయమై పిసిసి భేటీలో చర్చించారు. రెబల్‌గా ఉంటున్న రాజగోపాల్ రెడ్డి కూడా సరిగా పనిచేయలేకపోయారు. ఆయన మంత్రిపదవిపై ఆశపెట్టుకుని రాకపోయేసరికి సైలెంట్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొరకరాని కొయ్యగా మారారని పార్టీలో ప్రచారం ఉంది. మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించినా తీసుకోలేదని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. ఆయనకు మనం మంత్రి పదవి హామీ ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు పార్టీ గెలుపునకు సహకరించారు' అని రాహుల్ గుర్తుచేసినట్టు సమాచారం. సామాజిక సమీకరణాలను సమీక్షించి, వీలైనంత త్వరలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ సూచించినట్టు తెలిసింది. రెండో పర్యాయం జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్తు ఖాయమని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భావించారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి సంకేతాలు అందటంతో ఆయన సన్నిహితులు ప్లెక్సీలు, దండలు, బ్యాండ్‌బాజాలు సిద్ధం చేసుకున్నారు. కానీ అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అడ్డు తగులుతూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ లేఖ రాయించారని రాజగోపాల్‌రెడ్డి అనేక సందర్భాల్లో తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పదునైన విమర్శలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పెద్దగా పనిచేయలేదన్న ప్రచారం కూడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి నిరంతరం విమర్శనాస్త్రాలు సంధిస్తున్న నేపథ్యంలో సీఎం సన్నిహితవర్గం రంగంలోకి దిగింది. రాజగోపాల్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాజగోపాల్‌రెడ్డి సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిన ఆడియోలు, వీడియో క్లిప్పింగులు, పత్రికా వార్తలను సేకరించి ఏఐసీసీకి పంపినట్టు సమాచారం. తమకు అనుకూలంగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ద్వారా రాజగోపాల్‌రెడ్డి మీద క్రమశిక్షణ చర్యలకు ఒత్తిడి చేయించినట్టు తెలిసింది. మంత్రిపదవి విషయంలో ఇప్పటికే వారి కుటుంబం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారని, ఉమ్మడి నల్లగొండలో ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలే క్యాబినెట్‌లో ఉన్నారని కేసీ వివరించినట్టు సమాచారం. సామాజికవర్గాలను సమీక్షించి రాజగోపాల్‌రెడ్డిని సర్దుబాటు చేయాలని, తెలంగాణ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించినట్టు తెలిసింది. దీంతో ఈ విషయంలో ఇంకా ఎటూ తేల్చలేకపోతున్నారని సమాచారం.



## మాకు బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరంలేదు

- కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి) :** పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్లు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్‌లోకి రావాలని కోరుతున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసేది ఏం ఉండదన్నారు. గ్రామంలోని ప్రతి అభివృద్ధికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు. బీజేపీలో గెలిచిన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల మీద అవగాహన ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## రెండేళ్ల తరవాత వచ్చేది మేమే

- అప్పుడు మిమ్ములను డ్యాన్స్ ఆడిస్తాం
- కాంగ్రెస్‌పై మాజీమంత్రి తలసాని వ్యాఖ్యలు

**హైదరాబాద్, డిసెంబర్20 (జనంసాక్షి) :** కాంగ్రెస్‌లో చేరినా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకునే ఆ పది మంది ఎమ్మెల్యేల జీవితం 'సిగ్గులేని సంసారం'అంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శలు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్పీకర్ విచిత్రమైన తీర్పు ఇచ్చారని, ఆ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉంటే తమతోపాటు వచ్చి కూర్చోవాలని సవాల్ విసిరారు. 'చేర్చుకున్న వాళ్లు మా వాళ్లు కాదు' అని కాంగ్రెస్ చెబుతోందని ఎగతాళి చేశారు. కేసీఆర్.. తెలంగాణ సాధన వల్లే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, లేకపోతే వారికి పదవులే లేవని తలసాని చెప్పారు. 'ఇంకా రెండేళ్లే... తర్వాత మనమే వస్తాం. ఎలా డ్యాన్స్ ఆడిస్తామో అలా ఆడిస్తాం' అని తలసాని హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీఎం రేవంత్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీతో కాంగ్రెస్ మోసం చేసిందని, సంక్షేమ నిధులు ఎమ్మెల్యేల ఇళ్ల నుంచి వస్తున్నాయా అని ప్రశ్నించారు. సచివాలయం, ప్రజాభవన్ బాగాలేవని కాంగ్రెస్ అంటోంది.. మరి.. రోజూ అక్కడే ఎందుకు కూర్చొంటారని తలసాని ఎద్దేవా చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఇలాంటి దరిద్రమైన ప్రభుత్వం చూడలేదని తలసాని అన్నారు. రాష్ట్రంలో 25 ఏళ్ల వరకు కాంగ్రెస్ అనే మాటే రాదని తలసాని జోస్యం చెప్పారు.

## బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

- అందుకే అవినీతి కేసుల్లో విచారణలు పక్కదారి
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, డిసెంబర్20 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన.. అవినీతి మయంగా, దరిద్రంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. తల నరికినా.. పైసా లేదని సీఎం రేవంత్ అంటున్నారని.. అందువల్లే ఇక్కడి ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లాగే డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈసారి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. తెలంగాణలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేళ్ల నుంచి అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ కలిసి పోటీ చేయలేదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ బరిలో దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపుతానన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమైయ్యానని నిలదీసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను జైలుకు పంపారా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో జైలుకు పంపారా? డ్రగ్స్ కేసులో జైలుకు పంపారా? ఫాం హౌస్ కేసులో జైలుకు పంపారా? కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులు కాబట్టే కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరినీ జైలుకు పంపలేదని ఇరు పార్టీలపై బండి సంజయ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓడిన తర్వాత కేసీఆర్ ఎక్కడా కనబడలేదని.. అయితే ఫామ్ హౌజ్ లేదా యశోదా ఆసుపత్రిలో మాత్రమే కనిపిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఫామ్ హౌజ్ పాలను తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదన్న ఆయన.. పంచాయితీ ఎన్నికల్లో తమ పార్టీకి గతంలో 100 సీట్లు వస్తే.. ఇప్పుడు 600కు పైగా స్థానాలొచ్చాయన్నారు. లీకు వీరులు అన్ని పార్టీలోనూ ఉన్నారని ఈ సందర్భంగా కౌంటర్ వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పాలన అద్భుతంగా సాగుతోందని బండి సంజయ్ కొనియాడారు. 'ఏపిలో కూటమి పాలనకు వందకు వంద మార్కులు పడతాయి. ఈ విషయంలో అనుమానాలున్నవారు మూర్ఖులు. అలాంటివారు ఆసుపత్రికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకోవాలి. ఏపిలో అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది' అని కూటమి పాలనపై ప్రశంసలు కురిపించారు.

## కాసిపేట శివారులో పెద్దపులి సంచారం

- అప్రమత్తంగా ఉండాలంటూ దండోరా



**మంచిర్యాల, డిసెంబర్20 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కాసిపేట, బెల్లంపల్లి మండలాల శివారులో పెద్దపులి సంచారం అలజడి సృష్టిస్తుంది. బుగ్గ దేవాలయం సమీపంలో పెద్దపులిని ప్రత్యక్షంగా చూసిన పలువురు.. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ సిబ్బంది బుగ్గ శివాలయ ప్రాంతాల్లో పరిశీలిస్తున్నారు. కాసిపేట మండలంలోని తిరుమలాపూర్ మీదుగా బుగ్గగూడెం ప్రాంతానికి వచ్చిన పెద్దపులి.. అక్కడ సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో బుగ్గగూడ శివారులో పెద్దపులి ఓ బర్రెను హతమార్చిన విషయం తెలిసిందే. కాసిపేట, తిర్యాణి మధ్య విస్తరించి ఉన్న అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి మళ్ళీ జనావాసాలకు దగ్గరగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుగ్గ దేవాలయం వెనుక వైపు పెద్దపులి సంచరించగా, వాటి ఆధారంగా అది మాదారం వైపు వెళ్లినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు శివారు గ్రామాల్లో, బుగ్గగూడెం గ్రామ పంచాయతీలో పెద్దపులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని డప్పు చాటింపు వేయించారు. అడవిలోకి వెళ్లొద్దని, పశువులను తీసుకుపోవద్దని, జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు.

## పొగమంచు..ప్రతికూల వాతావరణం

- మోడీ హెలికాప్టర్ వెనక్కి మళ్లింపు

**కోల్‌కతా, డిసెంబర్20 (జనంసాక్షి) :** పశ్చిమ్ బెంగాల్‌లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణం గా ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అధికారులు దారి మళ్లించారు . షెడ్యూల్ ప్రకారం, మోదీ శనివారం ఉదయం 10:30 గంటలకు నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానా శ్రయంలో దిగి, 11:15 గంటలకు హెలికాప్టర్ ద్వారా తాహెర్‌పుర్‌కు చేరుకోవాల్సి ఉండగా.. పొగ మంచు, అననుకూల వాతావరణం ఆటంకం కలిగించాయి. ఫలితంగా ఆయన అదే హెలికాప్టర్‌లో కోల్‌కతాకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకూ మోదీ అక్కడే వేచి చూశారని అధికారులు తెలిపారు. దీంతో ఆయన పర్యటన ఆలస్యమైనట్టు పేర్కొన్నారు. నాదియా జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొని.. రూ.3,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. దీంతో పాటు ఎన్‌హెచ్-34లోని బరజగులి-కృష్ణానగర్ సెక్షన్‌లో 66.7 కి.మీ నాలుగు లేన్ల విస్తరణ, ఉత్తర 24 పరగణాల జిల్లాలో అదే రహదారిలోని 17.6 కి.మీ. బరసత్-బరజగులి సెక్షన్‌లో నాలుగు లేన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌లు కోల్‌కతా, సిలిగురి మధ్య కీలక అనుసంధాన లింకులుగా పనిచేయనున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లలేకపోయారు. ప్రత్నామ్నా యంగా రోడ్డు మార్గాన వెళ్లాలను కున్నా.. ఇతర షెడ్యూళ్లకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. దీంతో.. విమానా శ్రయంలోనోని వీఐపీ లాంచ్ నుంచే వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు మోదీ. ఈ పర్యటన ముగిశాక రెండు రోజుల పాటు అస్సామ్‌కు వెళ్లనున్నారు.

## బిజెపిలో చేరిన నటి ఆమని

- మోడీ నాయకత్వంపై విశ్వాసంతో చేరినట్లు వెల్లడి




**హైదరాబాద్, డిసెంబర్ 20 (జనంసాక్షి) :** టాలీవుడ్ సీనియర్ నటి ఆమని రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. శనివారం ఆమె అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ఆమని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాంచందర్ రావు ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమనీతో పాటు ప్రముఖ సినీ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా ఇదే వేదికపై కాషాయ గూటికి చేరారు. పార్టీలో చేరిన తర్వాత ఆమని మీడియాతో మాట్లాడుతూ.. తన మనసులోని మాటను పంచుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. భారతీయురాలిగా గర్వపడేలా చేసిన ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నాను అని ఆమని తెలిపారు. మోదీ ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె పేర్కొన్నారు. పదవుల కోసం కాకుండా, కేవలం సామాన్య ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. 1992లో 'జంబలకిడిపంబ' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఆమని, ఆ తర్వాత తెలుగు చిత్రసీమలో అగ్ర నటిగా ఎదిగారు. 'శుభలగ్నం', 'మావిచిగురు', 'శుభ సంకల్పం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ నటి 'మిస్టర్ పెళ్లాం' చిత్రంలో ఆమె నటనకు గాను ప్రతిష్టాత్మక నంది అవార్డు లభించింది.

## గౌహతి విమానాశ్రయంలో కొత్త టర్మినల్

**గౌహతి, డిసెంబర్20 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం గౌహతిలోని 'లోకప్రియ గోపీనాథ్ బార్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం' కొత్త ఇంటిగ్రెటెడ్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ టెర్మినల్ 'బాంబు ఆర్కిడ్స్' అనే కాన్సెప్ట్ తో రూపొందించారు. అంతేకాదు భారతదేశపు మొట్టమొదటి ప్రకృతి నేపథ్య విమానాశ్రయ టెర్మినల్. ఇది ఏడాదికి 1.3 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తుంది. ఇది ఈశాన్య భారతంలోనే అతి పెద్ద విమానాశ్రయంగా రూపొందింది. 1.4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కొత్త ఇంటిగ్రెటెడ్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు.

## జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఉపయోగం లేదు

- పాత పద్దతిలోనే ఉపాధి హామీ కొనసాగాలి
- సిపిఎం నేత బివి రాఘవులు డిమాండ్



**విజయవాడ, డిసెంబర్20 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. దీనిలో కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవన్నారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని.. ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని.. అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని రాఘవులు తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుం దన్నారు. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని.. కానీ, ఇప్పుడు 60:40 శాతంగా మార్చి, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారాయన. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మళ్లీ ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. పథకానికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను బట్టి కాకుండా.. రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని రాఘవులు విమర్శించారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని.. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని వివరించారు. ఈ అంశంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని రాఘవులు విమర్శించారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందని.. ఈ రెండు పార్టీలు మోడీని చూసి భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు అనువుగా ఉండేలా పారిశ్రామిక పాలసీని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్, ఎలక్ట్రానిక్స్ సిటీ నిర్మించాలన్నారు. అక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం కూడా ఉందని చెప్పారు.

## ఇమ్రాన్‌ఖాన్‌కు మరో 17 ఏళ్ల జైలు

- తోషఖానా కేసులో శిక్ష



**ఇస్లామాబాద్(జనంసాక్షి) :** తోషఖానా అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు మరో 17 ఏళ్లు జైలు శిక్ష పడింది. ఆయన భార్య బుష్రా బీబీకి కూడా ఇదే శిక్ష విధిస్తూ పాకిస్థాన్ కోర్టు శనివారం తీర్పునిచ్చింది 2021లో ఇమ్రాన్ దంపతులు సౌదీలో పర్యటించారు. ఈ క్రమంలో ఆ దేశ యువరాజు వీరికి ఖరీదైన బుల్గారి ఆభరణాల సెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇమ్రాన్ ఈ సెట్‌ను తోషఖానాకు అప్పగించకుండా సొంత ప్రయోజనాల కోసం అమ్మేసుకున్నారనే ఆరోపణలపై కేసు నమోదైంది. దీనిపైనే తాజాగా విచారణ జరిగింది. ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఆ జైలులోనే జడ్జి అర్జుమంద్ విచారణ జరిపి.. ఇమ్రాన్ దంపతులకు 17ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పాటు ఒక్కొక్కరికీ 1.64 కోట్ల పాకిస్థానీ రుపాయలు జరిమానా కూడా విధించారు. ఇమ్రాన్ వయసు, ఆయన భార్య మహిళ అనే అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ తీర్పు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పాక్ కోర్టు తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేస్తామని ఇమ్రాన్ తరపు న్యాయవాది తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370